# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 165 | హైదరాబాద్ | శనివారం 20-12-2025 | పేజీలు : 12 | వెల : 1.00


11లో

భారత్‌తో సంబంధాల కోసం.. కీలకమైన డిఫెన్స్ పాలసీపై ట్రంప్ సంతకం



11లో

# ఉద్యోగ అభ్యర్థుల నిజాయితీకి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

- హైదరాబాద్‌లో పీఎస్‌సీ చైర్మన్ల జాతీయ సదస్సును ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము
- నైపుణ్యం లేకపోయినా శిక్షణతో మెరుగుపరచవచ్చు, నిజాయతీ లోపిస్తే కష్టమని వ్యాఖ్యలు
- అణగారిన వర్గాలకు సేవ చేయాలనే దృక్పథం అభ్యర్థుల్లో ఉండాలని సూచన

# ఢిల్లీని కమ్మేసిన దట్టమైన పొగమంచు..

## 152 విమానాల రద్దు

- శాటిలైట్ లింక్, క్యూబ్ నెట్‌వర్క్ హ్యాక్ చేసినట్లు వెల్లడి
- హెచ్‌డీ హబ్ టెలిగ్రామ్ ఛానల్ ద్వారా పైరసీ లింకుల అమ్మకం
- ఒక్కో లింక్‌కు 300 డాలర్ల వరకు వసూలు


11లో


11లో

ఏపీ అభివృద్ధికి

# చేయూతనివ్వండి..

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు నిధులు కోరిన సీఎం
- పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుకు ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి

ఆస్ట్రేలియాలో కాల్పులతో

# హైదరాబాద్‌కు సంబంధం లేదు

- బోండీ బీచ్‌లో కాల్పులు జరిగిన సాజిద్ అక్రమ్
- సాజిద్ అక్రమ్ హైదరాబాదీయే కానీ ఉగ్ర ఘటనతో నగరానికి సంబంధం లేదన్న శివధర్ రెడ్డి
- 1998లో ఉన్నతవిద్యాభ్యాసం కోసం వెళ్లి అక్కడే స్థిరపడినట్లు వెల్లడి



11లో


11లో

బంగ్లాదేశ్ లో అదుపు తప్పుతున్న

# పరిస్థితులు..

**తమ పౌరులకు అలర్ట్ జారీ చేసిన అమెరికా**

- ఇంక్విలాబ్ మంచ్ నేత హాదీ మృతితో బంగ్లాదేశ్‌లో హింస
- భారత వ్యతిరేకిగా ముద్రపడ్డ హాదీ
- తమ పౌరులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన అమెరికా
- బ్రిటన్ కూడా ట్రావెల్ అడ్వైజరీ జారీ

ఆర్భాటాలకు..

# కోట్లు ప్రజాధనం ఖర్చు..!

ప్రపంచ ఫుట్‌బాల్ చరిత్రలో లియోనెల్ మెస్సి ఒక లెజెండ్. ఆయన పేరు వినిపిస్తే చాలు... అభిమానుల్లో ఉత్సాహం ఉప్పొంగుతుంది. ఇదే ఉత్సాహాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తమ బ్రాండింగ్‌కు ఉపయోగించుకోవాలని భావించాయి. అందులో భాగంగా మెస్సి పేరు చుట్టూ సాగిన ఫుట్‌బాల్ ఈవెంట్ల నిర్వహణ ఇప్పుడు రాజకీయ దుమారానికి కేంద్రంగా మారింది. తెలంగాణ రాష్ట్రం పేరు ప్రపంచవ్యాప్తంగా వినిపించడానికి మెస్సి ఫుట్ బాల్ మ్యాచ్ నిర్వహణ ఒక కారణం అయ్యిండొచ్చు.. కానీ దాని నిర్వహణకు అయిన ఖర్చు.. అది ప్రజా ధనమే కదా..? దాని వల్ల రాష్ట్రానికి ఒరిగింది ఏమిటి అన్నది అర్థం కానీ ప్రశ్న.. ఒక లెజెండరీ ఆటగాడిని కలవడం.. మనవడితో అతన్ని ఆడించడం.. మీడియాకు ఫోజులు ఇవ్వడం.. చంకలు గుద్దుకోవడం మినహా సాధించింది ఏమీ లేదన్నది ప్రస్ఫుటంగా అర్థం అవుతోంది.. దీనికంటే ఈ మ్యాచ్ కి పెట్టిన ఖర్చు ఏదైనా ప్రజా సంక్షేమ కార్యక్రమానికి పెట్టి ఉంటే బావుండేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు..

12లో






హైదరాబాద్ ఓల్డ్ సిటీలో

# రూ.400 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

11లో

- పాతబస్తీలో 7 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం
- భూమి విలువ రూ.400 కోట్లు ఉంటుందని అంచనా
- దశాబ్దాలుగా కబ్జాలో ఉంచిన వారిని ఖాళీ చేయించిన అధికారులు
- హైడ్రా చర్యలపై స్థానిక ప్రజల హర్షం
- చెరువు, నాలాలను కూడా పునరుద్ధరించాలని విజ్ఞప్తి

# కొత్త అధ్యక్షులపై లోకేష్ మార్క్

విజయవాడ, డిసెంబర్ 19(భారత శక్తి ప్రతినిధి):

కూటమిలో ఆయనదే కీరోల్. ఏపీ సర్కార్‌ను నడిపించడంలో కూడా కీలక పాత్ర. తెలుగు దేశం పార్టీలో ఆయనే నంబర్ 2. అటు ప్రభుత్వంలో, ఇటు పార్టీలో కీలక వ్యవహారాలన్నీ లోకేశ్ చక్కబెడుతున్నారు. ఈ క్రమంలో లేటెస్ట్‌గా టీడీపీ జిల్లా అధ్యక్షుల నియామకం ఆసక్తికరంగా మారింది. 26 జిల్లాలకు అధ్యక్షులను ఖరారు చేశారు. రాష్ట్ర కార్యవర్గం కూర్పును పూర్తి చేశారు. ఇప్పటికే ఖరారు చేసిన 26 మంది ఎంపిక సమయంలో పార్టీ త్రిసభ్య కమిటీ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌తో చర్చించినట్లు తెలుస్తోంది.

అయితే టీడీపీ జిల్లా రథసారధుల లిస్ట్‌ను చూస్తే ఎక్కువగా కొత్తవారే ఉన్నారు. ఇందులో ఎక్కువ మంది లోకేశ్ టీమ్‌లోని కీలక లీడర్లుగా చెబుతున్నారు. జిల్లా అధ్యక్షుల నియామకంలో క్యాస్ట్ ఈక్వేషన్స్‌కు, సీనియారిటీకి ప్రయారిటీ ఇవ్వడంతో పాటు యువనేతలకు ప్రాధాన్యం ఇచ్చింది టీడీపీ హైకమాండ్. కొత్తగా అధ్యక్ష బాధ్యతలు తీసుకోబోయేవారిలో సీనియర్ లీడర్లు, మాజీ మంత్రులు పనబాక లక్ష్మి, కాలువ శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మన్ గద్దె అనురాధ, మాజీ ఎమ్మెల్యేలు మంతెన రామరాజు, కొమ్మాలపాటి శ్రీధర్, పిల్లి మాణిక్యాలరావు, బీద రవిచంద్ర, సుగవాసి ప్రసాద్ ఉన్నారు. సేమ్‌టైమ్ యువతకు కూడా అదే స్థాయిలో ప్రయారిటీ ఇచ్చారు. కిమిడి నాగార్జున, మోజోరు తేజోవతి, పట్టాభిరామ్, కోట్ని బాలాజీ, జ్యోతుల నవీన్, బొడ్డు వెంకటరమణ చౌదరి, గుత్తల సాయి, సలగల రాజశేఖర్, ఎంఎస్ రాజు, సి.భూపేష్ రెడ్డి వంటి వారు 40 నుంచి 50 ఏళ్ల మధ్యలోపు వారే. వీరంతా లోకేశ్ టీమ్‌గానే చెబుతున్నారు. లోకేశ్ టీమ్ అంటే అంతా యువనేతలే. పార్టీ రాష్ట్ర కార్యవర్గంలోనూ యంగ్ లీడర్లు..దూకుడుగా పనిచేసే నాయకులే ఉన్నారు. అయితే 26 జిల్లా అధ్యక్షుల్లో పదికి పైగా జిల్లాలకు పార్టీ పగ్గాలు..యువ నేతలకు ఇచ్చారు. అయితే ఈ క్రమంలో వైజాగ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో లోకేశ్ చేసిన కామెంట్స్ చర్చకు దారి తీస్తున్నాయి. యువ నాయకులంతా మిస్సైల్స్‌లాగా పనిచేస్తుంటే..సీనియర్ లీడర్లు జీపీఎస్‌లాగా డైరెక్షన్స్ ఇస్తున్నారని చెప్పారు లోకేశ్‌అంటే యువ నేతలంతా మిస్సైల్స్ లాగా దూసుకెళ్తుంటే ..సీనియర్ లీడర్లు జీపీఎస్ లాగా దారి చూపుతున్నారని చెప్పడం ఆసక్తికరంగా మారింది. ఏ మిస్సైల్ టార్గెట్‌ను చేజ్ చేయాలన్నా జీపీఎస్ మస్ట్ అన్నారు లోకేశ్. ఏపీ అభివృద్ధికి యువనేతలంతా మిస్సైళ్లలా పనిచేస్తుంటే..సీనియర్ నాయకులు జీపీఎస్‌లా మార్గదర్శకత్వం చేస్తున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు, అశోక్ గజపతిరాజు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు జీపీఎస్‌లైతే..కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేలు, తాను మిస్సైళ్లమని స్పష్టం చేశారు. అదే వేదికపై సీనియర్ లీడర్లు కూడా లోకేశ్‌కు ఎలివేషన్ ఇవ్వడం మరింత ఇంట్రెస్టింగ్ డిస్కషన్ అవుతోంది. యువగళం పాదయాత్రకు ముందు లోకేశ్‌ను చాలామంది లీడర్‌గా యాక్సెప్ట్ చేయని పరిస్థితి. అదే లోకేశ్‌ను ఇప్పుడు ఫ్యూచర్ లీడర్‌గా..ఇక చిన్నబాబే తమ పార్టీ అధినేత అన్నట్లుగా చెప్పుకుంటున్నారు. తమ వారసులను కూడా లోకేశ్



వెంట నడిచేలా ప్రోత్సహిస్తున్నారు టీడీపీ లీడర్లు. దీంతో టీడీపీలో టీమ్ లోకేశ్ కీరోల్ అయిపోయింది. ఇష్యూ ఏదైనా..పార్టీలో ఏ చిన్న పాబ్లమ్ ఉన్నా ఇట్టే సమసిపోయేలా చేయడంతో పాటు..నో డౌట్స్, నో కన్‌ఫ్యూజన్స్..వీఆర్ వన్ అనే ఇండికేషన్స్ పంపిస్తున్నారు. టీడీపీని మరో ముప్పై ఏళ్లు పవర్ ఫుల్ పార్టీగా ఉంచేలా..యంగ్ టీమ్‌ను ఎంకరేజ్ చేస్తున్నారు. సేమ్‌టైమ్ ఇప్పటివరకు ముప్పై ఏళ్లుగా పార్టీకి అండగా, పునాదుల్లా నిలిచిన నేతలను కూడా అదే స్థాయిలో గౌరవిస్తున్నారు. సలహాలు, సూచనలు మీవి..దూకుడుగా పనిచేసేది తామంటూ యువనాయకులతో స్ట్రాంగ్ ఫోర్స్‌గా నిలబడుతున్నారు లోకేశ్. ఈ స్ట్రాటజీ టీడీపీకి ఫ్యూచర్ బేస్డ్‌గా ఎంతో యూజ్ అవుతుందని..లోకేశ్ పనితీరు పార్టీకి రోజురోజుకు హైప్ తీసుకొస్తుందని అంటున్నారు తెలుగు తమ్ముళ్లు.

# తెరపైకి హెరాల్డ్ రగడ

దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీసిన అంశాల్లో నేషనల్ హెరాల్డ్ కేసు ఒకటి. కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను లక్ష్యంగా చేసుకుని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ద్వారా బీజేపీ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆ పార్టీ ఆరోపణలు చేసింది. ఢిల్లీలోని రోజ్ అవెన్యూ కోర్టు కేసు విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక ప్రైవేటు వ్యక్తి చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈడీ దాఖలు చేసిన చార్జ్‌షీట్‌ను పరిగణలోకి తీసుకోలేమని కోర్టు తెలిపింది. పీఎంఎల్ఏ చట్టం ప్రకారం మనీలాండరింగ్ కేసు కొనసాగడానికి షెడ్యూల్డ్ ఆఫెన్స్ (అంతర్లీన నేరం) ఆధారంగా ఎఫ్ఐఆర్ ఉండాలని కోర్టు స్పష్టం చేసింది. ఇది కాంగ్రెస్‌కు ఊరట కలిగించే అంశమైనప్పటికీ, కోర్టు నిర్ణయాన్ని ఈడీ సవాల్ చేసే అవకాశముంది. గత నవంబర్‌లో ఈడీ సమాచారం ఆధారంగా ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మరోవైపు రాహుల్‌పై కక్ష సాధింపు చర్యలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ శ్రేణులు దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునివ్వడం ప్రాముఖ్యతను సంతరించుకుంది. నేషనల్ హెరాల్డ్ కేసు నేపథ్యం ఒకసారి పరిశీలిద్దాం. 1938లో నేషనల్ హెరాల్డ్ వార్తా పత్రికను జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించారు. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్) అనే సంస్థ ఈ పత్రికను ప్రచురించేది. 1942లో బ్రిటీష్ ప్రభుత్వం నేషనల్ హెరాల్డ్ పత్రికను నిషేధించింది. 1945లో తిరిగి ప్రారంభమైన నేషనల్ హెరాల్డ్ పత్రికను ఆర్థిక కారణాలతో 2008లో మూసేయాల్సి వచ్చింది. నేషనల్ హెరాల్డ్‌ను మూసే సమయానికి ఏజేఎల్ సంస్థకు కాంగ్రెస్ పార్టీ రూ. 90 కోట్ల మేర బకాయి పడినట్లు సమాచారం. 2012లో బీజేపీ నేత సుబ్రమణియన్ స్వామి ఢిల్లీలోని స్థానిక ట్రయల్ కోర్టులో గాంధీ కుటుంబం మీద కేసు వేశారు. ఏజేఎల్ సంస్థకు చెందిన 2 వేల కోట్ల రూపాయలకు పైగా ఆస్తులను హస్తగతం చేసుకోవడం కోసం, ఆ సంస్థను తమ యాజమాన్యంలోకి తెచ్చుకోవటానికి కాంగ్రెస్ పార్టీ నిధులను ఉపయోగించుకుందని ఆయన ఆరోపించారు. సుబ్రమణియన్ ఫిర్యాదు ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. నేషనల్ హెరాల్డ్ పత్రికను ప్రచురించే ఏజేఎల్‌కు కాంగ్రెస్ పార్టీ రూ. 90 కోట్లకు పైగా వడ్డీలేని రుణం ఇచ్చిందని ఈడీ పేర్కొంది. ఆ రుణాన్ని రాహుల్ గాంధీ, సోనియా గాంధీలకు... మెజార్టీ వాటాలు ఉన్న యంగ్ ఇండియన్ లిమిటెడ్ (వైఐఎల్) సంస్థ ద్వారా రూ. 50 లక్షలు మాత్రమే చెల్లించి.. ఏజేఎల్‌కు చెందిన సుమారు రూ. 2 వేల కోట్లు సొంతం చేసుకున్నారని ఈడీ ఆరోపించింది. ఇది మనీలాండరింగ్ చర్య కిందకు వస్తుందంటూ ఈడీ 2025 ఏప్రిల్‌లో చార్జ్‌షీట్ దాఖలు చేసింది. కాగా ఈ కేసు దశాబ్దకాలంగా రాజకీయ వివాదంగా మారింది. నేషనల్ హెరాల్డ్ పత్రిక స్వాతంత్ర్యోద్యమంతో ముడిపడి ఉండటం, దాని ఆస్తులు ఢిల్లీ, ముంబై, లక్నోల్లో ఉండటంతో వివాదం మరింత ముదిరింది. కాంగ్రెస్ నాయకులు ఇది పత్రికను పునరుజ్జీవింపజేయడానికి చేసిన ప్రయత్నమని వాదిస్తుంటే, ఇది ఆస్తుల దుర్వినియోగమని ఈడీ ఆరోపిస్తోంది. తాజా కోర్టు నిర్ణయంతో సోనియా, రాహుల్‌లకు ఊరట లభించినప్పటికీ, కేసు పూర్తిగా ముగిసినట్టు కాదు. భవిష్యత్తులో మరిన్ని పరిణామాలు జరగవచ్చు. బ్లాక్ మనీని (చట్ట వ్యతిరేకంగా, అక్రమ మార్గాల ద్వారా సంపాదించిన డబ్బు)ను వైట్ మనీగా (చట్టబద్ధంగా) మార్చే ప్రక్రియనే మనీ లాండరింగ్ అని అంటారు. అక్రమ మార్గాల ద్వారా సంపాదించిన లేదా ఆదాయానికి మించి సమకూరిన సంపాదనను బ్లాక్ మనీ అని అంటారు. మనీ లాండరింగ్‌లో వివిధ దశలను, చోటు చేసుకునే విధానాన్ని బెంగళూరుకు చెందిన ఒక కార్పొరేట్ సంస్థలో యాంటీ మనీ లాండరింగ్ విభాగానికి నేతృత్వం వహిస్తున్న బిపిన్ నాయిర్ బీబీసీకి వివరించారు. మనీ లాండరింగ్ ప్లేస్‌మెంట్, లేయరింగ్, ఇంటిగ్రేషన్ అనే మూడు దశల్లో జరుగుతుంది. చట్ట వ్యతిరేకంగా సేకరించిన డబ్బును ఆర్థిక వ్యవస్థలోకి ప్రవేశపెట్టే దశను ప్లేస్‌మెంట్ అని అంటారు. మరొక రకంగా చెప్పాలంటే అక్రమంగా సంపాదించిన డబ్బును సక్రమ మార్గాల ద్వారా సంపాదించినట్లు చూపించే దశ. ఉదాహరణకు మీ చేతిలోకి అకస్మాత్తుగా పెద్ద మొత్తంలో ఆదాయానికి మించిన డబ్బు వచ్చింది. ఈ డబ్బు దొంగతనం, లంచాలు, దోపిడీలు, అవినీతి కార్యకలాపాల ద్వారా రావచ్చు. ఈ లావాదేవీలన్నీ సాధారణంగా నగదు రూపంలో జరుగుతాయి. ఉదాహరణకు ఒక వ్యక్తికి అక్రమ మార్గాల ద్వారా వారానికి రూ. 3లక్షల రూపాయిలు సమకూరుతున్నాయి. ఈ డబ్బును బ్యాంకులో డిపాజిట్ చేయాలి. అలా చేయడం వల్ల మాత్రమే ఆయన ఆ డబ్బును చట్టబద్ధమైన సొమ్ముగా చూపించగలరు. ఈ డబ్బును చిన్న మొత్తాలుగా విడదీస్తారు. 3 లక్షలను ఆరు భాగాలుగా విభజించి ఆరు సార్లు లావాదేవీలు నిర్వహిస్తారు. ఇలాంటి వాటిని ఒకే బ్యాంకులో కాకుండా వేర్వేరు బ్యాంకుల్లో ఉన్న అకౌంట్లలో జమ చేస్తారు. ఇందుకోసం నిబంధనలను కఠినంగా పాటించని బ్యాంకులను ఎంపిక చేసుకుంటారు. చట్ట వ్యతిరేకంగా సంపాదించిన డబ్బును ఆర్థిక వ్యవస్థలోకి ప్రవేశపెడతారు. విదేశాల్లో ఉండే షెల్ సంస్థలు లేదా అకౌంట్లకు కొంత సొమ్మును పంపిస్తారు. పన్ను ఎగవేతదారులకు స్వర్గధామాలుగా ఉన్న దేశాల్లో షెల్ సంస్థలు, అకౌంట్లను తెరుస్తారు. ఈ అకౌంట్లలోకి డబ్బును చేరుస్తారు. కొన్ని వ్యాపారాల్లో జరిగే లావాదేవీల్లో ఈ నల్లధనాన్ని వైట్ మనీతో చిన్న మొత్తాల్లో కలిపేస్తారు. ఉదాహరణకు నగదు లావాదేవీలు ఎక్కువగా జరిగే రియల్ ఎస్టేట్, క్యాసినో, క్లబ్‌లు, బార్ల లాంటి వ్యాపారాల్లో చేరుస్తారు. నల్ల ధనాన్ని సక్రమంగా సంపాదించిన ధనంగా చూపించేందుకు రకరకాల మార్గాలు అవలంభిస్తారు. బ్లాక్ మనీని బదిలీ చేసేందుకు ఇన్‌వాయిస్ మోసాలు చాలా ఎక్కువగా చేస్తారు. ఒక వస్తువు లేదా సేవల ఇన్‌వాయిస్ విలువను ఎక్కువ లేదా తక్కువ చేసి చూపిస్తారు. వస్తువులను మారు పేర్లతో రవాణా చేయడం (విలాసవంతమైన వస్తువులను తక్కువ విలువున్న వస్తువులుగా చూపించడం), ఉత్పత్తులను, సేవలను కొనకుండా కొన్నట్లు బిల్లులు చూపించడం ఇన్‌వాయిస్ మోసం కిందకే వస్తుంది. షెల్ కంపెనీలు, ఉనికిలోలేని సంస్థల నుంచి సామగ్రి కొనుగోలు చేసినట్లు రికార్డుల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కొన్నిసార్లు ధరలను కావాలనే ఎక్కువ చేసి చూపించినట్లు తేలింది. నగదు రూపంలో డబ్బులు చెల్లించి భూములు కూడా కొన్నట్లు వెలుగులోకి వచ్చింది. కంపెనీ ఖాతాలో వ్యక్తిగత ఖర్చులను కలిపి రాయడం, ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువ కంటే చాలా తక్కువకే భూములు కొనుగోలు చేయడం లాంటి అవకతవకలను కూడా అధికారులు గుర్తించారు.

డబ్బును ఆర్థిక వ్యవస్థలోకి వివిధ మార్గాల్లో ప్రవేశ పెట్టి, రకరకాల లావాదేవీలను నిర్వహిస్తారు. దీనిని న్యాయంగా సంపాదించిన డబ్బుగా చూపిస్తారు. డబ్బు పూర్తిగా ఆర్థిక వ్యవస్థలోకి ప్రవేశపెట్టగానే బ్యాంకు అకౌంట్లలోంచి నచ్చిన విలాసవంతమైన వస్తువులు కొనుక్కోవడం, విదేశీ పర్యటనలు చేయడం లాంటివి చేస్తారు. ఇందుకోసం నేరుగా బ్యాంకు నుంచి డబ్బులు విత్ డ్రా చేస్తారు. లేదా ఏటిఎం నుంచి డబ్బులు తీస్తారు. డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని వివరించేందుకు ఇంటిగ్రేషన్‌ను చాలా జాగ్రత్తగా చేస్తారు. తిరిగి ఈ డబ్బంతా రకరకాల అకౌంట్లు, వ్యక్తుల చుట్టూ తిరిగి నేరస్థుడు లేదా అసలైన యజమానిని చేరుతుంది. ఈ దశలో బ్లాక్ మనీకి, వైట్ మనీకి మధ్య తేడా కనిపెట్టడం చాలా కష్టంగా మారుతుంది. ఈ డబ్బును ఎలా కావాలంటే అలా ఉపయోగించుకోవచ్చు. ఇక ఎవరూ తమను పట్టుకోలేరనే ధీమాతో లాండరర్ అక్రమంగా సంపాదించిన డబ్బును విచ్చలవిడిగా ఖర్చు పెడతారు.

# పర్యాటక శాఖ పరిధిలోకి రుషికొండ ప్యాలెస్

విశాఖపట్టణం, డిసెంబర్ 19(భారత శక్తి ప్రతినిధి):

గత వైసీపీ ప్రభుత్వంలో కోట్లు ఖర్చు పెట్టి వైజాగ్‌లో నిర్మించిన రిషికొండ భవనాన్ని టూరిజం శాఖకు ఆదాయం తెచ్చేలా డెవలప్ చేస్తామన్నారు ఏపీ మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, డోలా బాలవీరాంజనేయస్వామి. రుషికొండ ప్యాలెస్‌ను ఏ విధంగా వినియోగించాలన్న అంశంపై నిర్ణయం తీసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్ కమిటీలో వీరు సభ్యులు. గత ప్రభుత్వం అధునాతనంగా నిర్మించిన రిషి కొండ ప్యాలెస్ ఖర్చు 500 కోట్లు అంటూ అప్పటి విపక్షాలైన టీడీపీ, జనసేన పదే పదే ఆరోపించాయి. అయితే తాము అధికారంలోకి వచ్చాక ఆ భవనాన్ని ఎలా వాడాలి అన్నది అర్థం కావడం లేదు అన్నట్టు చెప్పుకొచ్చారు. ప్రతీ నెలా దాని నిర్వహణ ఖర్చు ప్రభుత్వానికి భారంగా మారింది. అందుకే రిషి కొండ ప్యాలస్‌ని ఏం చెయ్యాలి అనే దానిపై చర్చించడానికి మంత్రుల కమిటీ వేసింది ప్రభుత్వం. వారి భేటీ వెలగపూడి సచివాలయంలో జరిగింది. ఈ భేటీలో మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, డోలా బాలవీరాంజనేయస్వామి, పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్, టూరిజం ఎండీ, ఏపీటీఏ సీఈవో ఆమ్రపాలి పాల్గొని సుదీర్ఘంగా చర్చించారు గత భేటీలో సూచనల మేరకు ప్రజలు, స్టేక్ హోల్డర్స్ అభిప్రాయాన్ని పర్యాటక శాఖ అధికారులు సబ్ కమిటీ ముందుంచారు. రుషికొండ ప్యాలెస్ ను ఏ విధంగా వినియోగించాలన్న అంశంపై వెబ్ సైట్ లో స్పందన కోరగా 1517 మంది ప్రజలు, 44 మంది స్టేక్ హోల్డర్స్ అభిప్రాయం వ్యక్తం చేశారని అత్యధిక శాతం ప్రజలు గత ప్రభుత్వం చేసిన తప్పును త్వరితగతిన సరిదిద్ది ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని కోరారని వెల్లడించారు. మరికొందరు హోటల్, రిసార్ట్, మ్యూజియం, ఆర్ట్ గ్యాలరీ, సైన్స్ ప్లానిటోరియం, మైస్, వెల్ నెస్ సెంటర్ గా, ప్రభుత్వ కార్యాలయంగా వినియోగిస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేసినట్లు సబ్ కమిటీ వెల్లడించింది. అంతిమంగా సంస్థల సమర్థతను పరిగణలోకి తీసుకొని ప్రజలకు ఉపయోగపడుతూనే, ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టేలా రుషికొండ ప్యాలెస్ ను వినియోగించేలా నిర్ణయం తీసుకుంటామని సబ్ కమిటీ పేర్కొంది. ఈ సందర్భంగా హైదరాబాద్ లోని ఫలక్ నామా ప్యాలెస్ కట్టడాన్ని సహజత్వం



కోల్పోకుండా ఏ విధంగా వినియోగిస్తున్నారనే అంశాన్ని ఉదహరించారు. మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, డోలా బాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వం రుషికొండపై పర్యాటక శాఖకు అధిక ఆదాయాన్నిచ్చే హరిత రిసార్ట్స్ స్థానంలో విజయనగర, కళింగ, చోళ, పల్లవ, గజపతి, వేంగి, ఈస్టర్స్ గంగ తదితర పేర్లతో కూడిన 7 బ్లాక్ లతో 19,968 చదరపు మీటర్లలో రాజప్రాసాదం లాంటి ప్యాలెస్ ను నిర్మించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వ నిర్ణయం వల్ల ప్రస్తుతం ప్రతి నెలా 25-30 లక్షల మెయింటెనెన్స్ చార్జీల భారం పడుతోందన్నారు. ఈ నేపథ్యంలో త్వరితగతిన వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ప్రజలు, స్టేక్ హోల్డర్స్ అభిప్రాయాన్ని తీసుకున్నామని త్వరలోనే దీన్ని పర్యాటక శాఖకు ఆదాయం వచ్చేలా, ప్రజలకు కూడా ఉపయోగపడేలా సముచిత నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇప్పటికే టాటా, అట్మోస్ఫియర్ కోర్, ఐహెచ్ సీఎల్, హెచ్ఈఐ తదితర సంస్థలు ప్యాలెస్ ను ఏ విధంగా వినియోగిస్తే బాగుంటుందో తమ అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లిబుచ్చాయని, మరికొన్ని విదేశీ సంస్థలు కూడా అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయన్నారు. కొన్నింటికి పూర్తిస్థాయి స్పష్టం రావాల్సి ఉందన్నారు. మరో భేటీకి పూర్తి స్పష్టత వస్తుందని అనంతరం రెండు మూడు ప్రతిపాదనలు కేబినెట్ దృష్టికి తీసుకెళ్లి ఆ తర్వాత సీఎం చంద్రబాబునాయుడు సూచనల మేరకు తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. సాధ్యమైనంత త్వరగా మరోసారి భేటీ అయి రుషికొండ ప్యాలెస్ పై కీలక నిర్ణయం తీసుకుంటామని సబ్ కమిటీ పేర్కొంది. సమావేశంలో పర్యాటక శాఖ అధికారులు రుషికొండ ప్యాలెస్ కు సంబంధించిన ప్రజెంటేషన్ ఇచ్చారు.

# స్వర్ణగ్రామాలుగా సచివాలయాలు

విజయవాడ,డిసెంబర్ 19(భారత శక్తి ప్రతినిధి):


ఏపీ సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ఏపీలో గ్రామ, వార్డు సచివాలయాల పేర్లను మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. వాటి పేర్లను స్వర్ణగ్రామం శాఖగా మార్చుననట్లు ప్రకటించారు. కలెక్టర్ల సమావేశంలో చంద్రబాబు ఈ ప్రకటన చేశారు. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు జారీ అవుతాయని తెలిపారు. ఒకటి లేదా లేదు రోజుల్లో దీనికి సంబంధించి జీవో జారీ చేసే అవకాశముందని తెలుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిల్లో చాలా మార్పులు చేస్తుండగా.. ఇప్పుడు పేరును మార్చడం చర్చనీయాంశంగా మారింది. అమరావతిలోని సచివాలయంలో బుధవారం కలెక్టర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా వాటి పేరును స్వర్ణగ్రామంగా త్వరలో మార్చుతున్నట్లు చంద్రబాబు స్పష్టతిచ్చారు. వీటి పేరును మార్చుతారనే ప్రచారం ఎప్పటినుంచో జరుగుతోంది. స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాను విజన్ యూనిట్లుగా ఉపయోగించుకోవాలని గతంలో చంద్రబాబు సూచించారు. విజన్ సాధించడంలో వీటి పాత్ర కీలకమని తెలిపారు. ఆ విజన్‌లో భాగంగా రాష్ట్రాభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక తయారుచేశారు. ఈ క్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల పేర్లు మార్చడం హాట్‌టాపిక్‌గా మారింది. గ్రామ స్థాయిలో గ్రామ, వార్డు సచివాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇంతకముందు ఏదైనా ప్రభుత్వ సేవలు, సర్టిఫికేట్లు పొందాలంటే ఎమ్మార్వో ఆఫీస్‌కు వెళ్లాల్సి వచ్చింది. ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ రోజులపాటు తిరగాల్సి వచ్చేది. కానీ గ్రామ సచివాలయాలు వచ్చాక ఊర్లోనే ప్రజలు అన్నీ ప్రభుత్వ సేవలు పొందుతున్నారు. ఏదైనా సర్టిఫికేట్ కావాలన్నా ఇక్కడికి వెళ్లి దరఖాస్తు పెట్టుకుంటే వెంటనే మంజూరు చేస్తున్నారు. అందుకేకాకుండా సచివాలయ ఉద్యోగులు నేరుగా ఇంటికి వచ్చి సేవలు అందిస్తున్నారు.

=====================

# మెడికల్ కాలేజీ అంశంలో సక్సెస్ అయినట్టేనా

విజయవాడ, డిసెంబర్ 19(భారత శక్తి ప్రతినిధి):

అధికారం పోయి 18 నెలలు. ఈ ఏడాదిన్నరలో వైసీపీ అపోజిషన్ రోల్‌కు ఎన్ని మార్కులని అడిగితే అందరికీ క్వశ్చన్ మార్కే. మాజీ సీఎం జగన్ ఇష్యూ బేస్డ్‌గా జిల్లాల పర్యటన చేసినా..పరామర్శల పేరుతో హడావుడి చేసినా..ఆయన చేపట్టిన




ప్రతీ కార్యక్రమం ఏదో ఒక విధంగా రచ్చకు దారి తీసింది. రెంటపాళ్ల పర్యటనలో రప్పా రప్పా రచ్చ..మామిడి, మిర్చి రైతుల పరామర్శలో తోపులాటలు, కేసులు అంటూ ఇష్యూ డైవర్ట్ అయింది. ఒక మెడికల్ కాలేజీ అంశంలో మాత్రం వైసీపీ దూకుడుగా ముందుకు వెళ్లిందన్న టాక్ వినిపిస్తోంది. వైసీపీ హయాంలో కట్టిన..ఇంకా నిర్మాణంలో ఉన్న కాలేజీలను పీపీపీ విధానంలో నడిపించాలని కూటమి ప్రభుత్వం భావించగా.. వైసీపీ తీవ్రంగా అపోజ్ చేస్తోంది. పేదలకు ఉన్నత వైద్య, విద్య అందాలనే లక్ష్యంతో..ఎన్నో ప్రయాసలకు ఓర్చి మెడికల్ కాలేజీలు కడితే ప్రైవేటును భాగస్వామ్యం చేయడమేంటంటూ గళమెత్తారు. ఈ నేపథ్యంలో మెడికల్ కాలేజీల పర్యటనలు చేశారు వైసీపీ లీడర్లు. చివరకు మాజీ సీఎం జగన్ కూడా నర్సీపట్నం మెడికల్ కాలేజీని విజిట్ చేసి..పీపీపీ విధానంపై మొండిగా ముందుకెళ్తే..తాము వచ్చాక రద్దు చేస్తామని బిగ్ స్టేట్‌మెంట్ ఇచ్చి చర్చకు దారి తీశారు. దీంతో కూటమి ప్రభుత్వ పెద్దలు రియాక్ట్ అయ్యేలా వైసీపీ ఒత్తిడి పనిచేసిందన్న ఒపీనియన్స్ ఉన్నాయి. ఎమ్మెల్యేలు, ఎంపీల సంఖ్యా పరంగా అంతంత మాత్రంగానే బలం ఉన్న కాంగ్రెస్..మెడికల్ కాలేజీల ఇష్యూలో బలంగా ప్రజల్లోకి వాయిస్ తీసుకెళ్లగలిగింది. టీడీపీ నేతలు చెప్తున్నదేంటి..తాము కట్టిన మెడికల్ కాలేజీలు ఎన్ని..ఇంకా నిర్మాణంలో ఉన్న కాలేజీలు ఎన్ని అనే విషయాన్ని సోషల్ మీడియా ద్వారా జనాల్లో చర్చ పెట్టగలిగారు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలను నిర్వహిస్తే వచ్చే సమస్యలేంటి.? ప్రజలకు జరిగే నష్టమెంత.? అనేదానిపై తమ వాయిస్‌ను వినిపించడంలో వైసీపీ అంతో ఇంతో సక్సెస్ అయిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మెడికల్ కాలేజీల పీపీపీ విధానాన్ని వ్యతరేకిస్తూ..చివరకు కోటి సంతకాలు సేకరణ పేరుతో ప్రజా ఉద్యమానికి పిలుపు ఇచ్చారు వైఎస్ జగన్. ఈ ఏడాది అక్టోబర్‌లో గ్రామాల్లో రచ్చబండ పేరుతో మొదలైన సంతకాల సేకరణ కార్యక్రమం కాస్త లేటైనా..కోటి 4 లక్షల 11 వేల 136 మంది సంతకాలు చేశారు. విద్యార్థులు, మేధావులు..అన్ని వర్గాల ప్రజలతో కోటి సంతకాల సేకరణ చేపట్టి..రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశారు. పార్టీ ముఖ్యనేతలతో కలిసి గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో భేటీ అయిన జగన్..మెడికల్ కాలేజీల పీపీపీ విధానంపై ప్రజల అభిప్రాయాలను వివరించారు. ఈ ఏడాదిన్నర కాలంలో వైసీపీ పూర్తిగా డిఫెన్స్‌లో ఉందనే చర్చ ఉంది. ఘోరంగా ఓడిపోయి.. అధికారం కోల్పోయిన బాధ ఓ వైపు ఉండగానే.. నేతల వరుస అరెస్టులు, ఒక కేసు తర్వాత మరో కేసు ముఖ్యనేతలను వెంటాడటం..ఫ్యాన్ పార్టీకి ఇబ్బందికరంగా మారింది. ఈ క్రమంలో ప్రతిపక్షంలోకి వచ్చాక వైసీపీ చేపట్టిన ఏ కార్యక్రమం పెద్దగా ప్రజల్లోకి వెళ్లలేదని..ఏ అంశంలో కూడా వైసీపీ అప్పర్ హ్యాండ్ సాధించలేదన్న టాక్ ఉంది. ఒక్క మెడికల్ కాలేజీల అంశంలో మాత్రం ఫ్యాన్ పార్టీ పూర్తిస్థాయిలో అపోజిషన్ పాత్ర పోషించిందని..నిరసనలు తెలపడమే కాదు..ప్రజల్లోకి చర్చ పెట్టగలిగారని అంటున్నారు పొలిటికల్ ఎనలిస్టులు. సేమ్‌టైమ్ తాము అధికారంలోకి వస్తే పీపీపీ విధానాన్ని రద్దు చేస్తామని చెప్పడం ద్వారా..జగన్ తన స్టాండ్ ఏంటో క్లియర్ కట్ చెప్పినట్లు అయిందని చెబుతున్నారు. దీంతో ఎడ్యుకేటెడ్ సెక్టార్‌కు ఓ సంకేతం పంపించారని..వైసీపీ నేతలు చర్చించుకుంటున్నారు. ఏదైనా ఏడాదిన్నర కాలం ప్రతిపక్ష హోదాలో వైసీపీ సాధించిన అతిపెద్ద విజయంగా మెడికల్ కాలేజీ అంశాన్ని చెప్పుకుంటున్నారు ఫ్యాన్ పార్టీ లీడర్లు.

# వైసీపీలో తిరుగుబాటు!

ఒంగోలు, డిసెంబర్ 19(భారత శక్తి ప్రతినిధి):

సాధారణంగా ఏదైనా రాజకీయ పార్టీకి ఓటమి ఎదురైతే గుణపాఠాలు నేర్చుకుంటుంది. తనలో కొన్ని రకాల మార్పులు తెచ్చుకుంటుంది. కానీ ఎందుకో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆ పరిస్థితి లేదు. ఆ పార్టీ నాయకత్వంలో మార్పు కంటే.. పార్టీలో నేతల మార్పున కే ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తోంది. అలా ఎందుకు చేస్తుందో అర్థం కావడం లేదు. ఒక నేతను అధికారుల మాదిరిగా బదిలీ చేస్తున్నట్టు వేరే జిల్లాల్లో పోటీ చేయించడం అనేది ఇండియన్ పొలిటికల్ హిస్టరీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే చూసాం. ఎంతకాలం ఈ మార్పులతో అని సొంత పార్టీ నేతలు అధినేత జగన్మోహన్ రెడ్డి వైఖరిపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బదిలీ చేస్తే ఊరుకున్నాం కానీ.. ఇప్పుడు అపోజిషన్ లో ఉండగా బదిలీ చేయడం ఏమిటని.. సొంత జిల్లా, సొంత ప్రాంతం వదులుకొని వేరే చోట రాజకీయం చేయడం ఏమిటనేది నేతల వాదన. ఒక ప్రయోగం వికటించింది. మళ్లీ అటువంటి ప్రయోగాన్ని అనుసరించడం ఎంతవరకు కరెక్ట్ అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు నిలదీసినంత పని చేస్తున్నారు. 2014 ఎన్నికల్లో కొత్తవారితో ప్రయోగం చేశారు జగన్మోహన్ రెడ్డి. కానీ మిశ్రమ ఫలితాలు వచ్చాయి. రాయలసీమలో కొత్త వారితో పాటు సీనియర్లు గెలవగలిగారు. కోస్తాలో సైతం కొంత ఫలితం ఇచ్చింది. గోదావరి తో పాటు ఉత్తరాంధ్రలో అరకొర స్థానాలను అలా కైవసం చేసుకున్నారు. 2019 విషయానికి వచ్చేసరికి కొత్త వారికి ఎక్కువగా చాన్స్ ఇచ్చారు. దాదాపు అందరూ గెలిచేశారు. అయితే అప్పటివరకు తన ముఖం చూసి వేశారని భావించారు జగన్మోహన్ రెడ్డి. మరి అదే ధీ మా 2024 ఎన్నికల్లో ఉండాలి కదా. తన పాలన రెఫరెండం అనుకోవచ్చు కదా. కానీ అలా అనుకోలేదు. తాను గుడ్.. మీరు బ్యాడ్ అన్నట్టు ఎమ్మెల్యే అభ్యర్థులను మార్చేశారు. 80 చోట్ల మార్పులు చేశారు. కానీ ఆ ప్రయోగం దారుణంగా విఫలమయింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దారుణ పరాజయం ఎదురయింది. ఇప్పుడు కూడా అదే ప్రయోగం మొదలుపెట్టారు జగన్మోహన్ రెడ్డి. ఇప్పటికీ అదే ధోరణితో ముందుకు వెళుతున్నారు. ఎక్కడో చిలకలూరిపేట లో ఉన్న విడదల రజిని తీసుకొచ్చి రేపల్లెలో పోటీ చేయమంటున్నారు. ఎక్కడో నెల్లూరు జిల్లాకు చెందిన అనిల్ కుమార్ యాదవ్ ను తెచ్చి గుంటూరులో పోటీ చేయమంటున్నారు. ఇప్పటికీ ఆ నియోజకవర్గాల ప్రయోగం అలానే చేస్తున్నారు. గత ఎన్నికల్లో మార్చిన 80 మంది అభ్యర్థులను సొంత ప్రాంతాలకు పంపించడం లేదు. తెలియని ఊరిలో రాజకీయం చేయమంటే



ఎలా అని ఆవేదనతో ఉన్నారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఉన్న ఊరిలోనే రాజకీయం చేస్తామంటే కుదరని రోజులు ఇవి. ఎక్కడికో వెళ్లి రాజకీయాలు చెయ్యమనడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి పులివెందులను కాదని ఉత్తరాంధ్రకు వచ్చి పోటీ చేయగలరా? అంతెందుకు పులివెందులను విడిచిపెట్టి కడప జిల్లా కేంద్రానికి రాగలరా? ఇలా ఎన్నెన్నో నిలదీసినంత ప్రశ్నలు వైసిపి నుంచి వస్తున్నాయి. మళ్లీ చేర్పులు మార్పులు అంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే అసహనం పెరగడం ఖాయం. ఇక తేల్చుకోవాల్సింది జగన్మోహన్ రెడ్డి మాత్రమే.

## కొత్తగూడెంలో చాలా కంపేనీలు మూటపడ్డాయి

కొత్తగూడెం డిసెంబర్ 18, జాగృతి నేత కవిత మణుగూరు లో పర్యటించారు. కవిత మాట్లాడుతూ జనంబాటలో భాగంగా 13 జిల్లాల పర్యటన పూర్తి చేసుకున్నాం. కొత్తగూడెం లో రెండు రోజుల పాటు ప్రజల సమస్యలు తెలుసుకోనున్నాం. కొత్తగూడెం లో పుట్టిన వారికి హైదరాబాద్ రావాల్సిన అవసరం లేదని మేము అనుకునే వాళ్లం. అన్ని కంపెనీలు, ఉద్యోగాలు వాళ్లకు ఉంటాయని గతంలో అనుకున్నాం. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. చాలా కంపెనీలు మూత పడ్డాయని అన్నారు. పెద్ద కంపెనీలు కొత్తగా ఉద్యోగులను తీసుకోవటం లేదు. స్థానికులకు అవకాశాలు రావటం లేదు. ఇండస్ట్రియల్ కారిడార్ లో కొత్త కంపెనీలు రావటం లేదు. కొత్తగూడెంలో ఉన్న 12 లక్షల మంది ప్రజల అభివృద్ధి కోసం మంచి కార్యాచరణ చేపడతాం. అందులో భాగంగానే రెండు రోజులు ప్రజల సమస్యలను తెలుసుకోవటం జరుగుతుంది. హెచ్ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ శ్రీలత తో ఇప్పుడు మనం ఉన్నాం. సింగరేణి కార్మికుల సమస్యలపై హెచ్ఎంఎస్, జాగృతి కలిసి పోరాటం చేస్తున్నాయి. హైదరాబాద్ లోని సింగరేణి భవన్ ను ముట్టడిస్తేనే మెడికల్ బోర్డు పెట్టారు. కానీ ఆ మెడికల్ బోర్డు కార్మికులను మోసం చేసే విధంగా ఉంది. సింగరేణికి పుట్టినిల్లు అయిన కొత్తగూడెంకు రావటం నా అదృష్టం. కొత్తగూడెం జిల్లా అభివృద్ధి కోసం జాగృతి డెడికేటెడ్ గా పనిచేస్తుందని అన్నారు.

## ఎమ్మెల్యేలు పనితీరు పై నెగిటివ్ ఉందా

విజయవాడ, డిసెంబర్ 19(భారత శక్తి ప్రతినిధి):

ప్రభుత్వ అధినేత తీసుకునే నిర్ణయాలు కొంత వరకే పనిచేస్తాయి. కానీ ఎమ్మెల్యేల పనితీరు మాత్రం తీవ్రంగా ప్రభావం చూపుతాయి. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలను మాత్రమే చూస్తారు. ఇప్పుడు కూటమి పార్టీలకు కూడా ఇదే తలనొప్పిగా మారింది. 164 స్థానాల్లో కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీలు గెలిచాయి. అది మొన్నటి ఎన్నికల్లో వరంగా కనిపించినా రానున్న ఎన్నికల్లో శాపంగా మారనున్నాయి. ఎందుకంటే ఖచ్చితంగా లోకల్ ఎమ్మెల్యేలపై ప్రతికూలత ఉంటుందన్నది వాస్తవం. ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచిన వారు అన్ని సమస్యలను పరిష్కరించలేరు. అదేసమయంలో అనేక కొత్త సమస్యలు వచ్చిపడతాయి. వాటిని పరిష్కరించుకోవాలంటే ప్రభుత్వం నుంచి నిధులు అందడం లేదుగతంలో సంక్షేమ పథకాలు తక్కువగా.. అభివృద్ధి పనులకు ఎక్కువగా నిధులు వినియోగించేవారు. కానీ 2019 నుంచి ఆ పరిస్థితి మారింది. నాడు జగన్ ప్రభుత్వమైనా, నేడు కూటమి ప్రభుత్వమైనా సంక్షేమానికి పెద్దపీట వేస్తుంది. అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించలేకపోతుంది. మరొకవైపు కూటమి ప్రభుత్వానికి రాజధాని అమరావతి ప్రధానంగా మారింది. దీంతో నిధులు, తీసుకు వచ్చిన అప్పులు రాజధాని అమరావతిలోనే కుమ్మరిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సయితం అమరావతికి తీసుకు వచ్చిన రుణాలను వేరే వాటికి ఉపయోగించలేమని, అలాగే తీసుకున్న అప్పులను కూడా కొన్నింటికే పరిమితం చేస్తామని పదే పదే చెబుతున్నారు. మరొకవైపు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో పనులు జరగకపోవడంతో పాటు మద్యం, ఇసుక వంటి వాటిల్లో వేలుకాదు.. ఏకంగా చేతులే పెట్టేశారు. అదీ కూటమికి ఇబ్బందికరంగా మారింది. 164 మంది కూటమి ఎమ్మెల్యేల్లో అత్యంత తక్కువగా అంటే దాదాపు నలభై మంది ఎమ్మెల్యేలు మాత్రమే నిధులు ఎలాగోలా తెచ్చుకుని తమ నియోజకవర్గాల్లో సమస్యలను పరిష్కరించుకుంటున్నారు. మిగిలిన 120కి పైగా స్థానాల్లో ఎమ్మెల్యేలు మంత్రుల చుట్టూ తిరిగినా ఫలితం కనిపించడం లేదని వాపోతున్నారు. దీంతో ఇటు ఎమ్మెల్యేల అక్రమాలు, అవినీతి మరొకవైపు నియోజకవర్గాల్లో సమస్యలు పేరుకుపోవడం కూటమి పార్టీకి మైనస్ గా మారింది. మరో మూడేళ్లలో వీటి నుంచి బయటపడాలంటే మాత్రం పెద్దయెత్తున కసరత్తు జరగాల్సి ఉంటుంది.

# వైసీపీలో ఆ ఇద్దరూ ఔట్!

తిరుపతి డిసెంబర్ 19(భారత శక్తి ప్రతినిధి):

సాధారణంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో అవకాశాలు చాలా ఈజీగా వస్తాయి. అంతే సులువుగా వదిలించుకుంటారు కూడా. ఈ విషయంలో జగన్మోహన్ రెడ్డి ప్రత్యేకమే. ఎవరి సిఫారసులతో పని ఉండదు. ఎవరి సిఫారసులు అక్కడ పని చేయవు. ఆయనకు ఇష్టం అయితే అందలం ఎక్కిస్తారు. ఇష్టం లేకపోతే వారితో నష్టం అని తెలిసిన పట్టించుకోరు. తన నిర్ణయం తాను తీసుకుంటారు. అయితే వాడుకున్నంత కాలం పార్టీ కోసం వాడుకుంటారు. తరువాత నిర్మొహమాటంగా చెప్పేస్తారు. ఇప్పుడు ఓ ఇద్దరు మహిళ నేతల విషయంలో కూడా జగన్మోహన్ రెడ్డి అదే అభిప్రాయానికి వచ్చారు. వచ్చే ఎన్నికల్లో మాజీ మంత్రి రోజాకు టికెట్ లేదు అని తేల్చేసారట. మరో మాజీ మంత్రి విడదల రజినీకి అయితే వేరే నియోజకవర్గానికి షిఫ్ట్ అయితేనే సీటు అని కండిషన్ పెట్టారట. అయితే ఆమె ప్లేస్ లో కొత్తగా పార్టీలోకి వచ్చిన యాంకర్ శ్యామలను రంగంలోకి దించుతారని ప్రచారం నడుస్తోంది. నగిరి లో రోజా పరిస్థితి బాగాలేదు. ఆమెను దింపిన ప్రయోజనం లేదు. అందుకే జగన్మోహన్ రెడ్డి వేరే ఆలోచనకు వచ్చారు. పార్టీ కోసం పని చెయ్.. అధికారంలోకి వచ్చాక చూద్దాం అన్నట్టు ఆమెను సముదాయించినట్లు ప్రచారం నడుస్తోంది. పైగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆమె విషయంలో సానుకూలంగా. ఒక్క భూమన కరుణాకర్ రెడ్డి మాత్రం సానుకూలంగా ఉన్నారు. అయితే రోజా కోసం సిఫార్సు చేసే అంతటి పరిస్థితి ఆయనలో కనిపించడం లేదు. త్వరలో నగరికి కొత్త ఇన్చార్జిని ప్రకటించే అవకాశం ఉంది. అది జరిగితే రోజా ఏదో ఒక నిర్ణయం తీసుకుంటారు. అయితే ఇప్పటికే ఆమెకు కొంత సంకేతాలు అందాయి. అందుకే ఆమె పార్టీకి దూరంగా ఉంటున్నారు. తమిళ చిత్రసీమలో అవకాశాలు వెతుక్కుంటున్నారు. ఎందుకంటే గత అనుభవాల దృష్ట్యా తెలుగు చిత్ర పరిశ్రమలో ఆశించిన స్థాయిలో అవకాశాలు లేవు. తమిళనాడులో అయితే అటు చిత్ర పరిశ్రమతో పాటు కొత్తగా విజయ్ పార్టీ ఏర్పాటు చేయడంతో.. ఆ పార్టీలో చేరి రాజకీయాలు చేసుకోవచ్చని రోజా భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే నగిరి కి కొత్త ఇన్చార్జి వస్తే కానీ దీనిపై క్లారిటీ రాదు. వైసీపీ అధికార ప్రతినిధిగా ఉన్నారు యాంకర్ శ్యామల హైదరాబాదులో ఉంటూ ఆమె వైసీపీ రాజకీయాలు చేస్తున్నారు. అయితే ఆమెను ఏపీకి తెచ్చి చిలకలూరిపేట ఇన్చార్జ్ చేసేందుకు జగన్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. మరి అదే జరిగితే రజిని పరిస్థితి ఏంటి అనేది ఒక ప్రశ్న. అయితే ఇప్పటికే విడదల రజనీకి రేపల్లె వెళ్ళమన్నారట జగన్. ఎన్నికలకు ముందు గుంటూరు పంపించి ఆమెను రాజకీయంగా బలిపశువు చేశారు. ఇప్పుడు చిలకలూరిపేట వస్తానంటే అడ్డుపడుతున్నారు. రేపల్లె వెళ్ళమంటున్నారు. అక్కడ అనగాని సత్య ప్రసాద్ గట్టి నాయకుడిగా ఉన్నారు. మంత్రిగా తన మార్కు చూపుతున్నారు. అక్కడికి వెళ్తే తట్టుకోలేనని రజిని ఆందోళన చెందుతున్నారు. ఉంటే చిలకలూరిపేటలో ఉండి రాజకీయం చేస్తా.. లేకపోతే వేరే పార్టీలో చేరుతానని ఆమె వైసీపీకి లీకులు ఇస్తున్నారు. అయితే జగన్మోహన్ రెడ్డి ఆమె విషయంలో సానుకూలంగా లేరు. ఆమెతోపాటు రోజాను వదిలించుకుంటే మంచిదన్న నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. యాంకర్ శ్యామల అయితే పవన్ కళ్యాణ్ పై పంచ్ డైలాగులతో రెచ్చిపోతున్నారు. అందుకే ఆమెకు ఒక ఛాన్స్ ఇద్దామని రజినీకి పొగ పెడుతున్నారు. కొద్ది రోజుల్లో ఆ ఇద్దరు మాజీ మంత్రుల భవితవ్యం ఉంది. మొత్తానికి యాంకర్ శ్యామల తన కెరీర్ వదులుకున్నారు కానీ.. ఆమె కెరీర్ కు ఇప్పుడు జగన్ అండగా నిలుస్తున్నారు.

# సీమలో సైలెంట్ వేవ్...

కర్నూలు, డిసెంబర్ 19,

రాయలసీమలో వైసీపీ క్రమంగా పుంజుకునట్లు కనిపిస్తుంది. కూటమి పార్టీ నేతల్లో విభేదాలతో పాటు వైసీపీ పట్ల సానుకూలత ఒకరకంగా వైసీపీకి వచ్చే ఎన్నికల్లో కలసి వచ్చే అంశంగా కనిపిస్తుంది. రాయలసీమలో మొత్తం యాభై రెండు శాసనసభ నియోజకవర్గాలున్నాయి. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుండటంతో పాటు పంటలకు సరైన గిట్టుబాటు ధర లభించకపోవడంతో పాటు రాజధాని అమరావతికే తెచ్చిన రుణాలన్నీ పెడుతున్నారన్న ప్రచారం కూడా కూటమి పార్టీలకు ఇబ్బందికరంగా మారిందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. గత ఎన్నికల్లో ఒక ఊపు ఊపిన కూటమి ఈసారి మాత్రం కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొన్నాయని ఖచ్చితంగా చెప్పాలి. అందులోనూ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల ప్రభావం కూడా కూటమి పై ప్రతికూలత చూపుతుందని అంటున్నారు. గత ఎన్నికల్లో కర్నూలులో పథ్నాలుగు స్థానాలుంటే రెండు స్థానాల్లో మాత్రమే వైసీపీ గెలిచింది. అది కూడా ఆలూరు, మంత్రాలయంలో మాత్రమే ఫ్యాన్ పార్టీ గలిచింది. ఆదోనిలో బీజేపీ, మిగిలిన పదకొండు నియోజకవర్గాల్లో టీడీపీ విజయం సాధించింది. అనంతపురం జిల్లాలో పథ్నాలుగు నియోజకవర్గాలుంటే కూటమి గత ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసింది. ధర్మవరంలో మాత్రం బీజేపీ గెలిచింది. మిగిలిన పదమూడు చోట్ల టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. కడపలో పది నియోజకవర్గాలుంటే అందులో మూడింటిలో వైసీపీ మిగిలిన చోట్ల టీడీపీ, జనసేన, బీజేపీ గెలుచుకున్నాయి. వైసీపీ బద్వేలు, కడప, మైదుకూరుల్లో మాత్రమే గెలిచింది. ఇక చిత్తూరు జిల్లాలో పథ్నాలుగు నియోజకవర్గాలుంటే రెండింటిలో మాత్రమే వైసీపీ గెలిచింది. తంబళ్లపల్లి, పుంగనూరులో వైసీపీ గెలుపొందగా తిరుపతిలో జనసేన గెలిచింది. ఇప్పటికే కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పరిస్థితులు మారాయన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఇక్కడ కూటమి నేతలు యాక్టివ్ గా లేకపోవడంతో పాటు వైసీపీ నేతలు క్రమంగా బలం పుంజుకుంటున్నట్లు కనపడుతుంది. ఇక వచ్చే ఏడాది ప్రారంభంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత వైసీపీ మరింత బలపడే అవకాశాలున్నాయని అంటున్నారు. వేవ్ ఇప్పుడు సీమ జిల్లాల్లో మారిందన్నది నిఘా వర్గాలు కూడా ప్రభుత్వానికి అందించినట్లు సమాచారం. ప్రజల్లో అధికార పార్టీపై ఎప్పుడూ అసంతృప్తి ఉంటుంది. అది ప్రతిపక్ష పార్టీకి కొంత అనుకూలంగా మారుతుంది. మరొకవైపు జగన్ ను సీమ ప్రాంత వాసిగా చూడటంతో మరికొంత ప్లస్ అయిందని అంటున్నారు. మరి చివర వరకూ ఇదే పరిస్థితి కొనసాగితే మాత్రం రాయలసీమలో కూటమికి కష్టాలు.. వైసీపీకి వేవ్ మామూలుగా ఉండవన్న విశ్లేషణలు బలంగా వినిపిస్తున్నాయి.

# హైదరాబాద్ టూ బెంగళూరు..

హైదరాబాద్, డిసెంబర్ 19(భారత శక్తి ప్రతినిధి):

ప్రపంచం మొత్తాన్ని ఇప్పుడు ఐటీరంగం శాసిస్తోంది.. ఉదయం లేచిన దగ్గర్నుంచి మొదలు పెడితే రాత్రి పడుకునే వరకు మనిషి జీవితంలో ప్రతి దశను ఐటి నిర్దేశిస్తుంది.. తినే తిండి నుంచి తాగే నీటి వరకు.. వేసుకునే బట్టల నుంచి చదువుకునే చదువు వరకు.. చేసే ఉద్యోగం నుంచి ఉండే నివాసం వరకు.. ఇలా ప్రతి అంశాన్ని ఐటి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితం చేస్తోంది. అందువల్లే ఐటీ రంగంలో విరివిగా ఉద్యోగాలు లభిస్తున్నాయి. అనేక కంపెనీలు ఐటీ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ప్రపంచ ఐటీ రంగాన్ని అమెరికాలోని సిలికాన్ వ్యాలీ నిర్దేశించేది. కాలానుగుణంగా ప్రపంచంలోని అనేక ప్రాంతాలు ఐటి కేంద్రాలుగా ఏర్పడ్డాయి. మనదేశంలో బెంగళూరు, హైదరాబాద్, పూణే, నోయిడా వంటి ప్రాంతాలలో ఐటీ కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఇందులో బెంగళూరు, హైదరాబాద్ ఊహించని విధంగా అభివృద్ధి చెందుతున్నాయి. బెంగళూరు అయితే ఏకంగా భారతదేశ ఐటీ రాజధానిగా మారిపోయింది. హైదరాబాద్ కూడా అదే స్థాయిలో అభివృద్ధి చెందుతోంది. ఇప్పటివరకు బాగానే ఉన్నప్పటికీ.. ఇప్పుడు హైదరాబాద్ వర్సెస్ బెంగళూరు అన్నట్టుగా పరిస్థితి మారిపోయింది.. దీనికి సంబంధించి చర్చ కూడా మొదలైంది. బెంగళూరు నగరం ఐటి ఎగుమతులు, స్టార్టప్ రంగాలలో దూసుకుపోతోంది. ఇక్కడ అమెజాన్ నుంచి మొదలు పెడితే టిసిఎస్ వరకు కార్యాలయాలు ఉన్నాయి. ప్రభుత్వం కూడా ఐటీ పరిశ్రమ అభివృద్ధికి విపరీతంగా సహకారం అందిస్తోంది.. బెంగళూరు నగరంలో భారీగా ఐటీ కంపెనీలు ఉన్నప్పటికీ.. జీతాలు కూడా అదే స్థాయిలో లభిస్తున్నప్పటికీ.. ఖర్చు కూడా అదేవిధంగా ఉంటున్నది. భారతదేశపు సిలికాన్ వ్యాలీగా బెంగళూరు నగరం ప్రసిద్ధి చెందింది. ఇక్కడ పెద్ద సంఖ్యలో ఐటీ కంపెనీలు ఉన్నాయి. గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు కూడా ఉన్నాయి. ఇక స్టార్టప్ ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఐటీ పరిశ్రమ ఏ స్థాయిలో అయితే అభివృద్ధి చెందిందో.. మిగతా రంగాలు కూడా అదే స్థాయిలో ఇక్కడ ఉన్నాయి. దీంతో జీవన వ్యయం పెరిగిపోయింది. ఐటీ పరిశ్రమలు ఉన్న ప్రాంతాలలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు రెంట్ దాదాపు 50 నుంచి 70 వేల వరకు ఉందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనికి తోడు ఇక్కడ ట్రాఫిక్ అత్యంత దారుణంగా ఉంటుంది.. సాయంత్రం, ఉదయం పూట ప్రయాణాలు సాగించాలంటే నరకం చూడాల్సి ఉంటుంది. ఇక్కడ రెంటు మాత్రమే కాదు, ఇళ్ళు కొనుగోలు చేయాలంటే కూడా భారీగా ఖర్చుపెట్టాలి. బెంగళూరు నగరంలో వైట్ ఫీల్డ్, ఎలక్ట్రానిక్ సిటీ, ఓ ఆర్ ఆర్ దూర ప్రాంతాలుగా ఉన్నాయి. ఇక్కడికి పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ కూడా సరిగా ఉండదు. దీనికి తోడు ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇక్కడ మెరుగుపడేందుకు చాలా సమయం పడుతుందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. బెంగళూరు నగరంలో ట్రాఫిక్ జామ్ సామాన్యులకే కాదు, సెలబ్రిటీలకు కూడా చుక్కలు చూపిస్తోంది. హైదరాబాద్ నగరంలో ఐటీ మాత్రమే కాకుండా ఫార్మా రంగాలు కూడా విపరీతంగా అభివృద్ధి చెందుతున్నాయి.

బెంగళూరు నగరంతో పోల్చి చూస్తే ఇక్కడ జీవన వ్యయం చాలా తక్కువ. జీతభత్యాలు కూడా చాలా ఎక్కువ. పైగా ఇక్కడ జిసిసిలకు హైదరాబాద్ బలమైన కేంద్రంగా మారుతోంది. స్టార్టప్ లకు కూడా గమ్యస్థానంగా రూపాంతరం చెందుతోంది. మౌలిక సదుపాయాలు కూడా బెంగళూరు నగరంతో పోల్చి చూస్తే చాలా ఎక్కువగా ఉన్నాయి. హైదరాబాద్ నగరంలో రోడ్లు విస్తారంగా ఉంటాయి. రియల్ ఎస్టేట్ కూడా తక్కువ స్థాయిలోనే ఉంటాయి. గచ్చిబౌలి, హెచ్ఐటిఈసి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటివి కేంద్రీకృత జోన్ ల పరిధిలో ఉన్నాయి.

పైగా బెంగళూరు నగరంతో పోసి చూస్తే 20 నుంచి 30% వరకు తక్కువ ధరలోనే నివాస గృహాలను సొంతం చేసుకోవడానికి సాధ్యమవుతుందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. కెరియర్ పరంగా చూసుకుంటే ఐటి ఉద్యోగులకు బెంగళూరు ఫస్ట్ ఛాయిస్. స్టార్ట్ అప్, నిచ్ డొమైన్ లు ఉన్న ఐటీ ఉద్యోగులకు మాత్రం హైదరాబాద్ నగరం ఒక మైనస్ పాయింట్ అని చెప్పుకోవచ్చు. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి మధ్యలో హైదరాబాదులో బంజరా హిల్స్ నుంచి మొదలు పెడితే గచ్చిబౌలి వరకు భూముల ధరలలో 8 శాతం వరకు పెరుగుదల నమోదు చేశాయి. ఇక బెంగళూరు ప్రాంతాలలో భూముల ధరలు సగటున 13వేల నుంచి 15 వేల వరకు పెరిగాయి. బయటి ప్రాంతాలలో 9000 నుంచి పదివేల పరిధిలో ఉన్నాయి. అద్దెల ప్రకారం చూసుకుంటే బెంగళూరులో రెంటల్ రిటర్న్స్ మూడు నుంచి నాలుగు శాతం వరకు పెరిగితే.. హైదరాబాద్ నగరంలో అది మూడు నుంచి 3.5 శాతం వరకు ఉంది.

# ప్లాన్ బీ దిశగా కాంగ్రెస్ అడుగులు

హైదరాబాద్, డిసెంబర్ 19(భారత శక్తి ప్రతినిధి):

ప్రభుత్వంలో ఉన్నాం..పైగా జూబ్లీహిల్స్ బైఎలక్షన్‌లో గెలిచాం. ఇదే మంచి మూమెంట్ అంటూ ఎట్టకేలకు అన్ని అడ్డంకులు దాటుకుని..పంచాయతీ పోల్స్ పెట్టింది కాంగ్రెస్ సర్కార్. మూడు విడతల్లో 12వేల 726 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ గట్టి నమ్మకం పెట్టుకుంది. కచ్చితంగా పంచాయతీల్లో వార్వన్సైడే అని డిసైడ్‌అయిపోయింది. 90 శాతానికి పైగా పంచాయతీల్లో పాగా వేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్లింది.సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలంతా పంచాయతీ సమరంలోనే మునిగిపోయారు. మెజారిటీ స్థానాలు కాంగ్రెస్ సానుభూతి పరులు గెలిస్తే కలిగే లాభాలను నేతలకు వివరించారు. సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటితే..ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా జనంలోకి తీసుకెళ్లడంతో పాటు వచ్చే జనరల్ ఎలక్షన్కు ఫైట్ చేయడం ఈజీ అవుతుందనే ఆలోచన చేశారు. అందుకే సీఎం రేవంత్ ఈ ఎలక్షన్ను సీరియస్గా తీసుకున్నారు. జిల్లాల్లోనూ సభలు నిర్వహించడం ద్వారా సర్పంచ్ ఎన్నికల హీట్ పెంచారు.రెండేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి..పంచాయతీల్లో గెలవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తూ స్వయంగా సీయం రేవంతే ఉమ్మడి జిల్లాల్లో సభలు నిర్వహించారు. దీంతో నేతలు చాలా సీరియస్‌గా తీసుకొని మొదట్లో ఏకగ్రీవం చేసేందుకు ప్లాన్ చేశారు.



మొదటి విడత ఎన్నికల్లో 67 శాతం ఫలితాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఆ తర్వాత రెండు, మూడు విడుతల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ..మరింతగా పుంజుకోవడంతో కాంగ్రెస్ ఆలోచనలో పడింది.మొదటి విడతలో 67 శాతం గెలుపొందిన కాంగ్రెస్.. మూడు విడుతలు ముగిసే సరికి 52 శాతానికి పడిపోయింది. అనుకున్న దానికన్నా కాంగ్రెస్ వెనుకబడితే.. బీఆర్ఎస్ ఊహించినదానికన్నా పుంజుకోవడం చర్చనీయాంశంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మంచి ఫలితాలు వచ్చిన గ్రామీణ ప్రాంతంలో..బీఆర్ఎస్ మెల్లమెల్లగా పుంజుకుంటున్నట్లు సర్పంచ్ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో ఇక ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు వాయిదా వేసి.. ప్లాన్ బీ అమలు చేసే ఆలోచనలో పడ్డారట కాంగ్రెస్ పెద్దలు.పంచాయతీ ఎన్నికల్లో అనుకున్న విధంగా మంచి రిజల్ట్ వస్తే.. వెంటనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టాలని అనుకున్నారట. కానీ 90 శాతం టార్గెట్ పెట్టుకుంటే 50 శాతానికే పరిమితం కావడంతో కాంగ్రెస్ పెద్దలు ఆలోచనలో పడ్డారట. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టడం కన్నా.. మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేశాకే ఎన్నికలకు వెళ్లాలని అనుకుంటున్నారట.ముఖ్యంగా వృద్ధులకు అందజేసే పెన్షన్ పెంపు, రైతు భరోసా నిధులను మరోసారి విడుదల చేసిన తర్వాత ఎన్నికలకు వెళ్తే బాగుంటుందనే ఆలోచన చేస్తున్నారట. ఈలోగా అర్బన్ ప్రాంతానికి సంబంధించిన మున్సిపల్ ఎన్నికలను పూర్తిచేయాలని ఆలోచనలో ఉందట. గ్రేటర్ హైదరాబాద్, మున్సిపల్ ఎన్నికల తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను మార్చి, ఏప్రిల్లో నిర్వహించాలని అనుకుంటుందట కాంగ్రెస్ సర్కార్.పంచాయతీ ఎన్నికల ఫలితాల ఎఫెక్ట్ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై పడిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటమని చెప్తూ మీడియా సమావేశంలో మాట్లాడిన సీఎం రేవంత్..ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఎప్పుడు పెడుతారన్న దానిపై మాత్రం క్లారిటీ ఇవ్వలేదు. అసెంబ్లీ సమావేశాలు పెట్టి..అన్ని పార్టీల ఒపీనియన్ తీసుకుని..ఎంపీటీసీ, జడ్పీటీసీతో పాటు మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలన్నదానిపై డెసిషన్ తీసుకుంటామని సీఎం చెప్పడం కొసమెరుపు.

# విద్యార్థులు దంత సమస్యలతో బాధపడొద్దు: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
## -ప్రభుత్వాసుపత్రిలో దంత పరీక్షల పరిశీలన

కరీంనగర్, డిసెంబర్ 19(భారతశక్తి ప్రతినిధి):

కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఏ ఒక్క విద్యార్థి దంత సమస్యలతో బాధపడకుండా చూడాలని వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. జిల్లాలో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక క్యాంపు నిర్వహించి విద్యార్థులందరికీ దంత వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. శుక్రవారం కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో మంకమ్మ తోట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వైద్యులు దంత వైద్య చికిత్స నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆసుపత్రి నుంచి వైద్య చికిత్స తీరును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. దంత వైద్యులు చేస్తున్న పరీక్షలను పర్యవేక్షించి విద్యార్థులతోనూ మాట్లాడారు. కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా అందిస్తున్న దంత వైద్య సేవలను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ నుంచి కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో దంత వైద్యులు ప్రత్యేకంగా క్యాంపులు నిర్వహిస్తూ విద్యార్థులకు పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో దాదాపు వైద్యుల బృందం 12 వేల మంది విద్యార్థులకు పరీక్షలు చేస్తున్నామని, ఇందులో దంత సమస్యలతో బాధపడుతున్న వారిని 1500 మందిని గుర్తించినట్లు తెలిపారు. ఈనెల 23 వరకు మొదటి విడత క్యాంపులను పూర్తిచేయాలని ఆదేశించారు. జనవరి ఫస్ట్ నుంచి రెండో విడత పరీక్షల నిర్వహణ ప్రారంభించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఉచిత దంత వైద్య శిబిరాలను వైద్యులు నిర్వహిస్తున్నారని వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్పొరేట్ ప్రభుత్వ ఆసుపత్రులకు దీటుగా వైద్యులు చికిత్స అందిస్తున్నారని తెలిపారు. దంత వైద్య పరీక్షలను పకడ్బంధిగా



నిర్వహిస్తున్న వైద్యులను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరిండెంట్ జి వీరారెడ్డి, ఆర్ఎంవో నవీనా వైద్యులు రవి ప్రవీణ్, రణధీర్, ప్రవీణ్, రాజిరెడ్డి, మంగ, శరత్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు అప్రమత్తతతోనే నష్టాన్ని నివారించవచ్చు
## -కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

కరీంనగర్, డిసెంబర్ 19(భారతశక్తి ప్రతినిధి):

ప్రకృతి విపత్తుల నిర్వహణకు సంబంధించి మాక్ డ్రిల్ కార్యక్రమ నిర్వహణ, వైపరీత్యాల సమయంలో తీసుక్కవాల్సిన చర్యలపై సిఎస్ రామకృష్ణ రావు, జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ) అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ నెల 22న విపత్తుల నిర్వహణ మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. ముందస్తు అప్రమత్తత ద్వారా విపత్కర సమయాల్లో ప్రాణ నష్టాలు తగ్గించడంతో పాటు, ఆస్తి నష్టాలు తగ్గించగలుతామని స్పష్టంచేశారు. పరిస్థితులను అంచనా వేయగలిగితే నష్టాలను తగ్గించగలుగుతామని వివరించారు. వైపరీత్యాల సమయంలో సమాచార మార్పిడి అత్యంత కీలకమని అన్నారు. ఇందుకోసం అవసరమైన అన్ని సాధనాలు వినియోగించుకోవాలని సూచించారు. వైపరీత్యాల సమయంలో ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా పని చేయాలని పేర్కొన్నారు. దాదాపు 35 శాఖలు సమన్వయంతో మెలగాలని తెలిపారు. వర్షపాతం, ప్రాజెక్టుల నీటిమట్టం, నీరు విడుదల, వంతెనలు, రోడ్ల స్థితి వంటి అంశాలపై వాస్తవ సమాచారం ప్రజలకు చేరవేయాలని తెలిపారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు




అవసరమగు సేవలకు టోల్ ఫ్రీ నంబర్ల ఏర్పాటు ద్వారా సమాచారం ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ, వైద్య సేవలు అనేవి వైపరీత్యాల సమయంలో అత్యంత కీలకమని అన్నారు. రాష్ట్రంలోని ఎస్డిఆర్ఎఫ్ బృందాలకు ఎన్డిఆర్ఎఫ్ బృందాలు సహకారం అందిస్తాయని తెలిపారు. అవసరమైతే అత్యవసర సమయాల్లో హెలికాప్టర్ సేవలు వినియోగించుకోవచ్చని అన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ అధికారులు విపత్తు నివారణ చర్యలపై పలు అంశాలను కూలంకషంగా చర్చించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఈరోజు అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

ప్రతి మనిషి మనిషిగా జీవించడానికి కొన్ని హక్కులు ఉండాలి. ఇందులో జాతి, భాష, కుల, మతాలకతీతంగా మనిషిగా జీవించే హక్కు కలిగి ఉండడమే ప్రధాన ఉద్దేశ్యం.అలాంటి మానవ హక్కుల దినాన్ని 10 డిసెంబర్ 1948న ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. అప్పటినుండి ప్రతిసంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా డిసెంబరు 10వ తేదీ ని అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవంగా జరుపుకుంటున్నారు. వివక్షత లేనటువంటి మానవ సమాజ నిర్మాణమే ఈ అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవ లక్ష్యం.అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం డిసెంబరు 10న ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట నిర్వహిస్తారు. ఐదేళ్ళకోసారి అమెరికా సంయుక్త రాష్ట్రాలు మానవ హక్కులకు సంబంధించినవారికి ఇచ్చే పురస్కారం, అలేగా అత్యున్నత నోబెల్ బహుమతి అందుకున్నవారిని ఈరోజున సత్కరిస్తారు.1948, డిసెంబరు 10న ఐక్యరాజ్య సమితి విశ్వమానవ హక్కుల ప్రకటన చేసింది. అందువల్ల డిసెంబర్ 10వ తేదీని అంతర్జాతీయ మానవహక్కుల దినంగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకొంటారు. మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడంకోసం కోర్టులతోపాటు మానవ హక్కుల కమిషన్‌లు ఏర్పాటుచేయబడ్డాయి. భారతదేశంలో ..క్రీ.శ.1215లో ఇంగ్లండ్ అప్పటి రాజు జాన్ విడుదల చేసిన 'మాగ్నా కార్టా' మొట్టమొదటి మానవ హక్కుల ప్రకటన నుండే భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు రూపొందాయి. 1993లో రూపొందిన మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1994, జనవరి 8నుండి అమలులోకి వచ్చింది.

# 24న గద్దెల ప్రతిష్టాపన

వరంగల్ , డిసెంబర్ 19

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా మేడారానికి పేరు ఉంది. ఈ జాతర ఫిబ్రవరిలో ప్రారంభం కానుంది. ఈసారి జాతరకు దాదాపు 10 లక్షల మించి భక్తులు వస్తారని తెలంగాణ ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే భక్తుల తగ్గట్టుగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తోంది. గత ప్రభుత్వాలు తాత్కాలికంగా అభివృద్ధి పనులు చేపడితే, ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టేందుకు రంగం సిద్ధం చేసింది. ఇందులో భాగంగా వందల కోట్ల ఖర్చుతో శాశ్వత నిర్మాణాలను ఏర్పాటు చేస్తోంది.మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరుగుతుంది. ఈ క్రమంలో ఈ జాతరను పురస్కరించుకొని శాశ్వతమైన పనులను ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం చేపట్టింది.. ఆలయ విస్తరణ పనులను ముమ్మరంగా చేపడుతోంది. గద్దల ముందు రాతి స్తంభాలతో ప్రధాన ద్వారాన్ని ఏర్పాటు చేశారు.. ఇందుకోసం ఎనిమిది భారీ స్తంభాలను ఏర్పాటు చేశారు. ప్రతి రాతి స్తంభం మీద ఆదివాసీల చరిత్రను తెలిపే విధంగా బొమ్మలను రూపొందించారు. ప్రస్తుతం ఒకే వరుసలో గద్దెల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.. మరి కొద్ది రోజుల్లో ఈ పనులు పూర్తికా బోతున్నాయి.. ఈనెల 24న పూజారుడు గోవిందరాజులు, పగిడిద్దరాజుల గద్దెలను ప్రతిష్టాపన చేస్తానని తెలుస్తోంది.మేడారం ఆలయ అభివృద్ధి పనులను తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఈ పనులకు స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చి శంకుస్థాపన చేశారు. దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక శాసనసభ సభ్యురాలు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క ఎప్పటికప్పుడు ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. పనుల్లో నాణ్యత ఉండేలా చూస్తున్నారు. ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి శిల్పులు, కార్మికులు, ఇంజనీర్లు శ్రమిస్తున్నారు. తద్వారా మేడారానికి సరికొత్త రూపు వచ్చే విధంగా చమటోడ్చుతున్నారు.

మేడారం.. ఆదివాసీలకు ఇలవేల్పు అయిన సమ్మక్క సారలమ్మకు ప్రధాన ఆలయం. ఇది ఆసియాలోనే గిరిజనులు జరుపుకునే అతిపెద్ద జాతర. ఈ జాతరకు లక్షలలో భక్తులు వస్తారని ప్రభుత్వం భావిస్తోంది. అందుకు తగ్గట్టుగానే సౌకర్యాలు కల్పిస్తోంది. వందల సంఖ్యల పోలీసులను.. అంతే స్థాయిలో ఆర్టీసీ బస్సులను.. ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సిబ్బందిని భక్తుల సేవలో తరించడానికి సర్కార్ నియమించనుంది. ప్రతి రెండు




సంవత్సరాలకు ఒకసారి మేడారం జాతర వస్తుంది. అయితే ఇప్పుడు సోషల్ మీడియా వినియోగం.. మీడియా విస్తృతి పెరిగిన తర్వాత మేడారం జాతర ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకునే అవకాశం ఉందని ఇక్కడి భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

========================

# రంగంలోకి దళపతి...

హైదరాబాద్, డిసెంబర్ 19(భారత శక్తి ప్రతినిధి):

గులాబీ బాస్ కేసీఆర్ చాలా రోజుల తర్వాత తెలంగాణ భవన్‌కు రాబోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తుంటి ఎముక గాయంతో కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకున్న గులాబీ దళపతి, లోక్ సభ ఎన్నికల ప్రచారం తర్వాత పూర్తిగా ఫార్మ్ హౌస్‌కే పరిమితం అయ్యారు. పార్టీ నేతలతో సమావేశాలు ఉన్నా ఫార్మ్ హౌస్‌కే నేతలను పిలిపించుకుని మాట్లాడుతున్నారు. కాళేశ్వరంపై ప్రభుత్వం నియమించిన కమిషన్ ముందుకు విచారణకు హాజరైన కేసీఆర్..ఆ తర్వాత రెండు, మూడు సార్లు వైద్య పరీక్షల కోసం హైదరాబాద్ వచ్చారు.ఈ రెండేళ్లలో తెలంగాణ భవన్‌లో ఒకసారి కార్యవర్గ సమావేశం నిర్వహించగా, గత ఏప్రిల్ లో వరంగల్ లో జరిగిన పార్టీ సిల్వర్ జూబ్లీ సభలో పాల్గొన్నారు గులాబీ బాస్. ఆ తర్వాత ఇన్నాళ్లకు మరోసారి తెలంగాణ భవన్‌కు వస్తున్నారు కేసీఆర్. ఈ నెల 21న బీఆర్ఎస్ఎల్పీ సమావేశంతో పాటు పార్టీ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించనున్నారు. దీంతో రాజకీయ వర్గాల్లో సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే ఈసారి కేసీఆర్ పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగుతున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.గడిచిన రెండేళ్ళు ఒక లెక్క అయితే..రాబోయే మూడేళ్లు మరో లెక్క అని భావిస్తున్నారట గులాబీ బాస్. రాబోయే రెండేళ్లు పూర్తిగా ఎలక్షన్ ఇయర్స్‌గా పనిచేయాలని నేతలకు డైరెక్షన్స్ ఇవ్వనున్నారట. ముందు నుంచి ఈ ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని చెప్తూ వచ్చిన కేసీఆర్..ఇప్పుడు రెండేళ్ల కాంగ్రెస్ పాలనా వైఫల్యాలపై సమర శంఖం పూరించేందుకు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నారట.మరీ ముఖ్యంగా కృష్ణా, గోదావరీ జలాల విషయంలో కేసీఆర్ చాలా సీరియస్‌గా ఉన్నారని తెలుస్తోంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 91 టీఎంసీలు కేటాయిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం కేవలం 45 టీఎంసీలు ఇస్తే చాలని కేంద్రానికి చెప్పడంపై కేసీఆర్ సీరియస్ ఉన్నారట. 2023లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి వచ్చి ఉంటే..ఇప్పటికి పాలమూరు ఎత్తిపోతల పూర్తయ్యేదని..మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు తాగు, సాగు నీరందేదని కేసీఆర్ చెబుతున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల ప్రయోజనాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ.. రైతాంగానికి తీవ్ర నష్టం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే దీనిపై సమావేశంలో చర్చించి ప్రత్యేక కార్యాచరణ ప్రకటించనున్నారని తెలుస్తోంది. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల నిర్మాణం, గోదావరి, కృష్ణా జలాలపై పోరాడేందుకు..ఒక ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నారని తెలుస్తోంది.ఇక జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి తర్వాత పార్టీ క్యాడర్‌లో కొంత నిరాశ ఏర్పడిందని కెసీఆర్ భావిస్తున్నారట. అయితే లేటెస్ట్‌గా జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఆశించిన దానికంటే మంచి ఫలితాలు రావడంతో బీఆర్ఎస్ నేతలు, క్యాడర్ కొంత జోష్ వచ్చింది. త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలతో పాటు జీహెచ్ఎంసి ఎన్నికలపై కేసీఆర్ దృష్టి పెట్టనున్నట్లు తెలుస్తోంది. 21న తెలంగాణ భవన్‌లో జరిగే విస్తృత స్థాయి సమావేశంలో వచ్చే ఎన్నికలపై నేతలకు దిశానిర్దేశం చేయనున్నారట కేసీఆర్.అంతే కాకుండా పార్టీ ఫిరాయింపుల కేసులో దానం నాగేందర్, కడియం శ్రీహరిపై అనర్హత వేటు పడి ఖైరతాబాద్, స్టేషన్ ఘన్‌పూర్‌కు ఉప ఎన్నికలు వస్తే గెలుపే లక్ష్యంగా పనిచేసేలా కేసీఆర్ వ్యూహాలకు పదును పెట్టనున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు గులాబీ బాస్ కేసీఆర్ దిశానిర్దేశం చేయడం, ఆదేశాలు ఇవ్వడమే చూసిన నేతలు..ఇకపై కేసీఆర్‌లో స్పష్టమైన మార్పును చూడబోతున్నారనే టాక్



వినిపిస్తోంది.ఈ నెల 21న తెలంగాణ భవన్‌లో జరిగే సమావేశంలో పార్టీ బలోపేతంపై అందరి అభిప్రాయాలను కేసీఆర్ తీసుకోనున్నారట. పార్టీ సంస్థాగత నిర్మాణంపై గత కొన్ని రోజులుగా కసరత్తు చేస్తున్న గులాబీ బాస్..కార్యవర్గ సమావేశంలో అందరితో చర్చించి ప్రణాళిక ప్రకటించబోతున్నారట. పార్టీని గ్రామ స్థాయి నుంచి ప్రక్షాళన చేయాలని డిసైడ్ అయిన కేసీఆర్..రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక నుంచి మండల స్థాయి వరకు అన్ని కమిటీల నియామకానికి సంబంధించిన రోడ్ మ్యాప్‌ను ప్రకటించనున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వెంటనే పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించేలా నేతలకు ఆదేశాలు జారీ చేయనున్నారట కేసీఆర్.

# బాల్య వివాహాలను నిర్మూలించే అంశాలపై 100 రోజుల కార్యక్రమాలు

కడప, డిసెంబర్ 19(భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశానుసారంగా, డాక్టర్ సి.యామిని, అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప మరియు సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ సూచనల మేరకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు, పానెల్ న్యాయవాదులచే అలంకానిపల్లి సచివాలయము, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అక్కయపల్లి, అలంకాన్ పల్లి సర్కిల్ల నందు రెండవ రోజు అయిన 19-12-2025 వ తేదీన "నల్సా (ఆశ-అవగాహన, మద్దతు, సహాయం మరియు చర్య) ప్రామాణిక ఆపరేటింగ్ విధానం ? బాల్య వివాహాలను నిర్మూలించడానికి, 2025 మొదలగు అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సు మరియు చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 ప్రచార కార్యక్రమాలు" నిర్వహించడం జరిగినది.

ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్సా (ఆశ- అవగాహన, మద్దతు, సహాయం, మరియు చర్య) అని అర్థం, దీనిని ముఖ్యంగా బాల్య వివాహాలను నివారించడానికి జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అమలు చేస్తున్న ఒక ముఖ్యమైన విధానం, దీని ద్వారా బాధితులకు చట్టపరమైన సహాయం, మానసిక కౌన్సిలింగ్, పునరావాసం కల్పించడంతో పాటు సమాజంలో అవగాహన కల్పిస్తారు. ఈ నల్సా యూనిట్ జిల్లా స్థాయిలో పనిచేస్తూ, చైల్డ్ మ్యారేజ్ ప్రోహిబిషన్ ఆఫీసర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, పోలీసులతో కలిసి పనిచేసి, బాలికల హక్కులను కాపాడుతుంది.

ముఖ్య ఉద్దేశ్యాలు:

అవగాహన: బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించడం.

మద్దతు: బాల్య వివాహాల నుండి రక్షించబడిన వారికి మానసిక, సామాజిక మద్దతు అందించడం.

సహాయం: బాధితులకు ఉచిత చట్టపరమైన సలహా, కోర్టులో ప్రాతినిధ్యం, పునరావాసం (విద్య, వృత్తి శిక్షణ) కల్పించడం.




చర్య: ఫిర్యాదులు స్వీకరించడం, చట్టపరమైన చర్యలు తీసుకోవడం, అధికారులతో సమన్వయం చేయడం, లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కారం చూపడం.

ఆశ యొక్క యూనిట్ నిర్మాణం:

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ నేతృత్వంలో ఈ యూనిట్ ఏర్పాటు చేయబడుతుంది. ఇందులో జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి, ఫ్యామిలీ కోర్టు జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి సభ్యులుగా ఉంటారు.

నల్సా పాత్ర:

నల్సా అనేది బలహీన వర్గాల వారికి ఉచిత న్యాయ సేవలు అందించే సంస్థ. ఆశ ప్రోగ్రామ్ ద్వారా బాల్య వివాహాల నిర్మూలనలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

సంక్షిప్తంగా: ఆశ అనేది బాల్య వివాహాల నివారణకు నల్సా ప్రారంభించిన ఒక సమగ్ర కార్యక్రమం, ఇది చట్టపరమైన, సామాజిక, మానసిక సహాయాన్ని అందిస్తూ, బాధితులకు అండగా నిలుస్తుంది. చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగంశాలను వివరించారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది అక్బర్ అలీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అక్కయపల్లి డాక్టర్, పారా లీగల్ వాలంటరీలు దశరథ రామిరెడ్డి, శ్రీనివాసులు, నిర్మల, ఆశా వర్కర్లు మరియు అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు.

# యమపాశాలుగా టిప్పర్లు

ఖమ్మం, డిసెంబర్ 19

మణుగూరు, భద్రాద్రి పవర్ ప్లాంట్ ప్రధాన రహదారి పై బొగ్గులారీలు వస్తున్నాయంటే ప్రజలు హడలిపోతున్నారు. లారీల దూకుడు రోజు రోజుకు పెరిగిపోతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి ఉందో అనే ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా మణుగూరులో అంతర్గతంగా బొగ్గును సరఫరా చేసే లారీల దూకుడుకు తోడు మణుగూరు ఓసీ, ఓసీ-2 నుంచి బొగ్గును బీటీపీఎస్కు బొగ్గు తరలించే టిప్పర్ల అతి వేగం మిగతా వాహనదారులకు ప్రాణ సంకటంగా మారుతోంది.బొగ్గు టిప్పర్లతో ప్రాణహాని ఉండడమే కాక పర్యావరణం దెబ్బతింటోందనే ఫిర్యాదులు వెల్లువెత్తు తున్నాయి. మణుగూరు టూ ఏటూరు నాగారం ప్రధాన రహదారి అంటేనే వాహన శోధకులతోపాటు, కార్మిక, కార్మికేతర కుటుంబాలు జంకుతున్నాయి. ఓ వైపు గుంతలు.. మరోవైపు వాహనాల రద్దీ. దీనికి తోడు బొగ్గు తరలించే టిప్పర్ల లారీ అతివేగం, డ్రైవర్ల ఇష్టారాజ్యం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మణుగూరు నుంచి బీటీపీఎస్కు వెళ్లే లారీలు ట్రిప్పుల లెక్కన నడుస్తుండటం తో ఈ లారీలను నడిపే డ్రైవర్లు వేగానికి అడ్డూఅదుపు లేకుండాపోతోంది. మరో వైపు మణుగూరు నుండి బీటీపీఎస్ వెళ్లే ప్రధాన రహదారి నిత్యం ప్రమాదాలకు నెలవుగా మారింది. బొగ్గు లారీల ద్వారా కింద పడే బొగ్గు పెళ్లలు నుజ్జుగా మారి విపరీతమైన దుమ్ము ధూళికీ తోడు లారీల వెనక ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు కంటి నిండా బొగ్గు చూర పడడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. లారీలపై టార్పాలిన్లు కట్టడం లేదు. పైగా బొగ్గును కూడా లారీ బాడీకి సమాంతరంగా కాకుండా హెచ్చుగా పోయడం వల్ల మూలమలుపుల్లో బొగ్గు పెల్లలు రహదారిపై పడడంతో తరచూ ప్రమాదాలు జరుగున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మణుగూరు, బిటిపిఎస్ ఈ మార్గంలో రెండు నిమిషాలకో టిప్పర్ చొప్పున బొగ్గు తీసుకుని పరుగులు తీస్తుంటాయి. సీరియల్ పోతుందని.. రోజుకు ఒక్కో టిప్పర్ నాలుగు నుంచి ఐదు ట్రిప్పులు వేయాల్సి రావడం, గంటలోపు గమ్యాన్ని చేరుకోవాలనే ఆతృతతో డ్రైవర్లు వేగంగా నడుపుతుండడంతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఈ మార్గంలో బొగ్గు టిప్పర్లు ఢీకొని అనేక మంది మృతి చెందగా,మరికొందరు తీవ్రగాయాలతో మంచానికే పరిమితమయ్యారు.బొగ్గు తరలించే సమయాన టిప్పర్ల నుంచి బొగ్గు పెళ్లలు రోడ్డుపై పడకుండా పట్టాలను కప్పాల్సి ఉంటుంది. కానీ త్వరగా వెళ్లాలనే ఆత్రుతతో పట్టాలను కప్పక బొగ్గు పెళ్లలు రోడ్డు పై పడి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అంతేకాక బొగ్గు దుమ్ము ఎగిసిపడు తుండడంతో వెనక వచ్చే ద్విచక్ర వాహన దారులు ఇబ్బంది పడుతున్నారు.

బొగ్గు రవాణా టెండర్లలో విధిగా పట్టాలు పూర్తిగా కప్పాలనే నిబంధన ఉన్నా డ్రైవర్లు పెద్దగా పట్టించుకోవడం లేదు. అంతేకాక నల్లటి దుమ్ము లేస్తుండడంతో శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశముందని తెలిసి కూడా పట్టించుకోకపోవడం గమ నార్హం.కొందరు టిప్పర్ చోదకులు పరిమితిని మించి బొగ్గు లోడును తీసుకెళ్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. లారీల వేగాన్ని, అధికలోడ్ను నియంత్రించి, సామర్థ్యాన్ని పరిశీలించాల్సిన సంబంధిత అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకుండా మామూలుగా తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

భద్రాద్రి పవర్ ప్లాంట్కు బొగ్గు రవాణా చేసే లారీల డ్రైవర్లకు ఒక్కరికి కూడా లైసెన్స్ లేదని.. మద్యానికి అలవాటుపడి వాహనాలు తోలుతుంటే రవాణాశాఖ అధికారులు నిద్రమత్తులో ఉన్నారని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి నుంచి రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటే కొంతమేరైనా ప్రమాదాలను నివారించ వచ్చునని, ఆ దిశగా ఆ శాఖ అధికారులు ఇప్పటికైనా బొగ్గు లారీలపై చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నా రు.

# పిల్లల్లో పఠనాసక్తిని పెంచడం ఎలా?

ఒక భవనానికి పునాది ఎంతో ముఖ్యమో మనిషి జీవితంలో బాల్యదశ అంత ముఖ్యమైనది .ఈ దశలో నేర్చుకున్న అలవాట్లు విలువల పైననే భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.పిల్లల సర్వతోముఖాభివృద్ధిలో బాల్యదశ కీలకమైంది. వ్యక్తి మెరుగైన జీవితానికి బాల్యమే పునాది.

బాల్యాదశలో పిల్లల మెదడు పెరుగుదల అభివృద్ధి ఎక్కువగా

జరుగుతుంది . పిల్లలకుక్రమశిక్షణ నిజాయితీ దయ క్షమా గుణం స్వేచ్ఛ సేవాభావం షేరింగ్ కేరింగ్ అలవాట్లు బాల్యదశలోనే కలుగుతాయి. వారి మానసిక వికాసం వ్యక్తిత్వ వికాసం బాల్య దశలోనే మొదలౌతుంది. బాల్యం సంతోషంగా ఆరోగ్యంగా సాగితేనే వ్యక్తి భవిష్యత్తు దేశ భవిష్యత్తు బాగుంటుంది.

పుస్తక పఠనంవల్ల బాల్యదశలోనే పిల్లల్లో పరిశీలన పరిశోధన శాస్త్రీయ దృక్పథానికి కావలిసిన బీజాలు పడుతాయి.

.పిల్లల్లో పఠనా సక్తిని పెంచాలి×

పిల్లల్లో పుస్తక పఠనాసక్తిని పెంపొందించడం అనేది ఒక క్రమ పద్ధతిలో జరగవలసిన ప్రక్రియ.

పుస్తక పఠనం వల్ల పిల్లల్లో ప్రశ్నించే తత్వం పెరుగుతుంది .వారు అడిగిన ప్రశ్నలకు ఓపిక సమాధానం చెప్పాలి. సమస్యలకు పరిష్కారాన్ని కనుగొనమని ప్రోత్సహించాలి .పుస్తక పఠనం వల్ల విశ్లేషణాత్మక ఆలోచనలు పెరుగుతాయి. పుస్తకాలను కథలను మహనీయుల జీవిత చరిత్రలను చదివే అలవాటు పిల్లలకు చేయడం వల్ల వారి ఊహాశక్తి నీ ప్రోత్సహించగలం. డ్రాయింగ్ పేపర్ క్రాఫ్ట్ వాటితో బొమ్మలు తయారుచేయడం వల్ల పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుంది .శారీరక మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుంది

పెద్దలు తల్లితండ్రులు రోల్ మోడల్స్×

పెద్దలు తల్లిదండ్రులు పిల్లలకు

రోల్ మోడల్ గా ఉండాలి .

పిల్లలు పెద్దలను చూసి నేర్చుకుంటారు. పెద్దలు స్వయంగా పుస్తకాలు చదవడం చూసినప్పుడు వారికి కూడా చదవాలని కుతూహలం కలుగుతుంది.

బాల్యదశలో ప్రారంభించండి×


పుస్తక పఠనంపై ఆసక్తిని పిల్లల్లో బాల్యదశలోనే ప్రారంభించాలి.

6 సం"రాల వయసు నుండి పిల్లలకు బొమ్మల పుస్తకాలు మరియు చిన్న కథలు పరిచయం చేయాలి .పడుకునే ముందు కథలు చదివి వినిపించడం వల్ల పుస్తక పఠనం పట్లవారికి ఆసక్తి ఏర్పడుతుంది .

పిల్లల వయసు ఆసక్తిని బట్టి పుస్తక పఠనం ఎంపిక చేయాలి×.

పిల్లల వయసు వారి ఆసక్తిని బట్టి ఉత్తమమైన కథ పుస్తకాలు ఎంపిక చేసి చదివించాలి. పిల్లల మనోవికాసానికి ఈ ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉంచాలి. జంతువుల కథలు చిన్న పిల్లలకు జంతువులు మాట్లాడే కథలు బాగ నచ్చుతాయి. కథలు చదువుటం ద్వారా జంతువుల గురించిన జ్ఞానాన్ని పొందుతారు .

నీతి కథలు పంచతంత్రము వంటి నీతి కథలుపిల్లల్లో నైతిక విలువలు క్రమశిక్షణ ఏర్పాటుకు దోహఫ పడుతాయి. కథల్లో ఉండే సందేశం వారి వ్యక్తిత్వ వికాసానికి ఉ



పయోగపడుతుంది. పుస్తక పఠనం వల్ల జీవితంలో ఎదురయ్యే సమస్యలు వాటికి పరిష్కార నైపుణ్యాలు కలుగుతాయి.

పెద్ద పిల్లలు సాహస యాత్రలు కథలు×

పెద్ద పిల్లలకు( 08 బి 12 సం"రాల వయసులో వారికి) సాహసయాత్రలు డిటెక్టివ్ కథలు అడ్వెంచర్స్ లాంటి పుస్తకాలు నచ్చుతాయి వాటి పఠపనానికి ప్రాధాన్యత ఇస్తారు. అలాంటి పుస్తకాలు లైబ్రరీలోఅందుబాటులో

ఉంచాలి. ఇలాంటి పుస్తకాలు చదవడం వల్ల పిల్లల్లో సమస్యలు గుర్తింపు పరిష్కారం నైపుణ్యాలు పెరుగుతాయి. సైన్స్ ఫిక్షన్ మరియు ఫాంటసీ ఈ రకమైన పుస్తకాల పఠనం పిల్లలో రచన శక్తి సృజననైపుణ్యాన్నిపరిశోధనాత్మకతను ఆవిష్కరింపజేస్తాయి.

ఆధ్యాత్మిక చరిత్ర పుస్తకాల పఠనం×

పిల్లలు ఆధ్యాత్మిక చరిత్ర పుస్తకాలు ప్రోత్సహించాలి.

పురాణం జానపద కథలు భారతీయ సామాజిక సంస్కృతిక పరంపరను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతాయి.పురాణాలు రాజుల కథలు జానపదవీరుల కథలు మన సంస్కృతిని చరిత్రను చదవడం వల్ల పిల్లలకు దేశ సంస్కృతి పట్ల పరిచయం ఏర్పడుతుంది

చిన్న పిల్లలు బిబొమ్మల పుస్తకాలు×

02 నుంచి 5 సం"రాల వయసున్న పిల్లలకు రంగురంగుల బొమ్మలున్న పుస్తకాలు నచ్చుతాయి .

పుస్తక పఠనం వల్ల పిల్లల్లో పదజాలం పైపట్టు పెరుగుతుంది

కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయి. ప్రముఖ వ్యక్తుల జీవిత చరిత్రలు చధవడం ద్వారా పిల్లలు స్ఫూర్తి పొందుతారు. చరిత్రలో మహాపురుషులు పడ్డకష్టాలు అధిగమించిన తీరు పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని

పెంచడానికి మార్గదర్శిగా ఉపయోగపడుతాయి.

పిల్లలుబి పుస్తక ఎంపికలో స్వేచ్ఛ×

పెద్దలు తల్లిదండ్రులు పిల్లలకు నచ్చిన పుస్తకాల ఎంపికలో స్వేచ్ఛనివ్వాలి. వారి ఆసక్తిని బట్టి వారికి నచ్చినవి ఎంచుకోనివ్వండి. పిల్లలకు ఇంట్లో ఒక గదిని రీడింగ్ లైబ్రరీకొరకుకేటాయించండి.

లైబ్రరీలో చరిత్ర సామాజిక సాహిత్య ఆధ్యాత్మిక పుస్తకాలు ఉ ండేట్లు ఏర్పాటు చెయ్యాలి. పిల్లల్లో

మానసిక ధైర్య సాహసాలు కలిగించే కథల పుస్తకాలు ఉ ంచాలి. సౌకర్యవంతమైన కుర్చీ లేదా క్యూస్షన్లతో ప్రశాంతంగా చదువుకోడానికి ఏర్పాటు చేయండి

పిల్లలతో లైబ్రరీ సందర్శన×

తల్లితండ్రులు పెద్దలు పిల్లలతో లైబ్రరీ సందర్శనలు క్రమం తప్పకుండా చేయాలి. స్థానిక గ్రంథాలయములకు బాలల గ్రంథాలయాలకు బుక్ షాపులకు పిల్లలను తీసుకెళ్లడం ద్వారా వారు కొత్త పుస్తకాలు చూసి వాటిని చదివేలా ప్రోత్సహించండి. ×ఆటపాటలతో కూడిన పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలి×.

కథలోని పాత్రలను పిల్లలచేత నటింప చేయడం ద్వారా పిల్లల్లో పుస్తక పఠనం పట్ల ఆసక్తి ప్రేరేపించాలి.కథలోని పాత్రలను పిల్లలచేత నటింప చేయడం ద్వారా పుస్తక పఠనంకాంక్షను పిల్లల్లో రగిలించాలి.

పఠనంతో భాషా ప్రావీణ్యం×

పిల్లలకుతెలుగు భాష పై పట్టు కోసం పాతచందమామ పత్రికలు లేదా మనబడి పుస్తకాన్ని చదివించాలి. ఇంట్లో తెలుగు మాట్లాడం తెలుగులో రాయడం తెలుగులో పాటలు పాడడం పిల్లలతో అభ్యాసం చేయించాలి. పిల్లలు తెలుగులో రైమ్స్ చిన్న పిల్లల పాటలు వినడం చేయాలి .

డిజిటల్ పరికరాలు పరిమితి× డిజిటల్ పరికరాలు వాడకం టీ వీ మొబైల్ వినియోగం తగ్గించాలి .ఆ సమయంలో ఆసక్తికరమైన కథలను పుస్తకాలను పిల్లలకు అందుబాటులోఉంచాలి.

పఠనాన్ని ప్రోత్సహించడానికి× ×బహుమతులు ఇవ్వాలి.×

పిల్లలు పుస్తకం పఠనం పట్ల ఆసక్తిని పెంచడానికి తల్లిదండ్రులు పెద్దలు పిల్లలకు ప్రోత్సాహక

బహుమతులు ఇచ్చి పుస్తక పఠనా ప్రక్రియలో వారిని భాగస్వాములను చేయాలి. పుస్తక పఠన పోటీలు నిర్వహించి ఉ త్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ఇవ్వాలి.

పిల్లలకు ప్రశంసలు చిన్న చిన్న బహుమతులు ఇవ్వడం ద్వారా పుస్తక పఠనాన్ని జీవనశైలిలో భాగం చేయాలి . పుస్తక పఠనాన్ని ఆనందకరమైన ప్రయాణంగా మార్చినప్పుడు పిల్లలు సహజంగానే పుస్తక పఠనంపై

ఆసక్తి పెంచుకుంటారు.

పిల్లలు పుస్తకపఠనాన్ని అలవాటు చేసుకుంటే సృజనాత్మకత పెరుగుతుంది.మనో వికాసం వికాసం ఏర్పడి మేధో వికాసానికి దోహదపడుతుంది.

పిల్లలు ఏ రంగం వైపు మొగ్గు చూపుతున్నారో గుర్తించాలి ఆ దిశగా వారిని ప్రోత్సహించాలి. డ్రాయింగ్ పేపర్ క్రాఫ్ట్స్ మట్టితో చేసిన బొమ్మలు పిల్లల్లో సృజనాతకతను పెంచుతాయి .సమాజంలో జరిగే సంఘటనలు జాతీయ సమస్యల పట్ల స్పందించే తత్వాన్నిపిల్లలకు ఉపాధ్యాయులు తల్లితండ్రులు నేర్పాలి. సామాజిక సమస్యలపై వ్యాస రచన వక్తృత్వ పోటీల్లో పిల్లల్ని ప్రోత్సహించి వారిలో నూతన ఆలోచనలను

ప్రేరేపించాలి .అధ్యాపకులు ఉపాధ్యాయులు సమిష్టిగా పిల్లల సర్వతోముఖ వికాసానికి సమిష్టిగా కృషి చేస్తేనే విజ్ఞాన వంతమైన సమాజం ఏర్పడుతుంది.

(డిసెంబర్ 19 బి29 వరకు హైదరాబాదులో జరిగే 38 హైదరాబాద్ బుక్ ఫెయిర్ సందర్భంగా

పిల్లల్లో పుస్తక పఠనాసక్తిని పెంచడంపై రాసిన వ్యాసం×)

నేదునూరి కనకయ్య అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం

తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం

కరీంనగర్9440245771

# సమస్యలతో సర్పంచ్ లకు స్వాగతం

హైదరాబాద్, డిసెంబర్ 19

దీర్ఘకాలికంగా గ్రామాలలో సర్పంచ్ పాలకమండలి పరిపాలన లేకపోవడంతో గ్రామాలలో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయి. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గ్రామాలలో గ్రామ సర్పంచులు పాలకమండలి సభ్యులు గ్రామాల అభివృద్ధిలో కీలక భాగస్వామ్యంగా ఉన్నారు. గత సర్పంచులు పాలకమండలి సభ్యులు పదవీకాలం ముగిసిన దగ్గర నుండి గ్రామాలలో సరి అయిన పరిపాలన లేకపోవడం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే గ్రాంట్లు, అభివృద్ధి పథకాలకు ఇచ్చే నిధులు ఆగిపోవడంతో గ్రామాలలో అభివృద్ధి కుంటుబడింది.గ్రామపంచాయతీలకు కొత్త సర్పంచులు రావడంతో వారికి గ్రామాలలో అనేక సమస్యలు తో పాటు అభివృద్ధి పనులు , కేంద్ర రాష్ట్ర సంక్షేమ పథకాలను అమలుపరచడంలో కీలకం కానున్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం కూడా సర్పంచులు పాలక మండలి సభ్యులు లే గ్రామాల అభివృద్ధిలో కీలక భాగస్వామ్యం కానున్నారు.సర్పంచ్ పాలకమండలి ఆధ్వర్యంలో గ్రామాలు అభివృద్ధిలో రూపురేఖలు మారనున్నాయి.మండలంలో కొత్తగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ లు పాలకమండలి సభ్యులకు గ్రామాలు స్వాగతం పలుకుతూనే, వివిధ సమస్యలు కూడా స్వాగతం పలుకుతున్నాయి. 31 గ్రామపంచాయతీలలో గత సర్పంచులు పాలక మండలి సభ్యులు పదవీకాలం ముగిసిన తర్వాత, దీర్ఘకాలికంగా గ్రామాలలో పరిపాలన లేక అంతర్గత రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించడం, డ్రైనేజీ కాలువలలో కూడికలు తీయించడం , పారిశుధ్య పనులను చేయించడం , విద్యుదీకరణ పనులు, స్వచ్ఛమైన త్రాగు నీటి సౌకర్యం గ్రామాలలో ప్రజలందరికీ కల్పించడం, రైతులకు పంటలు పండించేందుకు సాగునీరు అందించడం, యువతకు, నిరుద్యోగులకు స్వయం ఉ పాధి పథకాలను అందించడం, కొన్ని గ్రామాలలో సరియైన రోడ్లు వసతి లేకపోవడం,గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించడం, బస్ షెల్టర్ నిర్మించడం, విద్య, వైద్యం, గృహం వసతి పేదలందరికీ అందుబాటులోకి తీసుకురావడం, కొన్ని గ్రామాలలో కోతుల బెడద వంటి సమస్యలు సర్పంచులకు దర్శనమిస్తున్నాయి. కొత్తగా పదవీ బాధ్యతలు చేపట్టిన సర్పంచులు పాలక మండల సభ్యులు స్థానిక రాజకీయాలతో సంబంధం లేకుండా గ్రామ ప్రజలందరినీ అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తూ గ్రామాల ప్రజలు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేస్తూ తమ పదవీకాలంలో గ్రామాలు రూపురేఖలు , మార్చాలని గ్రామ ప్రజలను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకుపోవాలని వారిని మనస్ఫూర్తిగా అభినందించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షిద్దాం.

# అప్రమత్తత ద్వారా విపత్తుల సమయంలో ప్రాణ నష్ట నివారణ

## –ఈనెల 22 వ తేదీన విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ విజయవంతంగా నిర్వహించాలి.
## –రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 19 ( భారత శక్తి):ముందస్తు అప్రమత్తత ద్వారా విపత్తుల సమయంలో ప్రాణ నష్టాలను నివారించవచ్చునని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు.



శుక్రవారం, ప్రకృతి విపత్తుల నిర్వహణకు సంబంధించి మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమ నిర్వహణ, వైపరీత్యాల నివారణ నిర్వహణ చర్యలపై సిఎస్ రామకృష్ణ రావు, జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ) అధికారులతో కలిసి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఈ నెల 22 న విపత్తుల నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ లను ఆదేశించారు. ముందస్తు అప్రమత్తత ద్వారా విపత్కర సమయాల్లో ప్రాణ నష్టాలు నిర్వహించడంతో పాటు, ఆస్తి నష్టాలు తగ్గించగలుతామని చెప్పారు. పరిస్థితులను అంచనా వేయగలిగితే నష్టాలను తగ్గించగలుగుతామని వివరించారు. వైపరీత్యాల సమయంలో సమాచార మార్పిడి అత్యంత కీలకమని అన్నారు. ఇందుకోసం అవసరమైన అన్ని సాధనాలు వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. వైపరీత్యాల సమయంలో ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా పని చేయాలని పేర్కొన్నారు. దాదాపు 35 శాఖలు సమన్వయంతో మెలగాలని తెలిపారు. వర్షపాతం, ప్రాజెక్టుల నీటిమట్టం, నీరు విడుదల, వంతెనలు, రోడ్ల స్థితి వంటి అంశాల రియల్ టైమ్ సమాచారం ప్రజలకు చేరవేయాలని చెప్పారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు అవసరమగు అన్ని సేవల టోల్ ఫ్రీ నంబర్ల సమాచారం ప్రజలందరికీ తెలిసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ, వైద్య సేవలు అనేవి వైపరీత్యాల సమయంలో అత్యంత కీలకమని అన్నారు. రాష్ట్రంలోని ఎస్డిఆర్ఎఫ్ బృందాలకు ఎన్డిఆర్ఎఫ్ బృందాలు సహకారం అందిస్తాయని తెలిపారు. అవసరమైతే అత్యవసర సమయాల్లో హెలికాప్టర్ సేవలు వినియోగించుకోవచ్చు అని అన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

అనంతరం జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ అధికారులు విపత్తు నివారణ చర్యలపై వలు అంశాలను కూలంకషంగా చర్చించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, జిల్లాల్లో విపత్తుల నిర్వహణకు అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని అన్నారు. ఈ నెల 22 న విపత్తు నిర్వహణపై మాక్ ఎక్సర్సైజ్ విజయవంతంగా నిర్వహిస్తామని అన్నారు. ప్రజలకు విపత్తుల సమయంలో రక్షణ పొందేలా అవగాహన కార్యక్రమాలు కల్పించామని చెప్పారు. గత వర్షాకాలం జిల్లాలో ఎన్నడూ లేని విధంగా భారీ వర్షాలు కురిసి, వరదలు సంభవించాయని తెలిపారు. ముందస్తు అప్రమత్తత, స్పష్టమైన ప్రణాళికలు, విపత్తుల అంచనా, ఎన్డిఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ బృందాల సమన్వయ చర్యలు, అధికార యంత్రాంగం, ప్రజల సహకారం తో ఎటువంటి నష్టాలు లేకుండా వరదలను ఎదుర్కొన్నామని వివరించారు. మున్ముందు కూడా ఎటువంటి నష్టాలు కలుగకుండా సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఇటీవలి ప్రతి మండలానికి ఒకటి చొప్పున అత్యవసర సమయాల్లో ఉపయోగపడే వస్తువులతో కూడిన కిట్ ను అందించామని చెప్పారు. మరింత విస్తృతంగా ప్రజలకు విపత్తుల సమయంలో రక్షణపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో సర్పంచుల పాత్ర కీలకం: ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

కరీంనగర్, డిసెంబర్ 19(భారతశక్తి ప్రతినిధి):

గ్రామాల అభివృద్ధిలో సర్పంచులదే కీలక పాత్ర అని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లో శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామ సర్పంచ్ (స్వతంత్ర) కొంకటి రవితోపాటు వార్డు సభ్యులు గాజుల మహేందర్, కుక్కల రాజమ్మ, రెడ్డి భారతి, మాతంగి వేణు తదితరులు



కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాభివృద్ధి విషయంలో సర్పంచులు భేషజాలకు పోకుండా వార్డు సభ్యులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. అందరి భాగస్వామ్యంతో ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని ఆయన పేర్కొన్నారు. పార్టీలో చేరికల ద్వారా వారంతా కాంగ్రెస్ కుటుంబంలో సభ్యులు కావడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పాటుపడాలన్నారు. నూతన సర్పంచులు గ్రామాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించడమే కాకుండా సంక్షేమ పథకాల అమలులో ముందుండాలన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యుడు, మాజీ జట్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, పార్టీ నాయకులు కుర్ర ఓదెలు, గుడిపాటి శ్రీనివాస్ రెడ్డి, గట్టు తిరుపతి, బందారు తిరుపతి, గొట్టె మధు, మధుకర్, గాజుల మహేశ్, రాయిని రమేశ్, జనగాం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల అభివృద్ధికి 9.15 కోట్ల నిధులు మంజూరు

## – టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి
## – అధికారులను ఆదేశించిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 19:



సంగారెడ్డి మండలంలోని 18 చెరువుల మరమ్మతులు, ఆధునీకరణ కోసం రూ. 9.15 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ మేరకు జగ్గారెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ కలిసి విన్నవించారు. మల్కాపూర్ పెద్ద చెరువు మేకవనం పల్లి కత్వా నుంచి వచ్చే 15 కిలోమీటర్ల ఫీడర్ ఛానల్, పెద్ద చెరువు నుంచి కలాబ్ గురుకు వెళ్లే 9 కిలోమీటర్ల మేర కాలువ, పెద్ద చెరువు ఆయకట్టుకు వెళ్లే 4 కిలోమీటర్ల మేర కాలువ ఆధునికరించాలని కోరారు. వెంటనే స్పందించిన మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి జగ్గారెడ్డి కోరిన మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ... పెద్ద చెరువు కట్ట వెడల్పు సుందరీకరణ ఆధురీకరణకు రంగం సిద్ధం చేయాలన్నారు. ఈ మేరకు పనుల వివరాలను మీడియాకు వెల్లడించారు. మేకవనం పల్లి తత్వ నుంచి మల్కాపూర్ చెరువు వరకు 15 కిలోమీటర్ల ఫీడాల్ ఛానల్ అభివృద్ధి, మల్కాపూర్ పెద్ద చెరువు నుండి నీళ్లు వెళ్లే కళాపూర్ గ్రామంలోని నాగులకుంట మొగుళ్ళకుంట గొల్ల కుంట పులి వానికుంట పెద్ద చెరువు వరకు 9 కిలోమీటర్ల మేరకు కాలువ ఆధునీకరణ, మల్కాపూర్ చెరువు నుంచి 4 కిలోమీటర్ల మేర ఆయకట్టుకు వెళ్లే పంట కాలువల ఆధునీకరణ, స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ సలహాల ప్రకారం మల్కాపూర్ పెద్ద చెరువు కట్ట బలోపేతం చేయడం, వెడల్పు సుందరీకరణ ఆధునీకరణ చేపట్టాలన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలోని మల్కాపూర్ చెరువు విస్తీర్ణంలో అతి పెద్దదని 2,600 ఎకరాల ఆయకట్టు కలిగి ఉన్నదని స్పష్టం చేశారు. ఈ పెద్ద చెరువు దశాబ్దానికి పైగా మరమ్మత్తులకు నోచుకోలేదన్నారు. దీని సామర్థ్యం 0.8 టీఎంసీలు అన్నారు. నియోజకవర్గంలోని ఆరు చెరువులకు పెద్దచెరువే ఆధారం అన్నారు. దీనిని ఆధునికరించడం వల్ల కింద ఉన్న చెరువులకు పూర్తిగా నింపడం ఆయకట్టు విస్తీర్ణం పెంచడానికి అవకాశం ఉంటుందన్నారు. దీనితోపాటు మల్కాపూర్ పెద్ద చెరువులో నీళ్లు నిండుగా ఉంటేనే పట్టణంలో భూగర్భ జలాల సమృద్ధిగా ఉంటాయన్నారు. చెరువుల సుందరీకరణ పూర్తయితే పర్యాటకంగా అభివృద్ధి చెందడం జరుగుతుందన్నారు. ఈ నిధులతో పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆయన కోరారు.

# పంచాయతీ ఎన్నికల్లో కరీంనగర్‌కు రాష్ట్రంలో ప్రథమ స్థానం

## జిల్లా కలెక్టర్ కు టీఎన్జీవోల, టీజీవోల కృతజ్ఞతలు

కరీంనగర్, డిసెంబర్ 19(భారత శక్తి ప్రతినిధి):

కరీంనగర్ జిల్లాలో ఇటీవల మూడు దశల్లో నిర్వహించిన పంచాయతీ ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, అత్యంత సమర్థవంతంగా పూర్తిచేసినందుకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి టీఎన్జీవోల, టీజీవోల సంఘంల ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కరీంనగర్ జిల్లాలో ఎన్నికల ప్రక్రియను పూర్తిచేసి కరీంనగర్ జిల్లాను ముందువరుసలో నిలిపినందుకు జిల్లా యంత్రాంగంలో సమన్వయం ప్రశంసనీయమని టీఎన్జీవోల జిల్లా అధ్యక్షులు, ఎంప్లాయిస్ జేఏసీ ఛైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, టీజీవోల జిల్లా అధ్యక్షులు, జేఏసీ కన్వీనర్ మడిపెల్లి కాళీ చరణ్ గౌడ్ పేర్కొన్నారు.ప్రజలకు, ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దిగ్విజయంగా ఎన్నికలను నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన ఎన్నికల అధికారులు, పోలింగ్ సిబ్బంది, భద్రతా సిబ్బందిని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంగం లక్ష్మణరావు, నాయకులు అరవింద్ రెడ్డి, గడ్డం సుధాకర్, ముప్పిడి కిరణ్ కుమార్, ఒంటెల రవీందర్ రెడ్డి రాగి శ్రీనివాస్, సర్దార్ అరవింద్ సింగ్, అభినవ రెడ్డి, మహేందర్ రెడ్డితో పాటు నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు కోటా రామస్వామి, శంకర్ శ్రీనివాస్ తదితర ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.



# వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయండి

## కిషన్ నగర్ ప్రజల ఇబ్బందులను తీర్చండి
## టౌన్ ఏడిఈకి కాంగ్రెస్ నేత అనంతుల వినతి

కరీంనగర్, డిసెంబర్ 19(భారతశక్తి ప్రతినిధి):

కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని కిసాన్ నగర్ రోడ్ నెంబర్ 5 డి లో పలు విద్యుత్ స్తంభాలు శిథిలావస్థలో మారి ప్రమాదకరంగా ఉన్నాయని ప్రజలు ఇబ్బందులు తీవ్రమైన పడుతున్నారని, వీటి స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నేత అనంతుల రమేష్ కరీంనగర్



నగర ఏడీఈకి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కిసాన్ నగర్ లో రోడ్ల నిర్మాణం వల్ల విద్యుత్ స్తంభాలు కిందికి వంగిపోయాయని తీగలు ప్రమాదకర స్థితిలో వేలాడుతున్నాయని ఆయన వివరించారు. రాత్రి వేళల్లో వాహనదారులు ప్రజలు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను గమనించలేకపో తున్నారని ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. చేతులకు అందే స్థితిలో విద్యుత్తి గల ప్రమాదకరంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ స్తంభాలు శిథిలావస్థలో మారాయని రోడ్డుపై పడే అవకాశం ఉందని వాటి స్థానంలో 10 వరకు కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను అధికారులు స్పందించి వెంటనే సరి చేయాలని తెలిపారు. దీంతో ఏడీఈ పంజాల శ్రీనివాస్ గౌడ్ స్పందించి విద్యుత్ స్తంభాలకు సంబంధించిన ఎస్టిమేషన్ తయారుచేసి కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే విద్యుత్ తీగలను సరిచేస్తామని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యపై సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు.


# రంగుల అన్వేషణలో ప్రతిభా ప్రదర్శన

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 19:

జీఎస్ హెచ్ఎస్ లోని లలిత కళల విభాగం ఆధ్వర్యంలో రంగు అధ్యయన కోర్సు ఫలితాలను ప్రదర్శించే ప్రదర్శనను శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. ఇందులో రంగు సిద్ధాంతం, దాని వ్యక్తీకరణ వినియోగాల యొక్క లోతైన విశ్లేషణను ప్రతిబింబించేలా విద్యార్థులు కళాకృతులను ప్రదర్శించారు. రంగుల ప్రాథమిక అంశాలు, రంగు ప్రణాళిక, దృశ్య సంభాషణలో వాటి పాత్ర యొక్క సమగ్ర అధ్యయనం ద్వారా అభివృద్ధి చేసిన వాటిని ప్రదర్శించారు. పాఠ్యాంశాలలో భాగంగా, విద్యార్థులు లియోనార్డో డా విన్సీ, పాబ్లో పికాసో, విన్సెంట్ వాన్ గోహ్, సాల్వడార్ డాలీ, రాజా రవివర్మ, జామిని రాయ్ వంటి ప్రముఖ కళాకారులచే ప్రేరణ పొందిన మాస్టర్ కలర్ స్కీములను విశ్లేషించి సాధన చేశారు. ఈ కోర్సు చరిత్ర పూర్వం నుంచి వర్తమాన కాలం వరకు కళాత్మక సంప్రదాయాలను ప్రతిబింబించడమే గాక, భారతీయ, పాశ్చాత్య కళా ధోరణులను కలిగి ఉంది. ఇవన్నీ రంగుల వినియోగంపై విస్తృత చారిత్రక, సమకాలీన దృక్పథాన్ని విద్యార్థులకు అందించాయి. లలిత కళల విభాగం ఆచార్యుడు డాక్టర్ ఆదిశేషయ్య సాడే మార్గదర్శనంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు ప్రారంభించారు. జీఎస్ హెచ్ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ శామ్యూల్ థరూర్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్. శాస్త్రి, కోర్సు సమన్వయకర్త డాక్టర్ లలిత సింధూరి తదితరులు విద్యార్థుల సృజనాత్మకత, కళాకృతులలో ప్రదర్శించిన విద్యావరమైన నైపుణ్యాలను అభినందించారు. రంగును శక్తివంతమైన దృశ్య భాషగా విద్యార్థులు అర్థం చేసుకున్నందుకు, నిర్మాణాత్మక కళా విద్య యొక్క ప్రభావానికి ఈ ప్రదర్శన నిదర్శనంగా నిలిచింది.

# గెలిచినా, ఓడినా ప్రజలకు అందుబాటులో ఉండాలి

## తిమ్మాపూర్ బీజేపీ మండల ఎన్నికల ఇంచార్జి లక్ష్మారెడ్డి




కరీంనగర్, డిసెంబర్ 19(భారతశక్తి ప్రతినిధి):

పంచాయితి ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు గెలిచిన, ఓడినా ప్రజలకు అందుబాటులో ఉండాలని స్థానిక ఎన్నికల బీజేపీ మండల ఇంచార్జి నరహరి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. తిమ్మాపూర్ బీజేపీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి అధ్యక్షతన శుక్రవారం కొత్తపల్లి లో సమీక్ష నిర్వహించారు. ఈ ఎన్నికల్లో రాంహన్మాన్ నగర్ సర్పంచ్ గా పిస్క సౌజన్య కిషోర్, ఉప సర్పంచ్ అందె శేఖర్, వార్డు సభ్యులు ఉప్పులేటి ప్రవీణ్, గుంటుక లత, వచ్చునూర్ వార్డు సభ్యులు వీణవంక అంజి, గొల్లపల్లి వార్డు సభ్యులు మారం శివాణి, పోరండ్ల వార్డు సభ్యులు నాంపల్లి సత్తయ్య, పతాకుల చుక్కయ్య, మల్లాపూర్ వార్డు సభ్యులు తాళ్లపల్లి నందకిశోర్, గొల్లన అనిల్, బాలయ్యపల్లి వార్డు సభ్యులు జాడి రాజు లకు మండల పార్టీ పక్షాన శాలువాలతో సన్మానం చేసారు. ఓటమిపాలైన కష్ట సుఖాలు తెలుసుకొని, పార్టీ అండగా ఉంటుందని భరోసా కలిపించినట్లు మండల అధ్యక్షులు తెలిపారు. ప్రతీ గ్రామం లోని బూత్ ల వారిగా పార్టీ ని పటిష్టం చేసుకొని ఓటు ను పొందాలని అన్నారు. ప్రతీ గ్రామం లో జరిగే అభివృద్ధి నిధులన్నీ కేంద్రం లోని ప్రధాని నరేంద్ర మోదీ ఇస్తున్నవేనని వాటిని అత్యధికంగా తీసుకురావడానికి స్థానిక ఎంపీ,కేంద్ర మంత్రి బండి సంజయ్ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్, మండల కార్యదర్శులు కిన్నెర అనిల్, గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, బిజెవైఎం అధ్యక్షులు గడ్డం అరుణ్, కిసాన్ మోర్చా నాయకులు వేల్పుల రవీందర్,కొయ్యడ శ్రీనివాస్,బుర్ర శ్రీనివాస్, వేల్పుల ఓదయ్య, రామిడి మహేందర్ రెడ్డి, తక్కిటి దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సినిమా

# అంతా అబద్ధం




ఓ వ్యాపారిని రూ.60 కోట్లకు మోసం చేసిన విషయంలో బాలీవుడ్ నటి శిల్పాశెట్టి దంపతులపై ముంబైలోని జుహూ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ నెల 17న ఆదాయపు పన్ను శాఖ అధికారులు కర్నాటకలోని నటికి చెందిన బాస్టియన్‌రెస్టారెంట్‌లో సోదాలు నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించి లేట్‌నైట్ పార్టీలకు అనుమతి ఇచ్చినందుకు బెంగళూరు పోలీసులు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశారు. ఆ మరుసటి రోజు శిల్పాశెట్టి నివాసంలో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించినట్లు వార్తలు వచ్చాయి. ఈ వార్తలను నటి ఖండించింది. ఐటీ దాడులు జరగలేదని ఆమె తరపు లాయర్ ప్రకటన రిలీజ్ చేశాడు. రూ.60 కోట్ల కేసు విషయంలో తదుపరి విచారణకు సంబంధించిన ఫాలోఅప్‌కోసమే వచ్చారని వివరణ ఇచ్చాడు. తప్పుడు వార్తలు రాస్తే చట్టపరమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించాడు. ఇదిలా ఉండగా నటి శిల్పాశెట్టి త్వరలోనే అమ్మకై పేరుతో కొత్త రెస్టారెంట్ ప్రారంభించనుంది.



# ఫస్ట్‌లుక్ రిలీజ్

ప్రస్తుతం సినిమాల్లో ఏఐ ప్రధాన భూమిక పోషిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల తేజ సజ్జా ప్రధాన పాత్రలో రూపొందించిన జై హనుమాన్ మూవీ అసాధారణ విజయం సాధించింది. తాజాగా చిరంజీవి హనుమాన్ ది ఎటర్నల్ మూవీ నుంచి ఫస్ట్ లుక్ విడుదలైంది. ఇది అభిమానులకు హనుమంతుడి జీవితం ఆధారంగా రానున్న పౌరాణిక చిత్రం గురించిన అవగాహన వీడియో. సోషల్ మీడియాలో విడుదలైన ఫస్ట్ లుక్ వీడియోకి అద్భుత స్పందన వస్తోంది. రామాయణంలో కీలక పాత్రధారి అయిన హనుమంతుడి జీవితం ఆధారంగా ఇది రూపొందుతోంది. జాతీయ అవార్డు గ్రహీత రాజేష్ మపుస్కర్ దీనికి దర్శకత్వం వహించాడు. మేకర్స్ చెప్పిన ప్రకారం.. ఇది మన దేశపు మొట్ట మొదటి ఏఐ ఆధారిత థియేట్రికల్ చిత్రం. ఈ ప్రాజెక్ట్‌లో కలెక్టివ్ నెట్‌వర్క్, సాంకేతిక విభాగం 50 మందికి పైగా ఇంజినీర్ల బృందం పని చేస్తుంది. కథనంలో ప్రామాణికతను డిఫైన్ చేయడానికి టెక్నికల్ ఎక్స్‌ఫర్ట్స్, సాహిత్య నిపుణులు, రచయితలు వర్క్‌చేస్తున్నారు. 2026లో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ఈ మూవీ థియేటర్లలో విడుదల కానుంది.

# హీరోగా బిగ్‌బీ మనవడు



పొరుగు దేశం పాకిస్థాన్ దురాగతాల నేపథ్యంలో ఇప్పటి వరకు ఎన్నో కథలు బాలీవుడ్ తెరపైకొచ్చాయి. త్వరలో ఇండో పాక్ వార్ నేపథ్యంలో బోర్డర్ 2 కూడా రాబోతోంది. ఇటీవల పాక్ లోని గ్యాంగ్‌స్టర్లతో పాటు ఐఎస్ఐ ఆట కట్టించేందుకు రా చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్ నేపథ్యంలో రూపొందిన ధురంధర్ ఇప్పటికే విడుదలై బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపిస్తోంది. ఈ క్రమంలో 1971 ఇండో పాక్ వార్ నేపథ్యంలో సాగే కథతో మరో సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అదే ఇక్కీస్. ఈ బయోగ్రాఫికల్ వార్ మూవీతో బాలీవుడ్ సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్ మనవడు అగస్త్యనంద హీరోగా పరిచయం అవుతున్నాడు. ఇండియన్ ఆర్మీలోనే అతి చిన్న వయస్కుడైన పరమ్‌వీర్ చక్ర గ్రహీత సెకండ్ లెఫ్టినెంట్ అరుణ్ ఖేత్ర పాల్ రియల్ స్టోరీ ఆధారంగా ఈ మూవీ రూపొందుతోంది. ఇటీవల మృతి చెందిన వెటరన్ యాక్టర్ ధర్మేంద్ర, పాథాల్లోక్, మహారాజ్ ఫేమ్ జైదీప్ అహ్లావత్ కీలక పాత్రల్లో నటించారు. ఇటీవల విడుదల చేసిన ఈ మూవీ ట్రైలర్ సినిమాపై అంచనాల్ని పెంచింది. 21 ఏళ్ల సెకండ్ లెఫ్టినెంట్ బాటిల్ ఆఫ్ బసంతర్ లో పాక్ సైన్యాన్ని ఎలా ఫైట్ చేశాడు అనే అంశాల్ని జోడించి తెరకెక్కిన ఈ సినిమాని వచ్చే ఏడాది జనవరి 1న రిలీజ్ చేస్తున్నారు.

# 'కొత్తలోక: చాప్టర్1'.. ఆ భయంతో గదిలో నుంచి బయటకు రాలేదు

: కల్యాణి ప్రియదర్శన్



2025లో బాగా వినిపించిన సినిమా పేర్లలో 'కొత్తలోక: చాప్టర్1' ముందువరుసలో ఉంటుంది. భాషతో సంబంధం లేకుండా ఆదరణను సొంతం చేసుకొని అత్యధిక కలెక్షన్లతో సరికొత్త రికార్డులు సృష్టించింది. ఈ సినిమా విడుదలకు ముందు తానెంతో భయపడినట్లు ఇందులో ప్రధాన పాత్రలో నటించిన కల్యాణి తాజాగా ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. ''నన్ను సూపర్ హీరోగా ప్రేక్షకులు అంగీకరిస్తారో, లేదోనని భయపడ్డాను. రివ్యూలు వచ్చే వరకూ భయంతో గదిలో నుంచి బయటకు కూడా రాలేదు. నేను కాదు.. మా చిత్ర బృందం మొత్తం అలానే టెన్షన్ పడ్డాం. మేం ఎంత భయపడ్డామో అంత పాజిటివ్ స్పందన వచ్చింది. రివ్యూలు చదవగానే మా ఆందోళన మొత్తం మాయమైంది. రెస్పాన్స్ ఎలా ఉన్నా.. విమర్శలు రాకుండా ఉంటే చాలని భావించాం. మధ్యాహ్నం 3 తర్వాత అందరం గదిలో నుంచి బయటకు వచ్చి సంబరాలు చేసుకున్నాం'' అని కల్యాణి ప్రియదర్శన్ తెలిపారు. చిన్న చిత్రంగా విడుదలై రికార్డులు తిరగరాసింది 'కొత్తలోక: చాప్టర్ 1'. కేవలం మౌత్ టాక్‌తోనే బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించిందీ సినిమా. ప్రపంచవ్యాప్తంగా ఈ మూవీ రూ.300 కోట్లకు పైగా వసూలుచేసింది. అంతేకాదు, అత్యధిక వసూళ్లు రాబట్టిన తొలి మలయాళీ చిత్రంగానూ రికార్డు సృష్టించింది. ప్రస్తుతం ఈ చిత్రం 'జియో హాట్‌స్టార్'లో స్ట్రీమింగ్ అవుతోంది.

# అంతర్జాతీయ ప్రమాణాలతో... 'డెకాయిట్'



''విరామం వచ్చినా పర్వాలేదు... ప్రేక్షకులకు మంచి సినిమా అందించాలన్నదే నా తపన. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందుతున్న 'డెకాయిట్' విషయంలో మేమంతా గర్వపడుతున్నాం'' అన్నారు అడివి శేష్. ఆయన కథానాయకుడిగా... షానియల్ డియో దర్శకత్వంలో రూపొందుతున్న సినిమానే 'డెకాయిట్'. మృణాల్ ఠాకూర్ కథానాయిక. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. గురువారం హైదరాబాద్‌లో టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కథానాయకుడు అడివి శేష్ మాట్లాడుతూ ''ఎక్కడికి పోయాడు? ఏం చేస్తున్నాడు? అంటూ నా గురించి ఎక్స్‌లో చర్చ జరుగుతోంది (నవ్వుతూ). నేను ఎక్కడికీ పోలేదు. ఈ సినిమానే చేస్తున్నా. ఇలా చాలా పెద్ద సినిమా. తెలుగు, హిందీ భాషల్లో చేశాం. నేను, షానియల్ కలిసి రాశాం. తను నా స్నేహితుడు. మేం అమెరికాలో పెరిగాం. తను మన సంస్కృతిని అర్థం చేసుకుని, నేను తన సంస్కృతిని అర్థం చేసుకుని ఒక హైబ్రిడ్ సినిమా చేశాం. అనురాగ్ కశ్యప్ మాకు మార్గనిర్దేశనం చేశారు. మృణాల్ అద్భుతమైన నటనని ఇందులో చూస్తారు. ఈ సినిమా అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందడానికి కారణం నిర్మాత సుప్రియ. సునీల్, జాన్వి ఈ సినిమాని మరింత ముందుకు తీసుకెళుతున్నారు.

# 'ధురంధర్' అలా తీయడం దర్శకుడి గొప్పతనం: రామ్‌గోపాల్ వర్మ

ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చి సూపర్ హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది 'ధురంధర్'. ఇప్పటికే ఈ చిత్రంపై సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపించిన విషయం తెలిసిందే. తాజాగా రామ్‌గోపాల్ వర్మ ఎక్స్ వేదికగా 'ధురంధర్'పై తన రివ్యూ ఇచ్చారు. ఇది భారతీయ సినిమా భవిష్యత్తును మార్చేసిందన్నారు. ''చరిత్రలో ఈ సినిమా ఎప్పటికీ ప్రత్యేకంగా నిలిచిపోతుంది. ఇది ఏ భాషలో తెరకెక్కిందనేదాని గురించి నేను మాట్లాడడం లేదు. ఇది భారతీయ సినిమా. ఎందుకంటే ఇందులో కనిపించే దృశ్యాలు ప్రతి ప్రేక్షకుడి మనసును హత్తుకుంటాయి. ఇప్పటివరకూ ఇలాంటి కథతో ఏ సినిమా రాలేదు. వినోదాన్ని పంచడంతో పాటు ప్రేక్షకుల మనసులు గెలుచుకోవడం చిత్రబృందం సాధించిన పెద్ద విజయం. ప్రారంభం నుంచి ముగింపు వరకూ ప్రతి సీన్ ఎప్పటికీ గుర్తుండేలా తీర్చిదిద్దారు. హాలీవుడ్ చిత్రాల్లా కాకుండా మన నేటివిటీకి దగ్గరగా అంతర్జాతీయస్థాయిలో కథను రూపొందించొచ్చు అని ఆదిత్య నిరూపించారు. సినిమా మొత్తం చూసిన తర్వాత మన మనసుల్లో ఏదోతెలియని భావోద్వేగం నిండిపోతుంది. అలా తీయడం దర్శకుడి గొప్పతనం'' అని రామ్‌గోపాల్ వర్మ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌పై దర్శకుడు ఆదిత్య ధర్ స్పందిస్తూ.. తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఇకపై ఏ మూవీకి దర్శకత్వం వహించినా ఈ పోస్ట్‌ను చూసి తెరకెక్కిస్తానన్నారు. ''నేను ఎన్నోఏళ్ల క్రితం ఒక చిన్న సూట్‌కేస్‌తో ఎన్నో కలలతో ముంబయికి వచ్చాను. రామ్‌గోపాల్ వర్మ దగ్గర అసిస్టెంట్‌గా పని చేసినా చాలనుకున్నాను. ఈరోజు ఆయనే నా సినిమాపై పోస్ట్ పెట్టడం నమ్మలేకపోతున్నా'' అని రిప్లై పెట్టారు. ఆర్జీవీ అభిమానిగా ఈ పోస్ట్ చూసి తన హృదయం ఉప్పొంగుతోందన్నారు.



# ఏటా కొత్త పిక్సెల్ ఫోన్..
# కొత్త అప్‌గ్రేడ్ ప్రోగ్రామ్ తీసుకొచ్చిన గూగుల్

పిక్సెల్ ఫోన్ లవర్స్‌కి గుడ్‌న్యూస్. ప్రముఖ టెక్ సంస్థ గూగుల్ పిక్సెల్ అప్‌గ్రేడ్ ప్రోగ్రామ్‌ను భారత్‌కు తీసుకొచ్చింది. దీనిద్వారా ఏటా కొత్త పిక్సెల్ ఫోన్‌కు మారొచ్చు. లేటెస్ట్ గూగుల్ పిక్సెల్ స్మార్ట్‌ఫోన్ కొనుగోలును ఈ అప్‌గ్రేడ్ ప్రోగ్రామ్ సులభతరం చేస్తుందని కంపెనీ తెలిపింది. మెరుగైన ఫైనాన్సింగ్ సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు పేర్కొంది. ఈ అప్‌గ్రేడ్ ప్రోగ్రామ్‌లో పాల్గొనాలంటే పిక్సెల్ స్మార్ట్‌ఫోన్‌ను కొనుగోలు చేయాల్సిఉంటుంది. 24 నెలల నో కాస్ట్ ఈఎంఐ ప్లాన్‌ను ఎంచుకోవచ్చు. నెలకు రూ.3,333 నుంచి ఈ ప్లాన్లు ప్రారంభమవుతాయి. ఈ పిక్సెల్ ఫోన్‌కు చెల్లింపులు చేసుకుంటూ వెళ్లాక 9వ నెల నుంచి 15వ నెల మధ్య కొత్త ఫోన్ అప్‌గ్రేడ్‌కు అర్హత లభిస్తుంది. వద్దనుకుంటే 24 నెలల ఈఎంఐ చెల్లింపులను పూర్తి చేసి ఫోన్ సొంతం చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం




నాలుగు దశలు ఉంటాయి. తొలుత పిక్సెల్ 10 సిరీస్‌లో ఒక డివైజ్‌ను నో కాస్ట్ ఈఎంఐ కింద కొనుగోలు చేయాలి. 915 నెలల మధ్య కొత్త ఫోన్‌కు అప్‌గ్రేడ్ అవడానికి అర్హత లభిస్తుంది. అప్పుడు గూగుల్ భాగస్వామి అయిన క్యాషిఫైకి.. మీ పాత ఫోన్‌ను విక్రయించాలి. మీ పాత ఫోన్‌కు విలువ కట్టి ఆ మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. ఆ మొత్తంతో మీ పాత ఫోన్ బకాయిని క్లియర్ చేయొచ్చు. ఈ ప్రోగ్రామ్ కింద ఎన్‌రోల్ చేసుకున్న వారికి ఎక్స్ఛేంజ్ బోనస్ కింద రూ.7వేలు లభిస్తుందని, దీంతో పాటు అష్యూర్డ్ బై బ్యాంక్ గ్యారెంటీ కూడా లభిస్తుందని తెలిపింది. బజాజ్ ఫైనాన్స్, క్యాషిఫై, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ భాగస్వామ్యంతో ఈ అప్‌గ్రేడ్ ప్రోగ్రామ్‌ను గూగుల్ అందిస్తోంది. 2026 జూన్ 30 వరకు అప్‌గ్రేడ్ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంటుందని కంపెనీ తెలిపింది.




# ఆసుపత్రి కోసం ఆస్తి ధారపోసిన టెన్నిస్ స్టార్..
# ఈ వార్తలో నిజమెంత?

టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్ ఒక ఆసుపత్రి నిర్మాణం కోసం తన యావదాస్తిని ధారపోశారని, నిరాశ్రయులు, ఎలాంటి బీమా సదుపాయం లేని వారికి ఉచితంగా వైద్య సాయం అందించేలా 1200 పడకలతో అమెరికాలోని లాస్‌ఏంజెలెస్‌లో దాన్ని ఏర్పాటు చేస్తున్నారని సామాజిక మాధ్యమాల్లో ఓ పోస్ట్ వైరల్ అవుతోంది. అందుకోసం తన 500 మిలియన్ డాలర్ల సంపదను ఖర్చు చేశారనేది దాని సారాంశం. రెండోసారి గర్భవతిగా ఉన్న ఆమె.. 114 రోజులుగా టెంట్‌లోనే ఉంటూ ఆసుపత్రి పనులు పరిశీలిస్తున్నారని నిర్మాణ రంగ సిబ్బంది వెల్లడించినట్లు, ఎంఆర్ఐ మెషిన్లను కొనుగోలు చేసేందుకు ఫ్లోరిడాలో తనకున్న పెద్ద భవంతిని కూడా అమ్మేసినట్లు రాసేశారు. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ఈ ప్రచారంలో నిజం లేదని తెలుస్తోంది. వైరల్ అవుతున్న సోషల్‌మీడియా పోస్టులో వాడిన ఫొటోలో




ఆమె ఆసుపత్రిని ప్రారంభించినట్లుగా ఉంది. కానీ నిర్మాణ సిబ్బంది మాత్రం ఆమె టెంట్‌లో ఉండి పనులు పరిశీలిస్తున్నట్టుగా చెప్పారు. ఇక, ఆమె 2023లోనే రెండో బిడ్డకు జన్మనిచ్చారు. కానీ వార్తలో మాత్రం రెండోసారి గర్భవతిగా ఉన్న ఆమె నిర్మాణ పనుల్లో భాగమైనట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ మీడియా కథనాలను బట్టి సెరెనా, ఆమె భర్త అలెక్సిస్ ఒహానియన్ సంపద సుమారు 430 మిలియన్ డాలర్లుగా ఉంది. కానీ జరుగుతున్న ప్రచారంలో ఒక్క సెరెనా సంపదే 500 మిలియన్ డాలర్లుగా పేర్కొన్నారు. దీన్ని బట్టి ఇది పూర్తిగా ప్రచారం కోసం సృష్టించిన ఓ ఫేక్ పోస్ట్ అని అర్థమవుతోంది.




# శ్రీరామ్ ఫైనాన్స్‌లో జపాన్ బ్యాంక్‌కు 20% వాటా

దిల్లీ: ఆర్థిక సేవల రంగంలో మరో అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి తరలివస్తోంది. ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ శ్రీరామ్ ఫైనాన్స్‌లో జపాన్‌కు చెందిన ఎంయూఎఫ్‌జీ బ్యాంక్ రూ.39,168 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఈ మేరకు 20 శాతం వాటా ఆ కంపెనీకి విక్రయించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఒప్పందంలో భాగంగా ప్రిఫరెన్షియల్ ఈక్విటీ షేర్లను శ్రీరామ్ ఫైనాన్స్ జారీ చేయనుంది. దీంతో ఎంయూఎఫ్‌జీ బ్యాంక్‌కు 20 శాతం వాటా లభిస్తుందని శ్రీరామ్ ఫైనాన్స్ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. భారతదేశ రుణ, ఆర్థిక సేవల భవిష్యత్ వృద్ధి సామర్థ్యంపై నమ్మకాన్ని ఈ డీల్ తెలియజేస్తోందని శ్రీరామ్ ఫైనాన్స్ ఓ ప్రకటనలో పేర్కొంది. శ్రీరామ్ ఫైనాన్స్ క్యాపిటల్ బేస్‌ను బలోపేతం చేయడంతో పాటు, వృద్ధిని వేగవంతం చేయడానికి ఈ డీల్ దోహదం చేస్తుందని తెలిపింది. వాటాదారులు, నియంత్రణ సంస్థలు ఆమోదం తెలపాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ భాగస్వామ్యం వల్ల టెక్నాలజీ, ఇన్నోవేషన్, కస్టమర్ ఎంగేజ్‌మెంట్ విషయంలో సుస్థిర వృద్ధి సాధ్యమవుతుందని తెలిపింది. ఇటీవల కాలంలో దేశీయ ప్రైవేటు బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లోకి పెద్ద మొత్తంలో విదేశీ పెట్టుబడులు తరలివస్తున్నాయి. పలు సంస్థలు ఇప్పటికే పెట్టుబడులు




పెట్టగా.. మరికొన్ని ఒప్పందాలు చేసుకున్నాయి. జపాన్‌కు చెందిన ఎస్ఎంబీసీ యెస్ బ్యాంకులో 24 శాతం; ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో వార్‌బర్గ్ పింకస్, అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ వాటా దక్కించుకున్నాయి. ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో మెజారిటీ వాటా కొనుగోలుకు ఎమిరేట్స్ ఎన్‌బీడీ ముందుకురాగా.. ఫెడరల్ బ్యాంకులో న్యూయార్క్‌కు చెందిన బ్లాక్‌స్టోన్ కంపెనీ 9.99 శాతం వాటా కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ నేపథ్యంలో శ్రీరామ్ ఫైనాన్స్‌లోనూ ఎంయూఎఫ్‌జీ రూపంలో అతిపెద్ద ఎఫ్‌డీఐ తరలిరావడం విశేషం.

# మనల్ని మనమే ఛాలెంజ్ చేసుకోవాలి

**: వరుణ్ చక్రవర్తి**

రానున్న టీ20 వరల్డ్‌కప్ 2026 కోసం తన ఆత్మవిశ్వాసాన్ని కాపాడుకుంటూ.. మ్యాచుల్లో తనను తానే ఛాలెంజ్ చేసుకుంటూ సన్నద్ధమవుతున్నట్లు టీమ్‌ఇండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి వివరించాడు. ఇప్పటివరకు 32 టీ20ల్లో అతడు 51 వికెట్లు పడగొట్టాడు. అలాగే టీమ్‌ఇండియా, దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న టీ20 సిరీస్‌లో 6 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ప్రస్తుతం అతడు ఐసీసీ ర్యాంకింగ్స్‌లో వరల్డ్ నం.1 బౌలర్‌గా కొనసాగుతున్న విషయం తెలిసిందే. 'సవాళ్లేమీ లేనప్పుడు మనల్ని మనమే ఛాలెంజ్ చేసుకోవాలి. ఏదైనా ఒక మ్యాచ్ తేలిగ్గా ఉన్నప్పటికీ దాన్ని కూడా ఛాలెంజింగ్‌గా తీసుకోవాలి. ఆత్మవిశ్వాసంతో రైట్ లెన్త్‌లో బౌలింగ్ వేయాలి. అలాగే ప్రత్యర్థులను అర్థం చేసుకోవడం కీలకం. వరల్డ్ కప్‌లో ఇదే ప్రధానాంశం. నేను ఈ విషయంలో రాణిస్తాననే అనుకుంటున్నా' అని వరుణ్




చక్రవర్తి వివరించాడు. 'నా ప్రణాళిక చాలా తేలికగా ఉంటుంది. నా లెన్త్‌లో నేను బౌలింగ్ చేస్తా. కొన్నిసార్లు అది పనిచేస్తుంది. ముఖ్యంగా గత మూడు నెలల నుంచి అది బాగా వర్కౌట్ అవుతోంది. తర్వాతి మ్యాచ్‌లోనూ నేను ఇలాగే ప్రయత్నిస్తా. మనం ఎప్పుడైతే ఆత్మవిశ్వాసంతో ఉండమో.. అప్పుడు మన మైండ్‌సెట్ మన నైపుణ్యాన్ని దెబ్బతీస్తుంది. అందుకే నిత్యం ఆత్మవిశ్వాసంతో ఉండటం కీలకం. అప్పుడే మనం అద్భుత ప్రదర్శనలు చేయగలం. నిలకడగా రాణించడంలో ఇదే అసలు రహస్యం' అని వరుణ్ చక్రవర్తి అన్నాడు. అలాగే తన మొదటి అంతర్జాతీయ మ్యాచ్ గురించి కూడా అతడు మాట్లాడాడు. 'నేను నా తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడినప్పుడు కాస్త ఇబ్బందికి గురయ్యా. తర్వాత నేను అర్థం చేసుకున్నా. ప్రాక్టీస్ చేసి నా బౌలింగ్‌లో కొన్ని మార్పులు చేసుకున్నా. ఇది చాలా కీలకం' అని వరుణ్ చక్రవర్తి అన్నాడు.

# భారత్‌కు భారీగా 'చైనా సరకు'..
# వాణిజ్యలోటు 100 బిలియన్ డాలర్ల పైనే..!

దిల్లీ: భారత్‌చైనా మధ్య వాణిజ్య అంతరం నానాటికీ పెరుగుతోంది. ఓవైపు బీజింగ్ నుంచి మన దేశానికి దిగుమతులు భారీగా ఉంటుండగా.. భారత్ నుంచి చైనాకు ఎగుమతులు మాత్రం చాలా తక్కువస్థాయిలో ఉన్నాయి. దీంతో ఈ ఏడాది చైనాతో మన వాణిజ్యలోటు 106 బిలియన్ డాలర్ల వరకు ఉండొచ్చని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) అంచనా వేసింది. చైనా నుంచి అత్యధికంగా ఎలక్ట్రానిక్స్, మెషినరీ, ఆర్గానిక్ కెమికల్స్, ప్లాస్టిక్ సంబంధ దిగుమతులు పెరుగుతున్నట్లు తెలిపింది.

* **జీటీఆర్ఐ నివేదికలో కీలక అంశాలివే..**

2021లో భారత్‌లోకి చైనా దిగుమతుల విలువ 87.7 బిలియన్ డాలర్లు ఉండగా.. గతేడాది 109.6 బిలియన్ డాలర్లకు పెరిగింది. 2025లో ఆ దిగుమతుల విలువ ఏకంగా 123.5 బిలియన్ డాలర్లు ఉండొచ్చని అంచనా. ఇక, 2021లో చైనాకు మన దేశం నుంచి ఎగుమతి చేసిన వస్తువుల విలువ 23 బిలియన్




డాలర్లు ఉండగా.. గతేడాది నాటికి ఆ మొత్తం 15.1 బిలియన్ డాలర్లకు పడిపోయింది. 2025లో ఎగుమతుల విలువ స్వల్పంగా పెరిగి 17.5 బిలియన్ డాలర్లకు చేరొచ్చని జీటీఆర్ఐ అంచనా వేసింది. అయితే, గతంతో పోలిస్తే ఈ విలువ చాలా తక్కువే. ఎగుమతులు తగ్గుతుండటంతో చైనాతో భారత్‌కు వాణిజ్య లోటు భారీగా ఉంటోంది. 2021లో భారత వాణిజ్య అంతరం 64.7 బిలియన్ డాలర్లుగా ఉండగా.. గతేడాది 94.5 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఈ ఏడాది వాణిజ్య లోటు 106 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. ఈ ఏడాది జనవరిఅక్టోబరు మధ్య చైనా నుంచి అత్యధికంగా ఎలక్ట్రానిక్స్ సంబంధిత పరికరాలు, ఉపకరణాలు దిగుమతి అయ్యాయి. వీటి విలువ 38 బిలియన్ డాలర్ల పైనే ఉంది. ఇందులో మొబైల్ ఫోన్ కాంపోనెంట్స్ (8.6 బిలియన్ డాలర్లు), ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ (6.2 బిలియన్ డాలర్లు), ల్యాప్‌టాప్‌లు (4.5 బిలియన్ డాలర్లు), సోలార్ సెల్స్, లిథియం అయాన్ బ్యాటరీలు వంటివి ఉన్నాయి. ఇక, నవంబరులో చైనాకు 2.2 బిలియన్ డాలర్ల వస్తువులు మన దేశం నుంచి ఎగుమతి అయ్యాయి. ఏప్రిల్‌నవంబరు మధ్య మొత్తం ఎగుమతుల విలువ 12.2 బిలియన్ డాలర్లుగా ఉంది. ప్లాస్టిక్ పరిశ్రమలో ఉపయోగించే నాఫ్తాను ఎక్కువగా ఎగుమతి చేయడంతో.. ఈ ఏడాది పొరుగు దేశానికి మన ఎగుమతుల విలువ స్వల్పంగా పెరిగిందని జీటీఆర్ఐ తెలిపింది.

# బుమ్రా విషయంలో వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్
## చాలా కీలకం: రాబిన్ ఉతప్ప

బౌలింగ్‌లో వినూత్నమైన యాక్షన్, వేగం వల్ల జస్‌ప్రీత్ బుమ్రా శరీరం అధిక ఒత్తిడికి గురవుతోందని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప అభిప్రాయపడ్డాడు. ఈ నేపథ్యంలో బుమ్రా విషయంలో వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ చాలా కీలకమని అతడు సూచించాడు. దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్ ఆడిన బుమ్రాకు వన్డే సిరీస్‌లో విశ్రాంతి ఇచ్చారు. ప్రస్తుతం టీ20 సిరీస్‌లో ఆడుతున్నాడు. వ్యక్తిగత కారణాల వల్ల మూడో టీ20కి బుమ్రా దూరమయ్యాడు. లఖ్‌నవూలో జరగాల్సిన నాలుగో టీ20 పొగమంచు కారణంగా రద్దైన విషయం తెలిసిందే. అయితే కటక్‌లో జరిగిన తొలి టీ20లో టీమ్‌ఇండియా 101 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. ఈ గెలుపులో బుమ్రా కీలక పాత్ర పోషించాడు. 'బుమ్రా ఒక అద్భుతమైన మ్యాచ్ విన్నర్. అతడి వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌ను సరిగ్గా నిర్వహించడం చాలా అవసరం. క్రికెట్‌లో ఫాస్ట్ బౌలింగ్ అనేది సవాళ్లతో కూడుకున్నది. పైగా బౌలింగ్‌లో బుమ్రాది వినూత్న యాక్షన్. అలాగే బంతి వేగమూ ఎక్కువగా ఉంటుంది' అని రాబిన్ ఉతప్ప విశ్లేషించాడు. 'బుమ్రాను జాగ్రత్తగా




కాపాడుకోవాలి. ఆ సమయంలో అతడు తగినంత క్రికెట్ ఆడేలా చూడాలి. ఆటలో మనం అతడి ప్రతిభను చూశాం. రానున్న టీ20 వరల్డ్‌కప్ నేపథ్యంలో అతడు మరింత నిలకడగా రాణిస్తాడని ఆశిస్తున్నా. దక్షిణాఫ్రికా మంచి పోటీ ఇస్తోంది. కానీ ఈ టీ20 సిరీస్‌లో వారు ఆశించిన మేర రాణించలేదు. వారి బౌలింగ్ అద్భుతంగా ఉంది. అయితే వారి బ్యాటింగ్‌లోనే నిలకడ లోపించింది' అని ఉతప్ప పేర్కొన్నాడు. అలాగే మరికొన్ని గంటల్లో అహ్మదాబాద్ వేదికగా జరగనున్న అయిదో టీ20 గురించి కూడా రాబిన్ ఉతప్ప మాట్లాడాడు. 'అహ్మదాబాద్‌లో పోరు రసవత్తరంగా సాగనుంది. ఎందుకంటే సౌతాఫ్రికా ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను సమం చేయాలని చూస్తోంది. వారు ఈ టూర్‌లో బాగా ఆడుతున్నారు. ముఖ్యంగా టెస్ట్ సిరీస్‌ను 20తో కైవసం చేసుకున్నారు. వైట్‌బాల్ క్రికెట్‌లోనూ పోటీ ఇస్తున్నారు. అయితే టీమ్‌ఇండియా మంచి కమ్‌బ్యాక్ ఇచ్చింది. దక్షిణాఫ్రికా మాత్రం విజ యంతో టీ20 సిరీస్‌ను ముగించాలని చూస్తోంది' అని రాబిన్ ఉతప్ప అన్నాడు.

# ప్రభుత్వ భూమిని రక్షించిన ఫారెస్ట్ అధికారులను సత్కరించిన -మొద్దు లచ్చిరెడ్డి

ఎల్బీనగర్, డిసెంబర్ 19 (భారత శక్తి): సాహెబ్ నగర్ కలాన్ రెవెన్యూ పరిధిలోని 201/1 సర్వే నెంబర్ లో ఉన్న 102 ఎకరాల అటవీ భూమి గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్ లోని భాగమేనని సుప్రీంకోర్టు తీర్పునిచ్చినందుకు శుక్రవారం బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ప్రభుత్వ ఆస్తులు పరిరక్షించినందుకు గుర్రంగూడ లోని అటవీ శాఖ ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ బాధ్యత అధికారులదేనని అన్నారు. ఈ ఫారెస్ట్ భూమిలో కొంత భాగం ప్రజల ఆరోగ్యం కోసం అభివృద్ధి చేయాలని అందులో నూతన పార్కును వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పిల్లల ఆట పరికరాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ సంబంధించిన అటవీ శాఖ అధికారులను కోరారు. సానుకూలంగా స్పందించిన అటవీశాఖ అధికారులు వీలైనంత త్వరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పార్కును ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కస్నా నాయక్, బియన్.రెడ్డి నగర్ కాలనీ అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, వైదేహినగర్ కాలనీ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, చైతన్యనగర్ కాలనీ అధ్యక్షులు సంజీవరెడ్డి, మాజీ అధ్యక్షులు భూపాల్ రెడ్డి, దేవి పోచమ్మ ఆలయ చైర్మన్ ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# చైతన్యపురిలో బిఆర్ఎస్ పార్టీలో చేరికలు

ఎల్బీనగర్, డిసెంబర్ 19 (భారత శక్తి): సీనియర్ పార్టీ నాయకులకు కనీస విలువనీయని కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి గులాబీ కండువాలు కప్పుకున్న నాయకులు. చైతన్యపురి డివిజన్ కు చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం బిఆర్ఎస్ డివిజన్ మాజీ కార్పొరేటర్ విఠల్ రెడ్డి ఆధ్వర్యంలో చైతన్యపురి డివిజన్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్, తిరుమల్ రెడ్డిలు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు తోట మహేష్ యాదవ్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, త్రివేది, పవన్, గట్టు శ్రీను, రమణారెడ్డి, వీరన్నయాదవ్, ప్రవీణ్ చారీ తదితరులు పాల్గొన్నారు.

# విల్లాది వీరుడు వీరమనికంటుడు పూజలో
## ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్ పేట్, డిసెంబర్ 19 (భారత శక్తి) : మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్, జీహెచ్ఎంసీ పరిధిలోని బాలాపూర్‌లో ఒంగేటి లక్ష్మారెడ్డి, ఒంగేటి లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పడి పూజ కార్యక్రమంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒంగేటి లక్ష్మారెడ్డి ఇద్దరు కుమారులు ఒంగేటి అశ్విన్ రెడ్డి, ఒంగేటి విశ్వన్ రెడ్డి భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి పడి పూజ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేయగా, బాలాపూర్ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.ఈ కార్యక్రమంలో బాలాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు కళ్లెం ఎల్లారెడ్డి, గుండోజీ రఘునందన్ చారి, చిగురింత పెద్ద నరసింహారెడ్డి, అత్తాపురం శ్రీనివాసరెడ్డి, తిమ్మని గిరేష్, అరవింద్



గౌడ్, మున్నా, పాండు, రితున్ రెడ్డి తదితరులతో పాటు పలువురు గురుస్వాములు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పోరండ్ల, బైరాగిగూడ సర్పంచులను
## ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మీర్ పేట్,డిసెంబర్ 19 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గం పరిధిలో నూతనంగా ఎన్నికైన సర్పంచులను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి ఘనంగా సన్మానించారు. మహేశ్వరం మండలం పోరండ్ల గ్రామ సర్పంచ్ జయమ్మ, కందుకూరు మండలం బైరాగిగూడ గ్రామ సర్పంచ్ కృష్ణతో పాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, ప్రజలు నమ్మకంతో ఓట్లు వేసి బాధ్యతలు అప్పగించినప్పుడు, వారి మధ్యనే ఉంటూ, వారి సమస్యలను సమర్థంగా పరిష్కరించినప్పుడే ప్రజాప్రతినిధుల పదవులకు నిజమైన గౌరవం దక్కుతుందని అన్నారు. ప్రజల విశ్వాసం, నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే ప్రజాసేవలో ప్రధాన లక్ష్యంగా ఉండాలన్నారు.ప్రతి ప్రజాప్రతినిధి విశ్వాసం, సమర్పణతో తమ తమ గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని, పోరాట పటిమతో గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో పోరండ్ల, బైరాగిగూడ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీలోకి వెళ్ళిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల పరిస్థితి అధ్వాన్నం

* **ఎనిమిది మంది ఎంపీలు ఉన్న కాంగ్రెస్ కు 6,726 మంది సర్పంచులు**
* **అదే ఎనిమిది మంది ఎంపీలు ఉన్న బీజేపీ పార్టీకి 697 మంది సర్పంచులు**
* **ఒక్క ఎంపీ కూడా లేని భారాసకు 4 వేల 31 స్థానాలు**
* **385 సర్పంచ్ స్థానాలకు గాను బీజేపీ సాధించింది 6 స్థానాలు**
* **ఇదేమి వింత ఎన్నికలంటున్న పల్లె జనాలు**



హైదరాబాద్, డిసెంబర్ 19 (భారత శక్తి): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ఎనిమిది మంది ఎంపీలు ఉండగా 6,726 సర్పంచ్ స్థానాలు దక్కించుకుని కాస్తా అయిన పరువు నిలబెట్టుకుంది.అదే ఒక్క ఎంపీ కూడా లేని బీఆర్ఎస్ పార్టీ అధికార పార్టీకి ఎదురునిల్చి 4,031స్థానాలలో సర్పంచులను గెలుచుకుంది. కానీ వింత విషయం ఏమంటే బీజేపీ పార్టీకి ఎనిమిది మంది ఎంపీలు ఉన్నా కూడా మొన్న జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో అచ్చంపేట, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో కనీసం సింగిల్ డిజిట్ దాటలేక, హుజూర్ నగర్ నియోజకవర్గంలో అసలు ఖాతానే తెరవకపోయిన దారుణమైన పరిస్థితి ఎదుర్కొంది. మాజీ ఎమ్మెల్యే భారాస నుండి బీజేపిలో చేరిన శానంపూడి సైదిరెడ్డి హుజూర్ నగర్ నియోజకవర్గంలో 124 గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు జరగగా బీజేపీ సాధించిన సర్పంచ్ స్థానాలు 0...మాజీ ఎమ్మెల్యే భారాస నుండి బీజేపీలో చేరి ప్రతిపక్ష నాయకుల మీద అవాక్కులు చేవాక్కులు పలికిన గువ్వల బాలరాజు, అచ్చంపేట నియోజకవర్గంలో 178 గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు జరగగా బీజేపీ సాధించిన సర్పంచ్ స్థానాలు 2.. మాజీ ఎమ్మెల్యే భారాస నుండి బీజేపీలో చేరిన అరూరి రమేష్ వర్ధన్నపేట నియోజకవర్గంలో 83 గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు జరగగా బీజేపీ సాధించిన సర్పంచ్ స్థానాలు 4.ఈ ఫలితాలు చూసి మూడు నియోజకవర్గంలోని పల్లె జనాలు ఇదెక్కడి వింత ఎన్నికలని ముక్కు మీద వేలేసుకుంటున్నారు.




# సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలి

**: ఏహెచ్ టియు ఎస్ఐ రాములు నాయక్**

ఎల్బీనగర్, డిసెంబర్ 19 (భారత శక్తి): సమాజం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రాచకొండ ఏహెచ్ టియు ఎస్సై కె. రాములు నాయక్ అన్నారు. రాచకొండ పోలీస్ కమీషనర్ ఆదేశానుసారం యస్ఓటి ఎల్బీ నగర్ ఇంచార్జ్ అడిషనల్ డిసిపి యండి షాకీర్ హుసేన్ సూచనల మేరకు శుక్రవారం సరూర్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలకార్మికులు, నిర్బంధ కార్మికులుగా పని చేయించే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలబాలికలపై లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు, బాలికలను, మహిళలను మోసపూరితంగా బలవంతంగా అపహరించి బలవంతపు వ్యభిచారం చేయించినా చట్టరీత్యా నేరమన్నారు. బాలలను అమ్మి వారితో బిక్షాటన చేయించడం బాలికలను వేధించడం, సైబర్ క్రైమ్స్ చేయించడం, అవయవాల మార్పిడికి వీళ్ళను ఉపయోగించడం, మహిళలకు ప్రయాణంలో టి సేఫ్ అప్లికేషన్ ఉపయోగించడం,రోడ్డు భద్రత, మత్తు పదార్థాల వాడకం, కొత్త చట్టాల పైన అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏహెచ్ టియు ఎస్సైలు జి. వెంకట శ్రీను, ఎండి ఖలీల్ అహ్మద్, ఏఎస్సై ఎన్.అనురాధ సిబ్బంది కె.లలిత, కె.అరుణ కాలేజీ ప్రిన్సిపల్ రేణుకుంట్ల అనురాధ, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్వరం సర్పంచ్ నవీన్‌ను
# అభినందించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



మహేశ్వరం, డిసెంబర్ 19 (భారత శక్తి): మహేశ్వరం మండలంలో మహేశ్వరం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ప్రత్యర్థులను మట్టి కరిపించి ఎన్నికలలో ఘన విజయం సాధించిన మునగపాటి నవీన్‌తో పాటు ఉపసర్పంచ్, వార్డు సభ్యులందరినీ మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి శాలువాలతో సత్కరించి హృదయపూర్వకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు. గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా నమస్కారాలు తెలుపుతూ ధన్యవాదాలు తెలిపారు. మహేశ్వరం గ్రామ అభివృద్ధి విషయంలో ఎక్కడా వెనకడుగు వేయబోనని, ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నెరవేర్చేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్రోళ్ల చంద్రయ్య, ఆనందం, సుధీర్ గౌడ్, మినాస్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# మీడియా పట్ల వివక్ష సరికాదు– సమస్యలపై తక్షణ నిర్ణయాలు తీసుకోవాలి

* **పెండింగ్ లో ఉన్న ఇండిపెండెంట్ జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల అంశంలో తగు చర్యలుండాలి**



ఖమ్మం బ్యూరో, భారత శక్తి, డిసెంబర్ 19 : మీడియాను నిర్లక్ష్యం చేయరాదని, అర్హత కలిగిన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు సకాలంలో మంజూరు చేయాలని, గతంలో అక్రిడిటేషన్ పొందినవారికి రెన్యూవల్ ప్రక్రియను సులభతరం చేయాలని, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (హెచ్2843) ఖమ్మం జిల్లా అధ్యక్షులు టి.ఎస్. చక్రవర్తి కోరారు. ఖమ్మం జిల్లా లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, టి.డబ్ల్యూ.జె.ఎఫ్ (హెచ్2843) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా పౌర సంబంధాల అధికారి ఎమ్.ఏ.గౌస్ ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టి.ఎస్. చక్రవర్తి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న జర్నలిస్టులు ప్రభుత్వం, ప్రజల మధ్య కీలక వారధిగా పని చేస్తున్నారని తెలిపారు. అయితే అక్రిడిటేషన్, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ ప్రకటనల విషయంలో జర్నలిస్టులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ ప్రకటనల జారీలో చిన్న, మధ్య, పెద్ద పత్రికల మధ్య ఎలాంటి భేదభావం చూపకూడదని స్పష్టం చేశారు. అలాగే చిన్న, మధ్యస్థాయి పత్రికలకు, ప్రభుత్వ ప్రకటనల పంపిణీలో న్యాయం చేయాలని, పెండింగ్‌లో ఉన్న ప్రకటన బిల్లులను వెంటనే చెల్లించాలని, డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు పూర్తిస్థాయిలో అమలు చేసి ఆరోగ్య భద్రత కల్పించాలని, విధి నిర్వహణలో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, భరోసా చర్యలు అమలయ్యేలా ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. గతంలో దరఖాస్తు చేసుకుని, పెండింగ్‌లో ఉన్న ఇండిపెండెంట్ జర్నలిస్టుల సైట్‌ను రీ-ఓపెన్ చేసి, సీనియారిటీ నష్టపోతున్న అర్హత కలిగిన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కమిటీతో సంబంధం లేకుండా ఇండిపెండెంట్ జర్నలిస్టు కార్డులు మంజూరు చేయాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.

# బంగ్లాదేశ్ లో అదుపు తప్పుతున్న పరిస్థితులు... తమ పౌరులకు అలర్ట్ జారీ చేసిన అమెరికా

బంగ్లాదేశ్, డిసెంబర్ 19: పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రాడికల్ సంస్థ ఇంక్విలాబ్ మంచ్ ప్రతినిధి షరీఫ్ ఉస్మాన్ హాదీ మృతితో దేశవ్యాప్తంగా హింస చెలరేగింది. ఈ నేపథ్యంలో అమెరికా, బ్రిటన్ తమ దేశ పౌరులకు కీలక హెచ్చరికలు జారీ చేశాయి. అప్రమత్తంగా ఉండాలని, పెద్ద సభలు, ప్రదర్శనలకు దూరంగా ఉండాలని సూచించాయి. తీవ్ర గాయాలతో సింగపూర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హాదీ, ఆరు రోజుల పాటు మృత్యువుతో పోరాడి శుక్రవారం కన్నుమూశాడు. ఈ విషయాన్ని బంగ్లా తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ గురువారం రాత్రి అధికారికంగా ధృవీకరించారు. హాదీ మృతదేహం శుక్రవారం సాయంత్రం ఢాకాకు చేరుకోనుందని, శనివారం జాతీయ పార్లమెంట్ భవనం ముందు అంత్యక్రియల ప్రార్థనలు జరిగే అవకాశం ఉందని ఢాకాలోని అమెరికా రాయబార కార్యాలయం తెలిపింది. ఈ కారణంగా దేశవ్యాప్తంగా భారీ నిరసనలు, ప్రదర్శనలు జరిగే ప్రమాదం ఉందని పేర్కొంది. శాంతియుతంగా తలపెట్టిన కార్యక్రమాలు కూడా హింసాత్మకంగా మారవచ్చని, కాబట్టి అమెరికా పౌరులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని కోరింది. బ్రిటన్ విదేశాంగ కార్యాలయం కూడా తమ పౌరులకు ట్రావెల్ అడ్వైజరీ జారీ చేసింది. ముఖ్యంగా హింసాత్మక ఘటనలు ఎక్కువగా నమోదవుతున్న చిట్టగాంగ్ కొండ ప్రాంతాలకు వెళ్లవద్దని స్పష్టం చేసింది. అటు, హాదీ మృతికి సంతాపంగా బంగ్లాదేశ్ ప్రభుత్వం శనివారం (డిసెంబర్ 20) జాతీయ సంతాప దినంగా ప్రకటించింది. యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బంగ్లాదేశ్‌లో శాంతిభద్రతలు క్షీణించాయని నివేదికలు వస్తున్నాయి.

## భారత్‌తో సంబంధాల కోసం..
## కీలకమైన డిఫెన్స్ పాలసీపై ట్రంప్ సంతకం

ఢిల్లీ, డిసెంబర్ 19 (భారత శక్తి): భారత్‌తో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలనే లక్ష్యంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలకమైన వార్షిక రక్షణ విధాన బిల్లుపై (డిఫెన్స్ పాలసీ) సంతకం చేశారు. ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనాతో కొనసాగుతున్న వ్యూహాత్మక పోటీలో ఆధిపత్యం సాధించడానికి క్వాడ్ కూటమి ద్వారా భారత్‌తో సంబంధాలను విస్తృతం చేయాలని అమెరికా భావిస్తోంది. ట్రంప్ సంతకం చేసిన ది నేషనల్ డిఫెన్స్ ఆథరైజేషన్ యాక్ట్2026లో భారత్‌తో రక్షణ రంగంలో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడం, క్వాడ్ కూటమి ద్వారా స్వేచ్ఛాయుతమైన, బహిరంగ ఇండోపసిఫిక్ ప్రాంత లక్ష్యాలను సాధించడం, చైనా నుంచి ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొని అమెరికా ప్రయోజనాలను పరిరక్షించడం వంటి అంశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, దేశీయంగా, విదేశాల నుంచి వచ్చే బెదిరింపుల నుంచి దేశాన్ని కాపాడటానికి, రక్షణ పారిశ్రామిక రంగ పునాదులను బలోపేతం చేయడానికి ఈ చట్టం ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. భారత్‌తో రక్షణ రంగంలో మరింత సహకారం ద్వారానే ఇండోపసిఫిక్ రీజియన్ లో చైనాపై ఆధిపత్యం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఈ బిల్లు అమలులోకి వస్తే ఇరు దేశాల మధ్య సంయుక్త సైనిక విన్యాసాలు, రక్షణ వాణిజ్యం, విపత్తుల సమయంలో మానవతా సహాయం, సముద్ర భద్రత వంటి అంశాల్లో సహకారం వంటి ప్రయోజనాలు ఉండనున్నాయి.

## హైదరాబాద్ ఓల్డ్ సిటీలో
## రూ.400 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

హైదరాబాద్, డిసెంబర్ 19 (భారత శక్తి): హైదరాబాద్ పాతబస్తీలో దశాబ్దాలుగా కబ్జాలో ఉన్న అత్యంత విలువైన ప్రభుత్వ భూమికి విముక్తి లభించింది. సుమారు రూ.400 కోట్ల విలువైన 7 ఎకరాల స్థలాన్ని హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ అథారిటీ (హైడ్రా) శుక్రవారం స్వాధీనం చేసుకుంది. కోర్టు కేసులు, పోలీసు ఫిర్యాదులను సైతం లెక్కచేయకుండా ఆక్రమణదారులు ఏర్పాటు చేసిన ఇనుప రేకుల ప్రహరీని తొలగించి, ఆ స్థలం ప్రభుత్వానిదని బోర్డులు ఏర్పాటు చేశారు. బండ్లగూడ మండలం, కందికల్ గ్రామంలోని మహమ్మద్‌నగర్ లలితాబాగ్ ప్రాంతంలో సర్వే నంబర్ 28లో మొత్తం 9.11 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఇప్పటికే 2 ఎకరాలు కబ్జాకు గురై నివాసాలు వెలిశాయి. మిగిలిన 7 ఎకరాలను ఆర్. వెంకటేష్ కుటుంబ సభ్యులు, వారి నుంచి కొనుగోలు చేశానని చెబుతున్న పట్టాభి రామిరెడ్డి తమ ఆధీనంలో ఉంచుకున్నారు. సర్వే ఆఫ్ ఇండియా మ్యాపుల ప్రకారం ఇక్కడ ఒక చెరువు ఉండేదని, దానిని కబ్జాదారులు మట్టితో పూడ్చివేశారని అధికారులు గుర్తించారు. ఈ ఆక్రమణలపై గతంలో రెవెన్యూ అధికారులు భవానీ నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ భూమిని తమదని వాదిస్తూ కోర్టు సమయాన్ని వృథా చేసినందుకు ఆక్రమణదారులకు న్యాయస్థానం కోటి రూపాయల జరిమానా కూడా విధించింది. అయినప్పటికీ వారు భూమిని ఖాళీ చేయలేదు. తాజాగా హైడ్రా అధికారులు పోలీసు బందోబస్తు మధ్య కబ్జాదారుల చెర నుంచి భూమిని విడిపించారు. ఈ చర్యపై స్థానికులు, కుమ్మరివాడి పీస్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు. ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇక్కడి చెరువు, నాలాలను పునరుద్ధరిస్తే వరద ముప్పు తప్పుతుందని స్థానికులు కోరుతున్నారు.

## ఆస్ట్రేలియాలో కాల్పులతో
## హైదరాబాద్‌కు సంబంధం లేదు: డీజీపీ

హైదరాబాద్, డిసెంబర్ 19 (భారత శక్తి): ఆస్ట్రేలియాలోని బోండీ బీచ్‌లో కాల్పులకు పాల్పడిన సాజిద్ అక్రమ్ హైదరాబాద్‌కు చెందినవాడే అయినప్పటికీ, ఆ ఉగ్ర ఘటనతో హైదరాబాద్‌కు సంబంధం లేదని తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆస్ట్రేలియాలో యూదులపై కాల్పులు జరిపిన వారిలో సాజిద్ అక్రమ్‌కు హైదరాబాద్ మూలాలు ఉన్నట్లు బయటపడింది. పాతబస్తీకి చెందిన అతడు 1998లో ఉన్నత విద్యాభ్యాసం కోసం ఆస్ట్రేలియా వెళ్లి, అక్కడే యూరోపియన్ మూలాలున్న వెనెరా గ్రాసో అనే మహిళను వివాహం చేసుకొని స్థిరపడ్డాడు. సాజిద్‌కు హైదరాబాద్ మూలాలు ఉండటంతో, ఈ కాల్పుల ఘటనపై డీజీపీ మరోసారి స్పందించారు. 1998లో ఉపాధి కోసం ఆస్ట్రేలియా వెళ్లిన సాజిద్ అక్రమ్ ఆరుసార్లు భారత్ వచ్చాడని, ఆస్ట్రేలియాలోనే యూరోపియన్ యువతిని వివాహం చేసుకున్న తర్వాత 1998లో భార్యతో పాటు ఒకసారి హైదరాబాద్‌కు వచ్చాడని వెల్లడించారు. 2004, 2009, 2011, 2016లో ఆయన వచ్చాడని అన్నారు. 2016లో ప్రాపర్టీ సెటిల్‌మెంట్ కోసం వచ్చాడని, 2022లో చివరిసారి తల్లి, సోదరిని చూడటం కోసం వచ్చాడని తెలిపారు. కాగా, బోండీ బీచ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 16 మంది మృతి చెందారు.

## ఉద్యోగ అభ్యర్థుల నిజాయితీకి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

హైదరాబాద్, డిసెంబర్ 19 (భారత శక్తి): ప్రభుత్వ ఉద్యోగాల కోసం అభ్యర్థులను ఎంపిక చేసేటప్పుడు వారి నిజాయతీ, సమగ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉద్బోధించారు. ఈ రెండు లక్షణాలు అత్యంత కీలకమని, వీటి విషయంలో ఎలాంటి రాజీకి తావులేదని ఆమె స్పష్టం చేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైన రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల (పీఎస్సీ) చైర్‌పర్సన్‌ల జాతీయ సదస్సును ఆమె ప్రారంభించి కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ, "అభ్యర్థులలో నైపుణ్యాలు లేదా సామర్థ్యాలు తక్కువగా ఉంటే, వాటిని శిక్షణ కార్యక్రమాలు, ఇతర వ్యూహాల ద్వారా మెరుగుపరచవచ్చు. కానీ, సమగ్రత, నిజాయతీ లోపిస్తే మాత్రం పరిపాలనలో అధిగమించలేని పెను సవాళ్లు ఎదురవుతాయి. అందుకే నియామక ప్రక్రియలో చిత్తశుద్ధికి కమిషన్లు పెద్దపీట వేయాలి" అని అన్నారు. ప్రభుత్వ సేవకులుగా బాధ్యతలు చేపట్టాలనుకునే యువతకు సమాజంలోని అట్టడుగు వర్గాలు, బలహీన వర్గాల కోసం పనిచేయాలనే తపన ఉండాలని ఆమె ఆకాంక్షించారు.

**మహిళల పట్ల సున్నితత్వం అవసరం**

ప్రభుత్వ పాలనలో మహిళల అవసరాలు, ఆకాంక్షల పట్ల సివిల్ సర్వెంట్లు మరింత సున్నితంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి నొక్కి చెప్పారు. "పబ్లిక్ సర్వీస్ కమిషన్లు అభ్యర్థులలో జెండర్ సెన్సిటైజేషన్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. అప్పుడే ప్రభుత్వ పథకాలు, సేవలు మహిళలకు మరింత సమర్థవంతంగా చేరతాయి" అని ఆమె వివరించారు. నిష్పాక్షికత, కొనసాగింపు, స్థిరత్వం వంటి కీలక లక్షణాలను ప్రభుత్వ పాలనకు అందించేది 'శాశ్వత కార్యనిర్వాహక వర్గం' అని, ఈ వర్గాన్ని ఎంపిక చేసే బాధ్యత పీఎస్సీలదేనని ఆమె గుర్తుచేశారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలలో ప్రజోపయోగ విధానాలు సక్రమంగా అమలు కావాలంటే ఈ అధికారుల సమగ్రత, సున్నితత్వం, సామర్థ్యం చాలా ముఖ్యమని తెలిపారు.

*** 'వికసిత భారత్' లక్ష్య సాధనలో కీలక పాత్ర**

మారుతున్న సాంకేతిక సవాళ్లను ముందుగానే ఊహించి, నియామక ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయతను బలోపేతం చేయడంపై కమిషన్లు దృష్టి సారించాలని రాష్ట్రపతి సూచించారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా, విభిన్న సంస్కృతులకు నిలయంగా ఉన్న భారతదేశానికి అన్ని స్థాయిలలో సమర్థవంతమైన పరిపాలన వ్యవస్థలు అవసరమని ఆమె పేర్కొన్నారు. "త్వరలోనే ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలని దేశం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే, 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించే దిశగా మనం పయనిస్తున్నాం. ఈ లక్ష్యాల సాధనలో పీఎస్సీలు ఎంపిక చేసే అధికారుల పాత్ర అత్యంత కీలకం" అని అన్నారు. ఈ సదస్సులో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, యూజీసీ చైర్మన్ వినీర్ జోషి తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుతం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది నిమిత్తం హైదరాబాద్ లో ఉండడం తెలిసిందే.

## ఢిల్లీని కమ్మేసిన దట్టమైన పొగమంచు..
## 152 విమానాల రద్దు

ఢిల్లీ, డిసెంబర్ 19 (భారత శక్తి): దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం దట్టమైన పొగమంచు కమ్మేసింది. దీని కారణంగా దృశ్య స్పష్టత తీవ్రంగా పడిపోవడంతో విమాన రాకపోకలపై తీవ్ర ప్రభావం పడింది. ఢిల్లీ విమానాశ్రయంలో ఒకే రోజు 152 విమానాలను రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు. రద్దయిన వాటిలో 79 ఇతర గమ్యస్థానాలకు వెళ్లేవి ఉంటే, 73 నగరానికి వచ్చేవి ఉన్నాయి. ప్రస్తుతం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ 'క్యాట్ III' నిబంధనల కింద పనిచేస్తోంది. దీంతో అనేక విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ప్రయాణికులు తమ విమాన సర్వీసుల సమాచారం కోసం సంబంధిత ఎయిర్‌లైన్స్‌ను సంప్రదించాలని ఎయిర్‌పోర్ట్ అధికారులు ఎక్స్ (ట్విట్టర్) ద్వారా సూచించారు. ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి పలు విమానయాన సంస్థలు కూడా వాతావరణం కారణంగా సర్వీసులకు అంతరాయం కలగొచ్చని ప్రయాణికులకు హెచ్చరికలు జారీ చేశాయి. పొగమంచుతో పాటు వాయు కాలుష్యం కూడా ఢిల్లీని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. గాలి నాణ్యత సూచీ 380కి పడిపోయింది. ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలోని నోయిడా, ఘజియాబాద్‌లలో దృశ్య స్పష్టత 100 మీటర్ల కంటే తక్కువగా నమోదైంది. దీంతో భారత వాతావరణ శాఖ నగరానికి ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఇదే తరహా పరిస్థితి ఉత్తరప్రదేశ్‌లోనూ నెలకొంది. అక్కడ కూడా రానున్న రెండు రోజులకు పొగమంచు హెచ్చరికలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు వాహనాల వేగాన్ని నియంత్రించాలని సీఎం యోగి ఆదిత్యనాథ్ అధికారులను ఆదేశించారు. రేపు కాస్త ఉపశమనం లభించినా, ఆది, సోమవారాల్లో మళ్లీ దట్టమైన పొగమంచు ఏర్పడుతుందని ఐఎండీ అంచనా వేసింది.

## ఏపీ అభివృద్ధికి చేయూతనివ్వండి..
## కేంద్ర మంత్రి నిర్మలతో సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబర్ 19 (భారత శక్తి): ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఇవాళ ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులకు రాబోయే కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించి, అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ మేరకు ఆయన పలు విజ్ఞాపన పత్రాలను కేంద్ర మంత్రికి అందజేశారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రానున్న మూడేళ్లలో రూ.41 వేల కోట్ల ఆర్థిక సహాయం అవసరమని, దీని కోసం వచ్చే బడ్జెట్‌లో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని చంద్రబాబు కోరారు. అలాగే కరవు పీడిత ప్రాంతాలైన రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల సాగు, తాగునీటి అవసరాలు తీర్చేందుకు గోదావరి వరద జలాలను తరలించే పోలవరం నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు ఆర్థిక చేయూత అందించాలని విజ్ఞప్తి చేశారు.

**'సాస్కి'తో ఏపీకి చేయూత**

'పూర్వోదయ', 'సాస్కి' పథకాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు అండగా నిలవాలని సీఎం కోరారు. పూర్వోదయ పథకం కింద గ్రామీణ మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి సహకరించాలని కోరారు. సాస్కి పథకం కింద పెండింగ్‌లో ఉన్న యూనిటీ మాల్, గండికోట పర్యాటక ప్రాజెక్టులతో పాటు, కొత్త మౌలిక సదుపాయాల కల్పన కోసం 202526 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.10,054 కోట్లు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లను దృష్టిలో ఉంచుకుని ఈ కీలక ప్రాజెక్టులకు కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యతనివ్వాలని చంద్రబాబు కోరారు.




## టీఎస్పీబీ వైస్ చైర్మన్ చిన్నారెడ్డి చేతుల మీదుగా
## ప్రశంసాపత్రం అందుకున్న డీసీ బి.శ్రీనివాస్

హైదరాబాద్, డిసెంబర్ 19 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జరుపుతున్న ప్రజావాణి రెండవ వార్షికోత్సవ సందర్భంగా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపుతున్న జిహెచ్ఎంసి సరూర్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ భువనగిరి శ్రీనివాస్ కు శుక్రవారం మహాత్మా జ్యోతిభా పూలె ప్రజా భవన్ లో తెలంగాణ స్టేట్ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డి, ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ డి.దివ్య ఐఏఎస్ ఆఫీసర్ ఇరువురు చేతుల మీదుగా ప్రశంసాపత్రం స్వీకరించారు.

## ఎమ్మెల్యే చొరవతో ఆటా సభ్యుల ఔదార్యం

*** బాధిత కుటుంబానికి 50 లక్షల గోఫండ్**

*** ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన బాధితులు**



ఎల్బీనగర్, డిసెంబర్ 19 (భారత శక్తి): గత అక్టోబర్ 4న అమెరికా డల్లాస్ నగరంలో చదువు కోసం బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ నందు నివాసం ఉంటున్న పోలే. చంద్రశేఖర్ గుర్తు తెలియని దుండగులు జరిపిన కాల్పుల్లో మరణించిన విషయం తెలిసిందే. అయితే అప్పుడు ఆ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి హరీష్ రావు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి బాధితుని ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి చొరవతో మృతదేహాన్ని ఇండియాకు త్వరగా తీసుకొని రావడం జరిగింది. సుధీర్ రెడ్డి బాధిత కుటుంబసభ్యులకు తగు నష్టపరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో ఆయన వినతి మేరకు అక్కడ ఉంటున్న ఆటా (అమెరికన్ తెలుగు అసోసియేషన్) సభ్యులు తప్పకుండా మా వంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. గో ఫండ్ కార్యక్రమంలో భాగంగా దాదాపు యాభై లక్షల రూపాయల వరకు సేకరించామని ఆటా అధ్యక్షులు జయంత్ చెల్లా, కాబోయే ఆటా అధ్యక్షులు సతీశ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సుధీర్ రెడ్డి నివాసానికి వచ్చిన ఆటా సభ్యులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుధీర్ రెడ్డి చొరవ వల్లే ఇన్ని డబ్బులు సేకరించామని తెలిపారు. అతి త్వరలో 50 లక్షల రూపాయలను బాధిత కుటుంభసభ్యులకు అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బాధిత సభ్యులు మాట్లాడుతూ, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చొరవ వల్లే మృతదేహం త్వరగా ఇండియాకు తీసుకొని రావడం జరిగిందని, అలాగే మాకు ఆర్థికసాయం అందించడానికి కృషి చేసిన సుధీర్ రెడ్డికి, ఆటా సభ్యులకు మా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధిత తల్లి సునీత, గుంటి రాజు, దామోదర్, రాజ్ కిరణ్, శివ ముదిరాజ్ పలువురు ఆటా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్భాటాలకు కోట్లు ప్రజాధనం ఖర్చు..!

- మెస్సి ఫుట్‌బాల్ 'మేనేజ్‌మెంట్' రాష్ట్రానికి ఏమైనా లాభమా?
- కోట్ల ఖర్చు కొద్దిపాటి ఫలితం ఏమిటి..?
- ప్రతిపక్షాల ఘాటు విమర్శలు చేస్తున్నా ప్రభుత్వం మౌనం..
- లక్సరీ ప్రచారం కోసం అర్రులు చాచిన రేవంత్ సర్కార్..
- రాష్ట్రంలో సమస్యలే లేనట్టు.. ఈ హంగు ఆర్భాటం ఎందుకు..?
- ఫోటోలకు ఫోజులు లక్షల్లో వసూళ్లు.. ఈ డబ్బు ఎవరికి..?
- డబ్బా కొట్టుకోవడం తప్ప ఒరిగింది ఏమీ లేదంటున్న విశేషకులు..
- సర్పంచ్ ఎన్నికల్లో తిరోగమన అవమానాన్ని దారి మళ్లించడం కోసమే..!
- ఏదైనా పనికొచ్చే పని చేస్తే చరిత్రలో నిలిచిపోతారు..
- " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " అందిస్తున్న స్పెషల్ స్టోరీ..



(స్పెషల్ కరస్పాండెంట్)

**హైదరాబాద్, డిసెంబర్ 19 (భారత శక్తి ) :** మెస్సి పేరుతో జరిగిన కార్యక్రమాల ఉద్దేశం ఏమిటి? అనేది మిలీనియం ప్రశ్నగా మిగిలిపోయింది.. అసలు జరిగిన తంతు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అర్థం అయ్యిందా..? అన్నది శేష ప్రశ్నగానే మిగిలిపోయింది.. ఒక రెండు రోజులు పేపర్లలో, టీవీల్లో, సోషియల్ మీడియాలో మెస్సీ అనే పేరు వినిపించింది తప్ప.. అసలు ఈ మెస్సీ ఎవరు..? ఎందుకు ఆయన హైదరాబాద్ వచ్చాడు..? అసలు ఏమి జరిగింది..? అన్న విషయాలు కూడా గ్రామీణ ప్రాంత ప్రజలకు తెలియలేదంటే అతిశయోక్తి కాదు..

అయితే దీనిపై ప్రభుత్వం చెప్పేది ఒకటే.. రాష్ట్రాన్ని అంతర్జాతీయ క్రీడా మ్యాప్‌లో నిలపడం.. టూరిజం ప్రమోషన్ చేయడం.. యువతలో ఫుట్‌బాల్ సంస్కృతి పెంపకం.. అంతే కాకుండా ప్రైవేట్ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షించడం.. వినడానికి ఇది చాలా బాగా ఉంది.. కానీ వాస్తవమో ఇది జరిగిందా..? అన్న మీమాంశ అందరినీ వెంటాడుతూనే ఉంది..

అయితే మెస్సి పేరు ఉండటంతో అంతర్జాతీయ మీడియా దృష్టి ఒక్కసారిగా రాష్ట్రంపై పడింది. ఇది "సాఫ్ట్ పవర్ డిప్లొమసీ" అంటూ పాలకులు సమర్థించుకుంటున్నారు. అయితే దీనికి అయినా ఖర్చు ఎంత? ఫలితం ఎంత? అనేది ఒకసారి చూద్దాం.. నిజానికి ఇక్కడే అసలు వివాదం మొదలైంది. ఈ ఈవెంట్ నిర్వహణకు కోట్ల రూపాయల ప్రజాధనం కర్పూర హారతిలా ఖర్చు అయిపోయింది.. ఇకపోతే స్పాన్సర్‌షిప్, ప్రభుత్వ నిధుల మధ్య స్పష్టత లేకపోవడం అన్నది పెద్ద మైనస్ పాయింట్.. కాగా టికెట్ల ద్వారా వచ్చిన ఆదాయం ప్రభుత్వ ఖజానాకు ఎంత చేరిందన్న దానిపై ఎన్నెన్నో సందేహాలు వెలువెత్తు తున్నాయి..

ప్రభుత్వం మాత్రం "ఇది పెట్టుబడి, ఖర్చు కాదు" అంటోంది. కానీ ఆ పెట్టుబడి వల్ల వచ్చిన ప్రత్యక్ష ఆదాయం ఏమిటన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం కనిపించడంలేదు.

*** రాష్ట్రానికి నిజంగా ఒరిగిన లాభాలు ఏమిటి..?**

అయితే ప్రభుత్వ వాదన ప్రకారం అంతర్జాతీయ గుర్తింపు లభించింది.. హోటల్, ట్రావెల్, ట్రాన్స్‌పోర్ట్ రంగాల్లో తాత్కాలిక ఉపాధి దొరికింది.. యువతలో క్రీడలపై ఆసక్తి పెరిగింది.

అయితే వాస్తవంగా కనిపించిన లాభాలు చూద్దాం.. ఈవెంట్ ఉన్న కొన్ని రోజులే సందడి నెలకొంది.. ఆ తర్వాత స్థిరమైన స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి మాత్రం కనబడలేదు.. ఇది వాస్తవం.. ఇక పోతే గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు అందిన ప్రయోజనం మాత్రం స్వల్పం.. ఓ రకంగా చెప్పాలంటే శూన్యం..

*** ప్రతిపక్షాల విమర్శలు :**

ప్రతిపక్షాలు ఈ అంశాన్ని రాజకీయ ఆయుధంగా మలుచుకున్నాయి..

"ఇది స్టార్ మేనియా, స్పోర్ట్స్ పాలసీ కాదు" "పాఠశాలల్లో ఆట మైదానాలు లేవు... కానీ మెస్సికి కోట్లు" ఖర్చు అయ్యాయి.."ఇది ప్రజా ప్రయోజనం కాదు, పాలకుల ఇమేజ్ బిల్డింగ్"...

నిజానికి ఆ డబ్బుతో జిల్లాల స్థాయిలో స్టేడియాలు కట్టుంటే వేల మంది క్రీడాకారులు తయారయ్యేవారు అని విమర్శిస్తున్నారు.

అసలు ప్రశ్న ఏమిటంటే...మెస్సి లాంటి గ్లోబల్ ఐకాన్‌ను తీసుకురావడం తప్పు కాదు. కానీ అది దీర్ఘకాలిక క్రీడా విధానానికి దారి తీసిందా? స్థానిక ప్రతిభకు వేదిక కల్పించిందా ప్రజాధనానికి సరైన రిటర్న్ వచ్చిందా?

అన్న ప్రశ్నలకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానం లేదు.

మెస్సి పేరు రాష్ట్రానికి కాసేపు వెలుగు తెచ్చింది.. అందులో సందేహం లేదు. కానీ ఆ వెలుగు ఫ్లాష్‌లైట్ లా ఒక్క క్షణం మెరిసి మాయమైందా? లేక స్థిరమైన క్రీడా విప్లవానికి నాందిగా మారిందా? అన్నది భవిష్యత్తే చెప్పాలి.

*** ప్రజాధనంతో జరిగే ప్రతి ఈవెంట్...**

భావోద్వేగం కాదు, ఫలితమే ప్రమాణం కావాలన్న డిమాండ్ మాత్రం మరింత బలపడుతోంది. రేవంత్ రెడ్డి గారు ఒక్కసారి ఆలోచించాలని మేధావులు సూచిస్తున్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కారించాలి

- * ఇండ్ల స్థలాలు, అక్రిడేషన్ జారీ చేయాలి
- * సంగారెడ్డి జర్నలిస్టుల ప్రెస్ క్లబ్ అందరికి ఉపయోగపడేల చర్యలు తీసుకోవాలి
- * జిల్లా కలెక్టర్ సానుకూల స్పందన
- * టిజెయు జిల్లా అధ్యక్షులు ఎం. గిరి



సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, డిసెంబర్ 19 : సమాజానికి కళ్ల, చెవులుగా వ్యవహరించే జర్నలిస్టులు నేడు అనేక సమస్యల మధ్య పని చేస్తున్నారని జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించటం సరైయింది కాదని తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం. గిరి పేర్కొన్నారు.గురువారం టిజెయు నూతన కమిటీ జిల్లా కలెక్టర్ కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు తగిన శ్రద్ధ చూపడంలో విఫలమవుతున్నాయని తెలిపారు. రాష్ట ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేది జర్నలిస్టులేనన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్థంభంగా గుర్తింపు పొందిన మీడియా ప్రతినిధుల సమస్యలు పరిష్కారమైతేనే పారదర్శక, బాధ్యతాయుత పాలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో తెలంగాణ జర్నలిస్ట్స్ యూనియన్ (టీజెయు) సంగారెడ్డి జిల్లా కమిటీ జర్నలిస్టుల సమస్యలపై తక్షణ జోక్యం చేసి స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించామని పేర్కొన్నారు..ప్రభుత్వ పథకాలు, ప్రజా సమస్యలు, పాలనలోని లోపాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం చోరువ చూపకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వ అధికారుల పనితీరును నిత్యం ప్రజలకు తెలియజేస్తున్నారు. జర్నలిస్టులు భద్రతా లోపం, ఆర్థిక అస్థిరత, ఆరోగ్య సమస్యలు, ప్రభుత్వ అధికారుల సహకారం లభించటం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఈ సమస్యలు మరింత తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. సంగారెడ్డి ప్రెస్ క్లబ్ ఉన్నా జర్నలిస్టులకు ప్రయోజనం లేదన్నారు. గడిచిన 20 ఏండ్ల నుంచి ఏ ఒక్క జర్నలిస్ట్ ఉపయోగపడలేదన్నారు. వేంటనే జర్నలిస్టులకు ఉపయోగ పడేలా చర్యలు చేపట్టాలన్నారు. ఒకే వర్గం ఆధిపత్యం లో ఉండటం సరి కాదన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరడం జరిగిందన్నారు.జర్నలిస్టులకు ఆరోగ్య సంరక్షణ సదుపాయాలు, జర్నలిస్టు గుర్తింపు కార్డులు, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, నివాస స్థలాల కేటాయింపు, వెంటనే కల్పించాలన్నారు. నూతన అక్రెడిటేషన్ కార్డుల జారీ వంటి కీలక డిమాండ్లను ప్రస్తావించారు. నూతన అక్రెడిటేషన్ కార్డుల జారీ విషయంలో ప్రెస్ క్లబ్ చైర్మన్ సమర్థంగా వ్యవహరించడంలో విఫలమయ్యారని వెంటనే తగిన చర్యలు చేయట్టాలని పేర్కొన్నారు. అక్రిడేషన్ కమిటీ లో టిజెయు యూనియన్ అవకాశం కల్పించాలన్నారు. జర్నలిస్టుల సమస్యలు కేవలం సంక్షేమ సదుపాయాలకు మాత్రమే పరిమితం కాకుండా, వారి వృత్తి గౌరవం, ఆత్మగౌరవానికి సంబంధించినవని టీజెయు స్పష్టం చేసింది. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరిగితే అది పరోక్షంగా ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రభావం చూపుతుందని తెలిపారు. స్వేచ్ఛాయుతంగా, నిర్భయంగా వార్తలు రాయాలంటే వృత్తి భద్రత అత్యంత కీలకమని పేర్కొంది.అందుకే జిల్లా యంత్రాంగం ఈ వినతిని సానుకూలంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. సంగారెడ్డి జిల్లా టీజెయు కమిటీ చేసిన ఈ ప్రయత్నం జర్నలిస్టుల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తా యని ప్రభుత్వ చర్యలు కూడిన పాలన, సమస్యల పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక. అప్పుడు మాత్రమే ప్రజల తరపున నిలబడే జర్నలిస్టులకు న్యాయం జరుగుతుందని టీజెయు కృషి చేస్తుందని పేర్కొన్నారు. సంగారెడ్డి ప్రెస్ క్లబ్ జర్నలిస్టులకు నిజంగా ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవడానికి, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్స్ యూనియన్ (టీజెయు), సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, ఉపాధ్యక్షులు శివకుమార్ పోచగౌడ్, మహేష్ గౌడ్, కార్య వర్గ సభ్యులు రాజేష్, గణేష్ జావీద్ తదితరులు పాల్గొన్నారు.

## హిజాబ్ ఘటనకు వ్యతిరేకంగా భైంసాలో గళమెత్తిన ప్రజలు

*** సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్‌కు వినతిపత్రం**



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 19 (భారత శక్తి): నిర్మల్ జిల్లా భైంసా పట్టణానికి చెందిన సామాజిక సేవా సంస్థ, బిహార్ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పై ఒక మహిళా డాక్టర్ గౌరవం, మత స్వేచ్ఛ మరియు రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించినట్లు ఆరోపిస్తూ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారికి ఒక రాతపూర్వక ఫిర్యాదు పంపింది. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, 2025 డిసెంబర్ 15న బిహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలోని ముఖ్యమంత్రి కార్యాలయం 'సంవాద్'లో నిర్వహించిన ఒక అధికారిక కార్యక్రమంలో, డాక్టర్ నుస్రత్ పర్వీన్‌కు నియామక పత్రం అందజేస్తున్న సమయంలో బిహార్ ముఖ్యమంత్రి ప్రజాసమక్షంలో ఆమె హిజాబ్‌ను లాగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటన ప్రభుత్వ అధికారులు మరియు మీడియా సమక్షంలో జరిగినట్టు సమాచారం. ఈ సంఘటన నిజమైతే, ఇది ఒక మహిళ గౌరవం, శారీరక స్వయం నియంత్రణ మరియు మతపరమైన గుర్తింపుపై తీవ్ర దాడిగా భావించాల్సి ఉంటుందని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి చేతుల్లో ప్రజాసమక్షంలో జరిగిన అవమానకర చర్యగా ఇది పరిగణించబడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు మహిళలపై, ముఖ్యంగా మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలపై వివక్షను ప్రోత్సహించే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. ఈ ఘటన భారత రాజ్యాంగంలోని పలు ఆర్టికల్స్‌ను ఉల్లంఘించిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే భారతీయ న్యాయ సంహిత (BNS-2023)లోని సెక్షన్లు 74, 76, 166తో పాటు ఇతర వర్తించే చట్టాల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తీవ్రత ఉన్నప్పటికీ రాజ్యాంగ న్యాయస్థానాలు ఇప్పటివరకు స్వయంచాలకంగా స్పందించకపోవడం పట్ల ఫిర్యాదుదారులు విచారం వ్యక్తం చేశారు. ఇది ప్రజల్లో రాజ్యాంగ రక్షణలపై నమ్మకాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్‌కు కూడా ఒక రాతపూర్వక వినతిపత్రం అందజేశారు. ఈ వినతిపత్రం సమర్పణలో పట్టణంలోని మొత్తం 36 మసీదుల బాధ్యతదారులు, ఇమామ్‌లు, ముయాజ్జిన్లు, అలాగే పలు సామాజిక, రాజకీయ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. శుక్రవారం జుమా నమాజ్ అనంతరం, భైంసా పట్టణంలోని అన్ని మసీదుల వెలుపల ముస్లిం భక్తులు శాంతియుతంగా నిరసన చేపట్టి, మతపరమైన భావాలను దెబ్బతీశారనే ఆరోపణలపై బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ నిరసన పూర్తిగా శాంతియుతమని, మహిళల గౌరవం మరియు రాజ్యాంగ పరిరక్షణ కోసమే ఈ ఉద్యమమని వారు స్పష్టం చేశారు. ఫిర్యాదుదారులు ఈ ఘటనపై స్వతంత్ర దర్యాప్తుకు ఆదేశాలు ఇవ్వాలని, సంబంధిత అధికారుల నుంచి వివరణ కోరాలని, తప్పు నిరూపితమైతే తగిన రాజ్యాంగ, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని భారత రాష్ట్రపతిని విజ్ఞప్తి చేశారు.

## బీజేపీ–ఈడీ వేధింపులు ఆపాలి

- * కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు- గుడిపాటి నరసయ్య
- * పీసీసీ ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు



సూర్యాపేట (భారత శక్తి జిల్లా ప్రతినిధి) డిసెంబర్ 19: కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సోనియా గాంధీ రాహుల్ గాంధీనపైన ఈడి వేధింపులు ఆపాలని కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య,పీసీసీ ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేట పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి బిజెపి కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించిన అనంతరం వారు మాట్లాడారు.నేషనల్ హెరాల్డ్ పత్రికలో పెట్టిన పెట్టుబడులు గాంధీ కుటుంబాల ఆస్తులమ్మి పెట్టినవే అన్నారు. కాంగ్రెస్ ను దేశంలో లేకుండా చేసేందుకు బిజెపి ప్రధాని నరేంద్ర మోడీ కక్షపూరితంగా కుట్ర చేస్తుండని ఆరోపించారు.నేషనల్ హెరాల్డ్ పత్రికలో పెట్టిన పెట్టుబడులు ప్రభుత్వానివని చెప్పడంలో వాస్తవం తెలిపారు.1938లో నెహ్రూ స్థాపించిన నేషనల్ హెరాల్డ్ పత్రిక స్వాతంత్రోద్యమంలో కీలకపాత్ర పోషించిందని గుర్తు చేశారు.పత్రిక దివాలా తీయడంతో వెలుగులోకి తెచ్చేందుకు 2008లో సోనియాగాంధీ రాహుల్ గాంధీ వాళ్ల ఆస్తులు అమ్మి పెట్టుబడులు పెట్టారని ఈ సంగతి బిజెపి ప్రభుత్వం తెలుసుకోవాలన్నారు. ఆ నిధులను కాపాడేందుకు యంగ్ ఇండియా సంస్థను కూడా స్థాపించడం జరిగింద నీ వివరించారు.ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం అవి ప్రభుత్వ ఆస్తులంటూ ఈడిని ఉసిగొలిపి కక్షపూరితంగా దేశంలో కాంగ్రెస్ లేకుండా చేసేందుకు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ లను వేధింపులకు గురిచేస్తుందనీ ఆగ్రహించారు.సుబ్రహ్మణ్యస్వామి ఇచ్చిన దరఖాస్తుతో ఎఫ్ఐఆర్ కూడా చేయకుండా చార్జీ షీట్ దాఖలు చేయడం దుర్మార్గ మైన చర్యగా కాంగ్రెస్ పార్టీ భావిస్తుందన్నారు.గతంలో ఈ కేసు విషయంలో సరైన ఆధారాలు లేక సుప్రీంకోర్టు కొట్టి వేసిందని తిరిగి 2023లో మరో కోర్టు నుంచి కేసు వేయడం బిజెపి కక్షపూరిత చర్యకు అద్దం పడుతుందని ఎద్దేవో చేశారు. స్వాతంతో ఉద్యమం కోసం కాంగ్రెస్ ఆస్తులు పోగొట్టుకుందని బిజెపి కుట్ర పూరిత విధానాలను ప్రజలంతా గమనిస్తున్నారని రెండేళ్లలో తగిన బుద్ధి చెప్పి గద్దె దింపుతామని హెచ్చరించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాలరాశి రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే ప్రయత్నం బిజెపి చేస్తుంది అన్నారు. గాంధీ కుటుంబాలకు నేడు సెంటు భూమిలేదని పత్రికలో పెట్టిన పెట్టుబడులను బూచిగా చూపే ఈడిని ఉసిగొలిపి వేధింపుల పాలు చేయడం మానుకోవాలని డిమాండ్ చేశారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.